


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 సంచిక: 336

SUNDAY Special | ఆదివారం 26-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సఫారీల కల నెరవేరేనా?

కేప్‌టౌన్‌లో నేడు మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్. ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ'. సాయంత్రం గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం.

- 12లో



అమెరికాను వణికిస్తున్న జాంబీ డ్రగ్

'జాంబీ' డ్రగ్‌గా వ్యవహరించే జైలజీన్ అమెరికాను వణికిస్తోంది. కారుచౌక, విచ్చలవిడి సరఫరా కారణంగా అగ్రరాజ్యంలో ఎక్కడ చూసినా డ్రగ్ బానిసలే కనిపిస్తున్నారు.

- 6లో



నేపాల్ అధ్యక్షుడిగా పౌద్యాల్!

దేశాధ్యక్ష ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్‌కు 8 రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి.

- వివరాలు 6లో ▶



కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

బెంగాల్‌లో కేంద్ర మంత్రి నిశిత్ ప్రామాణిక్ కాన్వాయ్‌పై టీఎంసీ మద్దతుదారులుగా భావిస్తున్న కొందరు దాడికి పాల్పడ్డారు.

- వివరాలు 6లో ▶



అమెరికాను వదలని మంచు

అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలను మంచు తుపాను వణికిస్తోంది. దాదాపు 10 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

- వివరాలు 6లో ▶



ప్రధాని అవ్వాలనే నితీశ్ కోరిక

ప్రధాని పీఠంపై కోరికతోనే నితీశ్‌కుమార్ కాంగ్రెస్, ఆర్జేడీతో జట్టుకట్టారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు.

- వివరాలు 6లో ▶



మృతుడు నవీన్

స్నేహితుడిని కత్తితో పొడిచి..

తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి
- యువకుడి శరీర భాగాలను దూరం దూరంగా విసిరేసిన వైనం
- ఆ ఫొటోలు యువతికి వాట్సాప్ ద్వారా పంపి పైశాచికానందం
- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం
- అన్నివైపులా ఒత్తిడి పెరగడంతో లొంగిపోయిన నిందితుడు

10 లో

వివక్షతోనే ఆత్మహత్యలు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మార్కులు, ఆంగ్ల ప్రావీణ్యాన్ని అపహాస్యం చేయడం సరికాదు

- సానుభూతి, నైతికతతో కూడిన విద్యా విధానం అవసరం: సుప్రీం సీజే డీవై చంద్రచూడ్
- దళిత, ఆదివాసీ విద్యార్థుల ఆత్మహత్యలు కలచివేశాయి
- ఆంగ్లం రాని వారిని అంటరాని వారిగా చూడకూడదు
- ఉన్నత–నిమ్న, ధనిక–పేద అనే తేడాలు చూపకూడదు
- మార్కులు, ర్యాంకుల ఒత్తిడితో కూడిన విద్య మంచిది కాదు
- సామాజిక మార్పు కోసం న్యాయమూర్తులు కూడా కృషి చేయాలి
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సీజేఐ సూచన
- కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు సీజే, సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు



శనివారం నల్సార్ యూనివర్సిటీ 19వ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న సీజేఐ జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్

సాక్షి, హైదరాబాద్: ''ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మార్కులను, ఆంగ్ల ప్రావీణ్యాన్ని అపహాస్యం చేయడం వంటి ఘటనలు ఉన్నత విద్యా సంస్థల్లో కొనసాగుతున్నాయి. ఆంగ్లం రాని వారిని అంటరానివారిగా వివక్షతో చూడటం, అసమర్థులుగా ముద్ర వేయడం వంటి విధానాలకు స్వస్తి పలకాలి. ఇలాంటివాటి వల్ల అణగారిన వర్గాల విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు పెరుగుతున్నాయి. ఈ బల వన్మరణాల్లో గ్రామీణ ప్రాంతాల వారు, ముఖ్యంగా దళిత, ఆదివాసీ వర్గాల విద్యార్థులే ఎక్కువని పరిశీలనల్లో తేలింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో ఒత్తిడిని దూరం చేసి, సానుభూతితో వ్యవహరిస్తే.. ఇలాంటి ఘటనలు

మిగతా 2వ పేజీలో ▶

'వైద్యం'లో దేశానికే దిక్సూచి..



బయో ఆసియా ముగింపు సదస్సులో కేటీఆర్ ఉద్ఘాటన

- హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో రాష్ట్ర భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి

- 3లో

సృజన భళా... ఆరోగ్య మేళా...

జీనోమ్ వ్యాలీలో జుబ్లియెంట్ భార్తియా కేంద్రం

- వివరాలు 3లో ▶

పొత్తుకు సై

- బీజేపీని గద్దె దింపేందుకు భావసారూప్య పార్టీలను కలుపుకుంటాం
- త్యాగాలకూ సిద్ధం : కాంగ్రెస్ ప్లీనరీలో పార్టీ చీఫ్ ఖర్గే

6 లో



కాంగ్రెస్ ప్లీనరీలో సోనియా, ఖర్గే

- ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భావసారూప్య పార్టీలతో చేయి కలిపేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. లక్ష్య సాధన కోసం త్యాగాలకు సైతం వెనుకాడబోమని ఉద్ఘాటించారు. రాయ్‌పూర్ పార్టీ ప్లీనరీలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీపైనా విమర్శలు ఎక్కుపెట్టారు.

నా ఇన్నింగ్స్ ముగిసింది — కాంగ్రెస్ ప్లీనరీలో సోనియా వ్యాఖ్యలు - 6లో

సీడబ్ల్యూసీకి ఎవరో? — రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏఐసీసీ పదవులపై చర్చ - 2లో



న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం

ఉక్రెయిన్ సంక్షోభంపై మోదీ... జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌తో భేటీ

6 లో

క్లుప్తంగా...

దేశం సీఎం కేసీఆర్ వైపు చూస్తోంది: మంత్రి హరీశ్



హుస్నాబాద్: 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అంటూ దేశమంతా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వైపే చూస్తోందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శనివారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. కర్ణాటక, మహారాష్ట్ర రైతులు తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తమ రాష్ట్రాల్లోనూ కావాలని, దేశంలో బీఆర్‌ఎస్ రావాలని, కేసీఆర్ లాంటి నాయకుడు కావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉగాది పండుగ తర్వాత రూ.250 కోట్లతో గర్భిణులకు కేసీఆర్ పోషకాహార కిట్లను పంపిణీ చేస్తామని మంత్రి వెల్లడించారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత వైద్యం

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత వైద్య ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్‌ఆర్‌జీఈఏ) కోరింది. ఈ మేరకు శనివారం ఆర్థిక, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావును టీఎస్‌ఆర్‌జీఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దామోదర్‌రెడ్డి, సి.చంద్రశేఖర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎంప్లాయి హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్)లో టీఎస్‌ఆర్‌జీఈఏకు సభ్యత్వం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హరీశ్ హామీ ఇచ్చారని టీఎస్‌ఆర్‌జీఈఏ నేతలు తెలిపారు.

బడుగుల రాజ్యాధికార ప్రదాత వైఎస్ జగన్

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం వైపుగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. శనివారం బీసీ భవన్‌లో సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీ నాయకుల పాత్ర అనే రౌండ్ టేబుల్ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల ఏపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో 18 మంది అభ్యర్థులకు 11 మంది బీసీలను ఎంపిక చేయడం అంటే బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమం జరగలేదని తెలిపారు. మార్చి 13 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో బీసీ నాయకులు వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లాలని జాతీయ స్థాయిలో ఉన్న పార్లమెంటు సభ్యు లందరినీ ఐక్యం చేస్తూ భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు.

'బండి'వి అర్థం లేని వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: వరంగల్‌కు చెందిన వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థం లేనివని, అసలు ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎలా నియమించారోనని టీపీసీసీ అధికార ప్రతినిధి రాంచంద్రారెడ్డి అన్నారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పారు. తెలంగాణలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ఎక్కువగా జరుగుతోందని యూజీసీ స్పష్టం చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రీతి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీన్ని లవ్‌జీహాదీతో పోల్చే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

రేవంత్ తిరిగి టీడీపీలోకి రావాలి: కాసాని జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: తెలుగుదేశంను తల్లి గారి పార్టీ అంటున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ తిరిగి టీడీపీలోకి రావాలని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం నుంచి తెలంగాణలో ప్రారంభమయ్యే ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురించి శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని, 10 రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్దేశించిన పార్టీ సభ్యత్వాలు, వార్డు, గ్రామ, మండల, మున్సిపల్ వార్డు, డివిజన్, కార్పొరేషన్ స్థాయి పార్టీ కమిటీల నియామక ప్రక్రియ నెల రోజుల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుందని కాసాని చెప్పారు. మార్చి 29న పరేడ్‌గ్రౌండ్‌లో టీటీడీపీ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామని, త్వరలోనే పార్టీ రాష్ట్ర కమిటీ వేయనున్నట్లు కాసాని వివరించారు. ఈ సందర్భంగా 16 పార్లమెంటు నియోజకవర్గాలకు పార్టీ పరిశీలకులను ప్రకటించారు.

పెనం నుంచి పొయ్యిలోకి ప్రపంచం!

కంచర్ల యాదగిరిరెడ్డి

పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది ప్రపంచం పరిస్థితి ఇప్పుడు!

కోవిడ్ నుంచి గట్టెక్కామని ఊపిరి పీల్చుకుంటుండగానే బోలెడన్ని ఇతర సమస్యలు చుట్టుముట్టేస్తున్నాయి! రెండేళ్ల వృద్ధిని అందుకొనే క్రమంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోతూండటం ఒకవైపు... రష్యా–ఉక్రెయిన్ యుద్ధం పుణ్యమా అని అదుపుతప్పిన ద్రవ్యోల్బణం ఇంకోవైపు... పలు దేశాల ఆర్థిక విధానాల్లో మార్పుల కారణంగా పేద, ధనిక అంతరాలూ పెరిగిపోతున్నాయి! ఈ నేపథ్యంలో మనిషి ఇప్పుడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏమిటి? రానున్న రెండేళ్లలో ఏమైనా మార్పులొస్తాయా? దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉండే చిక్కుల మాటేమిటి?

ఈ అంశాలన్నింటిపై ఇటీవలే వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఒక సర్వే నిర్వహించింది. గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వే ప్రకారం ఇప్పటి ప్రధాన సమస్య ఏమిటో తెలుసా? బతకడానికయ్యే ఖర్చుల్లో పెరుగుదల! కాస్ట్ ఆఫ్ లివింగ్!

కోవిడ్ నుంచి గట్టెక్కామనుకోగానే చుట్టుముడుతున్న బోలెడు సమస్యలు

వేధిస్తున్న ద్రవ్యోల్బణం, కర్బన ఉద్గారాలు, పేద-ధనిక అంతరాలు

జీవన వ్యయాల పెరుగుదలతో సతమతం అవుతున్న ప్రజలు

వరల్డ్ ఎకనామిక్ ఫోరం తాజా సర్వేలో వెల్లడి



నిపుణుల మాటే..

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సిద్ధం చేసిన గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వే 40కిపైగా దేశాల్లోని వివిధ రంగాల నిపుణుల నుంచి సమాచారాన్ని సేకరించారు. విద్య, వ్యాపార రంగాలతోపాటు ప్రభుత్వ అధికారులు పలువురు నిపుణుల బృందంలో ఉన్నారు. ఈ సర్వేలో రిస్క్ లేదా ముప్పుగా పరిగణించిన అంశాలు ప్రపంచ స్థూల ఉత్పత్తిపై లేదా ప్రజలు, ప్రకృతి వనరులపై దుష్ప్రభావం చూపగలిగేవి. రానున్న రెండేళ్లలో ఈ ముప్పుల తీవ్రత, పరిణామాలు, ప్రభుత్వాల సన్నద్ధత వంటి అంశాలను కూడా ఈ సర్వేలో పొందుపరిచారు.

రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధానికి ఏడాది పూర్తయ్యింది. కోవిడ్ అనంతర పరిస్థితుల్లో మొదలైన ఈ యుద్ధం అనేక రంగాల్లో ప్రపంచ స్థితిగతులను మార్చేసిందనడంలో సందేహం లేదు. పైగా ఇప్పుడిప్పుడే యుద్ధం ముగిసే సూచనలు కనపడని నేపథ్యంలో ప్రపంచం మొత్తం మీద పెరిగిపోతున్న జీవన వ్యయంపై ప్రజల్లో తీవ్రమైన ఆందోళన నెలకొందని గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వే చెబుతోంది. ఇంకో రెండేళ్లపాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని సర్వేలో పాల్గొన్న అధికులు అభిప్రాయపడ్డారు. కోవిడ్‌కు ముందు పరిస్థితులన్నీ బాగున్నప్పుడు పరిశ్రమలకు, కంపెనీలకు బ్యాంకుల ద్వారా చాలా సులువుగా అప్పులు పుట్టేవని, ఇప్పుడా స్థితి లేకపోవడం, మాంద్యం భయంతో ఐటీ కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తుండటం కూడా కాస్ట్ ఆఫ్ లివింగ్‌పై ఆందోళనలు పెరిగేందుకు కారణమైందని ఆ సర్వే తేల్చింది. ఈ నేపథ్యంలో గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వే రాగల రెండేళ్లు, పదేళ్ల కాలవ్యవధుల్లో ఎదుర్కొనే అవకాశమున్న ఐదు అతిపెద్ద ముప్పులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంది.

అన్నీ ప్రియమవుతున్న వేళ...



కోవిడ్ కంటే ముందు కూడా ప్రపంచవ్యాప్తంగా కాస్ట్ ఆఫ్ లివింగ్ పెద్ద సమస్యగానే ఉండేది. కానీ మహమ్మారి పుణ్యమా అని సరఫరాలు నిలిచిపోవడం, డిమాండ్, సరఫరాల మధ్య అంతరం పెరగడంతో పరిస్థితి మరింత దిగజారింది. గతేడాది చివరి నాటికి ద్రవ్యోల్బణం కారణంగా సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఆహారం, నివాసం వంటి కనీస అవసరాలు కూడా అందనంత స్థాయికి చేరుకున్నాయి. రష్యా ఉక్రెయిన్ యుద్ధంతో ఇంధన సరఫరాలపై పలు దేశాలు నియంత్రణలు విధించాయి. ఇది ద్రవ్యోల్బణం తద్వారా కనీస అవసరాల ఖర్చులు పెరిగిపోయేలా చేసింది. నల్ల సముద్రం నుంచి ఆహారధాన్యాల ఎగుమతికి చేసుకున్న ఒప్పందం నుంచి రష్యా తొలగిపోయేందుకు సిద్ధమవుతుండటంతో భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారుతుందని యూరప్ దేశాల సమాఖ్య ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాది మార్చిలో ప్రపంచం సాధారణ ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయికి చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది విషయానికి వస్తే ఇంధన ధరలు గతేడాది జనవరితో పోలిస్తే దాదాపు 46 శాతం వరకూ ఎక్కువగా ఉండనున్నట్లు తెలుస్తోంది. చైనాలో కోవిడ్ నియంత్రణలను సడలించడం వల్ల వినియోగం మరింత పెరిగి ఇంధన, ఆహార ధరలు ఇంకా పెరుగుతాయని, ఇది బ్యాంకుల వడ్డీరేట్ల పెంపునకు కారణమవుతుందన్న భయాందోళనలు అధికమవుతున్నాయని అంతర్జాతీయ ఆర్థిక సంస్థ బ్లూమ్‌బర్గ్ పేర్కొనడం గమనార్హం.

వాణిజ్య యుద్ధాలతో తీవ్ర నష్టం

ఒకప్పుడు దేశాల మధ్య యుద్ధాలు ఆయుధాలతో జరిగేవి. ఇప్పుడు వాణిజ్య ఆర్థికాంశాలపై ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. దీని ప్రభావం ఆయా దేశాలకే పరిమితం కావడం లేదు. ఇతర దేశాలతోపాటు అనేక రంగాలకు విస్తరిస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం సందర్భంలో భారత్, రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడం ఎంత దుమారం రేపిందో తెలియనిది కాదు. రానున్న పదేళ్లలో దేశాల మధ్య ఘర్షణలు మరింత పెరుగుతాయని, అవి వాణిజ్య యుద్ధాలకు దారితీస్తాయని గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వేలో పాల్గొన్న నిపుణులు భావిస్తున్నారు. కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తుండటం, దేశాలు తమ రక్షణ వ్యయాన్ని పెంచుతుండటాన్ని దీనికి నిదర్శనంగా వారు చూపుతున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా నియంత్రణలు, నిషేధాలు విధించినట్లే భవిష్యత్తులోనూ ఆర్థికాంశాలపై దాడులు తీవ్రతరం కానున్నాయని అంచనా. ఆసియా, తూర్పు ఆసియా ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితి ఏర్పడనుంది. సమాజంలో వైషమ్యాల పెరుగుదల విలువలు, సమానత్వాల మధ్య అంతరం పెరిగిపోతుండటం కూడా స్వల్పకాలిక ముప్పుగా పరిగణిస్తున్నారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో వచ్చే విభజన క్రమేపీ రాజకీయాలకు విస్తరిస్తుందని, వలసలు, లింగవివక్ష, జాతి, కులం, మతం ఆధారంగా ఘర్షణలు పెరిగేందుకు కారణమవుతుందని అంచనా. ప్రపంచం నలుమూలలా పలు దేశాల్లో ఘర్షణలు, ఉద్యమాలు పెరిగిపోతుండటం ఇందుకేనని చెబుతున్నారు. ధరల నియంత్రణలో వైఫల్యం, అక్రమ ఆర్థిక వ్యవహారాలపై అదుపు లేకపోవడం వల్ల సమాజం తీవ్రమైన మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అత్యధికులు ఆందోళన వ్యక్తం చేశారు.

వాతావ'రణం'



వాతావరణ మార్పులను ఎదుర్కొనే విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రపంచం ఇప్పుడు అతిపెద్ద ముప్పుగా పరిణమిస్తోంది. సుమారు 30 ఏళ్లుగా చర్చలు జరుగుతున్నా చెప్పుకోదగ్గ ముందడు ఏదీ ఇప్పటిదాకా పడలేదు. వాతావరణంలో ఈనాటి కర్బన ఉద్గారాలను పరిగణనలోకి తీసుకుంటే భూమి సగటు ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ స్థాయికి పెంచరాదన్న లక్ష్యం నెరవేరే అవకాశం కనిపించట్లేదు. గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతం మంది వాతావరణ మార్పులపై ప్రస్తుత స్థితిని తప్పుబట్టారు. 2030 నాటికే సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశాలు ఇప్పుడు 50 శాతమని ఐపీసీసీ అంచనా వేస్తుండటం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం. మరోవైపు పరిస్థితిని ఎదుర్కొనేందుకు జీ–7 దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు. పారిస్ ఒప్పందాన్ని ధనిక దేశాలే తుంగలో తొక్కిన కారణంగా 2050 నాటికే ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువకు చేరుకొనే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు శాస్త్రీయంగా చేయాల్సిన పనులు కాకుండా రాజకీయంగా ఉపయోగకరమైన వాటిపైనే దేశాలు ఆధారపడటం పరిస్థితిని దిగజారుస్తోంది. యూరోపియన్ యూనియన్ తాజాగా శిలాజ ఇంధన ఆధారిత ఫ్యాక్టరీల మరమ్మతులకు, ఇంధనాల కోసం ఏకంగా 5000 కోట్ల యూరోలు ఖర్చు చేస్తుండటం ఇందుకు తార్కాణం. ఈ పరిస్థితి రానున్న రెండేళ్లలోనూ మెరుగయ్యే అవకాశాలు లేవని, దీర్ఘకాలంలో అంటే రానున్న పదేళ్ల వరకూ కూడా వాతావరణ మార్పులపై పోరు మందగమనం ప్రపంచానికి ఒక సమస్యగానే మిగలనుందని అంచనా. టర్కీలో ఇటీవలి భారీ భూకంపం, గతేడాది అకాల వర్షాలు, వరదలు, కరవులు అన్నీ వాతావరణ మార్పులను సూచిస్తున్నా ధనిక దేశాలిప్పటికీ మేలుకోకపోవడం ఆందోళనకరమేనని గ్లోబల్ రిస్క్ పర్‌సెప్షన్ సర్వేలో పాల్గొన్న స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పర్యావరణ విభాగం అధిపతి క్రిస్ ఫీల్డ్ అన్నారు.

సీడబ్ల్యూసీకి ఎవరో?

- రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏఐసీసీ పదవులపై చర్చ
- తెలంగాణకు అవకాశం వస్తుందా లేదా..
- ఏపీ నుంచి సుబ్బిరామిరెడ్డిని కొనసాగించే అవకాశం
- ప్రధాన కార్యదర్శులుగా పరిశీలనలో ఒకరిద్దరు నేతల పేర్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరెవరికి ప్రాతినిధ్యం లభిస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగుతున్న ఏఐసీసీ ప్లీనరీ నేటితో ముగియనున్న నేపథ్యంలో ఈ ప్లీనరీ అనంతరం ఏర్పాటు చేయనున్న సీడబ్ల్యూసీలో ఎవరికి చోటు దక్కుతుందన్న దానిపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న టి.సుబ్బిరామిరెడ్డి (ఆంధ్రప్రదేశ్)తోపాటు తెలంగాణ నుంచి నలుగురైదుగురు నేతలు ఈ రేసులో ఉన్నారు. అయితే, సుబ్బిరామిరెడ్డికి మళ్లీ రెన్యువల్ అవుతుందని, మిగిలిన నేతలకు సీడబ్ల్యూసీలో చోటు దక్కే అవకాశం లేదని 10 జన్‌పథ్ వర్గాలు చెబుతున్నాయి.

కోమటిరెడ్డితో పాటు పలువురు

సీడబ్ల్యూసీ సభ్యత్వం కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దగా డిమాండ్ కనిపించకపోయినా తెలంగాణ నుంచి నలుగురైదుగురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. వీరిలో స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. తనకు సీడబ్ల్యూసీ అవకాశం తప్పకుండా వస్తుందని, సీడబ్ల్యూసీ సభ్యుని హోదాలోనే పాదయాత్రను ప్రారంభిస్తాననే ధీమాతో ఉన్నారు. సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య కూడా సీడబ్ల్యూసీలో స్థానాన్ని ఆశిస్తున్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి పేరు నాలుగైదు నెలలుగా



85వ కాంగ్రెస్ ప్లీనరీలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, ఉత్తమ్, జీవన్‌రెడ్డి, కోమటిరెడ్డి తదితరులు

వినిపిస్తోంది. సీడబ్ల్యూసీకి ఎన్నికలు జరిగితే తాను పోటీచేసి, తెలంగాణ, ఏపీ, కర్ణాటక సభ్యుల ఓట్లతో గెలుపొందాలని ఆయన భావించారు. కానీ సీడబ్ల్యూసీ సభ్యులను ఎన్నిక ద్వారా కాకుండా ఏఐసీసీ చీఫ్ ఎంపిక చేయాలని ప్లీనరీలో నిర్ణయించడంతో ఇప్పుడు తనను ఎంపిక చేస్తారనే నమ్మకంతో ఆయన ఉన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులుగా ఏపీ నుంచి రఘువీరారెడ్డి పేరు వినిపిస్తోంది. ఆయనతోపాటు తెలంగాణలోని ఏఐసీసీ కార్యదర్శుల్లో ఒకరికి ప్రమోషన్ ఇస్తారని తెలుస్తోంది. అయితే, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఇతర రాష్ట్రాలకు పార్టీ ఇన్‌చార్జిగా న్యాయం చేయలేమని, రాష్ట్రంలోనే ఉండాల్సి వస్తుందని కొందరు సీనియర్ నేతలు నిరాసక్తత వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 90 సీట్లు

- అధికారం ఇస్తే ఉచిత విద్య, వైద్యం
- 24 గంటల కరెంట్‌పై రాజీనామాకు సిద్ధమా?
- సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ సవాల్

సాక్షి, యాదాద్రి/స్టేషన్ ఘన్‌పూర్: రానున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 90 అసెంబ్లీ స్థానాల్లో గెలిచి అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్‌ఎస్, కాంగ్రెస్, వామపక్షాలు, టీడీపీ కలిసి గుంపుగా పోటీ చేయబోతున్నాయని, బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 10 లోక్‌సభ స్థానాల్లో గెలుపు ఖాయమన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో 'ప్రజాగోస బీజేపీ భరోసా' సమావేశంలో బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని చెప్పారు. మోటార్లకు మీటర్లు పెడతాం.. రుణాలివ్వాలని కేంద్రానికి లేఖ రాసింది రాష్ట్ర ప్రభుత్వమేనని తాను సవాల్ విసిరితే ఇంతవరకు సమాధానం లేదని సంజయ్ విమర్శించారు. బీజేపీలో సీఎం అభ్యర్థి ఎవరనేది జాతీయ నాయకత్వం నిర్ణయిస్తుందని చెప్పారు. కేసీఆర్ రాష్ట్రాన్ని దివాళా తీయించి రూ.5.30 లక్షల కోట్ల అప్పు చేశారని మండిపడ్డారు. నయీం ఆస్తులను కేసీఆర్ కుటుంబం దోచుకుందని, నయీం డైరీ ఎటుపోయిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్, రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, గూడూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆలేరులో 'ప్రజాగోస- బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

24 గంటల కరెంటుపై రాజీనామాకు సిద్ధమా?

'రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామని ప్రగల్భాలు పలికే సీఎం కేసీఆర్ ఆ విషయానికి కట్టుబడి ఉంటారా? ఇస్తున్నట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేస్తా. లేనిపక్షంలో సీఎం పదవికి రాజీనామా చేస్తారా? స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సవాల్ చేస్తున్నా' అని బండి సంజయ్ పేర్కొన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్ తదితర హామీలన్నీ అమలుకు నోచుకోలేదని, ఇక్కడినుంచి ఇద్దరు డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా ఏమీ చేయలేదని విమర్శించారు. మిషన్ భగీరథ కోసం కేసీఆర్ కుటుంబ సభ్యులు పైపుల కంపెనీలు పెట్టుకున్నారని, కోట్ల రూపాయలు దోచుకున్నారని సంజయ్ ఆరోపించారు.

ఏప్రిల్ 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ మీడియా ప్రతినిధి అమ్మాజీ బమ్మిడి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 48 గంటల పాటు నిర్విరామంగా సాగే కళా ప్రదర్శనల్లో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రాం కన్వీనర్‌గా శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ఆర్గనైజర్‌గా కొల్లి రమావతి వ్యవహరించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనే కళాకారులందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కళాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని, రిజిస్ట్రేషన్ ఉచితమని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 82475 19925 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో గతంలో అంతర్వేదిలో 32 గంటల పాటు కళాకారుల ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. మంచిర్యాలలో 24 గంటల పాటు నిర్విరామ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో తిరుపతిలో జరగనున్న 48 గంటల నిర్విరామ కళా ప్రదర్శనల్లో భాగంగా పలు సాంస్కృతిక రూపాల ప్రదర్శనతో పాటు, పుస్తకావిష్కరణలు, ప్రపంచ కవితోత్సవం నిర్వహించనున్నట్లు అమ్మాజీ వెల్లడించారు.

వివక్షతోనే ఆత్మహత్యలు

▶ మొదటి పేజీ తరువాయి

జరగకుండా వ్యవహరించవచ్చు. ఎదుటివారిని అర్థం చేసుకునే విధానంతో కూడిన విద్యను ఉన్నత విద్యాసంస్థల్లో అందించడం అవసరం'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనంజయ వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. సుప్రీం చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రానికి తొలిసారి వచ్చిన జస్టిస్ చంద్రచూడ్ శనివారం నల్సార్ యూనివర్సిటీ 19వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్, నల్సార్ వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో.. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.రామసుబ్రమణ్యన్, జస్టిస్ పీఎస్ నరసింహతోపాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ముందుగా వర్సిటీ సంప్రదాయం ప్రకారం స్నాతకోత్సవ ఊరేగింపుతో రిజిస్ట్రార్ కె.వి ద్యుల్లతారెడ్డి సీజేఐకి స్వాగతం పలికారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం సీజేఐ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''తమకు చదువు చెప్పినవారినే కాదు.. చదువుకున్న సంస్థ అభివృద్ధికి పాటుపడిన సిబ్బంది, కార్మికుల శ్రమను కూడా విద్యార్థులు గుర్తించాలి. న్యాయశాస్త్ర విద్యార్థులు.. లా సబ్జెక్టులతోపాటు సాహిత్యం తదితర అంశాలపైనా అవగాహన పెంపొందించుకోవాలి. నేను చదువుకున్న రోజులతో పోలిస్తే ప్రస్తుత తరం విద్యార్థులకు సమాచారం, విజ్ఞానం పొందేందుకు అవకాశాలు చాలా విస్తృతంగా ఉన్నాయి. విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించడమే కాదు. సమాజంపై బాధ్యత కూడా ఉంటుంది.



స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్, హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ వి. రామసుబ్రమణ్యన్

సానుభూతి దయాగుణం అవసరం

ఉన్నత–నిమ్న, ధనిక–పేద అనే తేడా లేకుండా అందరినీ న్యాయస్థానాలు సమానంగా చూస్తాయి. ఇదే విధానాన్ని అన్నింటా పాటించాలి. చట్టం అమలు, న్యాయం అందించడంలో సానుభూతి, దయాగుణం, తాత్వికత అనేది చాలా ముఖ్యమైన అంశం. పెద్ద సంఖ్యలో మోటార్ ప్రమాద కేసులను పరిష్కరించేటప్పుడు సాంకేతిక అంశాలతో మానవీయ కోణాన్ని సమతూకం వేస్తూ సుప్రీంకోర్టు ఎన్నో తీర్పులు ఇచ్చింది.

ఒత్తిడితో కూడిన విద్య మంచిది కాదు

మనం విద్యను కూడా సానుభూతి కోణం నుంచే చూడాలి. చదువులో, వృత్తిలో రాణిస్తేనే మన జీవితాలు మెరుగ్గా ఉంటాయని విద్యా సంస్థల్లో మెదళ్లకు ఎక్కిస్తున్నారు. విద్యార్థుల మధ్య తీవ్ర పోటీతత్వం, మార్కులు, ర్యాంకుల ఆధారిత విద్య వారిని మరింత ఒత్తిడికి గురిచేస్తుంది. పట్టణాలు, గ్రామాల్లోని విద్యార్థుల సామర్థ్యం ఒకేలా ఉండదన్న విషయం గ్రహించాలి. విద్య నేర్పడంలోనూ సానుభూతి, కరుణ, స్నేహభావం ఉన్నప్పుడే అది సంపూర్ణమవుతుంది. నైతికతతో కూడిన విద్యా విధానం అవసరం. 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో ఎన్నో ప్రముఖ విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఎదుటి వారికి సాయం చేయాలనే దృక్పథంతో కూడిన విద్యా విధానం లేకపోవడం గమనించాల్సిన విషయం. న్యాయవిద్యలోనూ క్లినికల్ విధానం అవసరం. విద్యా సంస్థలు, బార్ కౌన్సిల్ దీని కోసం ప్రయత్నించాలి.

ఆ ఆత్మహత్యలు కలచివేశాయి

ముంబై ఐఐటీలో దళిత విద్యార్థి, ఒడిశా న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివాసీ విద్యార్థుల ఆత్మహత్యలు కలిచివేశాయి. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలపై ఆందోళన వ్యక్తం చేస్తూనే.. సామాజిక మార్పు కోసం సమాజంతో చర్చలు జరపడంలో న్యాయమూర్తులు కీలకపాత్ర పోషించాలి. సీజేఐగా విద్యార్థులు చదువుకునేందుకు ఆరు దశాబ్దాలకు సంబంధించిన తీర్పులన్నింటినీ అందుబాటులో ఉంచాం. ఆటో ఇంటెలిజెన్స్ ద్వారా కోర్టు విచారణను రికార్డు చేస్తున్నాం. దీంతో విద్యార్థులు విచారణ తీరును తెలుసుకోవచ్చు'' అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వర్సిటీ వ్యవస్థాపక వైస్ చాన్స్‌లర్ రణబీర్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ ఎస్‌ఎం ఖాద్రీ, జస్టిస్ పీవీ రెడ్డి, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, హెచ్‌సీఏఏ చైర్మన్ రఘునాథ్, కార్యదర్శులు మల్లారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా పీహెచ్‌డీ (బ్లాక్ గౌన్–రెడ్‌క్యాప్), ఎల్‌ఎల్‌ఎం (బ్లాక్ గౌన్–ఎల్లో క్యాప్), ఎంబీఏ (బ్లాక్ గౌన్–ఎల్లో క్యాప్), బీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) (బ్లాక్ గౌన్–మెరున్ క్యాప్)తో పాటు పలు విభాగాల విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.

ఆ ఇద్దరికీ పతకాల పంట..



తన్వీ ఆప్టే, మంజరీ సింగ్

నల్సార్ స్నాతకోత్సవంలో బీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) విద్యార్థి తన్వీ ఆప్టేకు ఏకంగా పదకొండు పసిడి పతకాలు లభించాయి. మరో రెండు పసిడి పతకాలను ఉమ్మడిగా పొందారు. ''ఇన్ని గోల్డ్ మెడల్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రుల కృషి మూలంగానే నేను ఈ పతకాలు సాధించగలిగాను. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా'' అని తన్వీ పేర్కొన్నారు. ఇక బీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) విద్యార్థి మంజరి సింగ్‌కు 10 పసిడి పతకాలు లభించాయి. మొత్తంగా స్నాతకోత్సవంలో 58 గోల్డ్ మెడల్స్ పంపిణీ చేశారు.

27న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్ష

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం నియంత్రణాధికారి పరాంకుశం వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 040- 23680241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ఆంధ్రప్రదేశ్‌లో ఏం తిరుగుతున్నారో కానీ ఇక్కడ ఇంటింటికి తిరుగుతూ.. ఇల్లు కూడా ఇక్కడే కట్టుకున్నారు సంతోషం సార్!

క్లుప్తంగా...

నేడు రాష్ట్రానికి కేంద్రమంత్రుల రాక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం ముగ్గురు కేంద్రమంత్రులు తెలంగాణకు వస్తున్నారు. ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో హోటల్ మారియట్ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఇండియాస్ జీ-20 ప్రెసిడెన్సీ' అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర విదేశాంగ శాఖమంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్ ప్రసంగిస్తారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి, హైకోర్టు మాజీ సీజే సుభాషణ్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన ఔషధ నాణ్యత నియంత్రణ-అమలుపై రెండు రోజుల 'చింతన శిబిరం' జరగనుంది. ఇక నగరంలో జరగనున్న 'ప్రజా గోస-బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ పాల్గొంటారని పార్టీ వర్గాలు వెల్లడించారు.

మిషన్ కాకతీయపై పంజాబ్ వర్సిటీ అధ్యయనం

మార్చి 1, 2 తేదీల్లో ఆ రాష్ట్ర నిపుణుల బృందం పర్యటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో భూగర్భ జలాల అభివృద్ధిపై పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిపుణుల బృందం అధ్యయనం జరపనుంది. మార్చి 1, 2 తేదీల్లో మిషన్ కాకతీయ చెరువులు, చెక్‌డ్యాంలు, భూగర్భ జలాల రీచార్జింగ్ ఏర్పాట్లను పరిశీలించి పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌కు నివేదిక ఇవ్వనుంది. ఈ నెల 16న ఆయన కొండపోచమ్మ సాగర్ జలాశయంతో పాటు సిద్దిపేట జిల్లాలో మిషన్ కాకతీయ చెరువులు, చెక్ డ్యాంలను సందర్శించిన విషయం తెలిసిందే. మిషన్ కాకతీయను ఆదర్శంగా తీసుకుని పంజాబ్‌లో సైతం అలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ఆ రాష్ట్ర సీఎం నిపుణుల బృందాన్ని పంపిస్తున్నారు. వీరి పర్యటనకు రాష్ట్ర నీటిపారుదల శాఖ, భూగర్భజల శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

పుష్పాల శ్రీనివాస్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృతమైన సేవలందిస్తున్న రహదారి భద్రతా నిపుణుడు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుష్పాల శ్రీనివాస్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ లభించింది. శనివారం అహ్మదాబాద్‌లో జరిగిన ఓహెచ్ఎస్ఎస్ఏఐ ఫౌండేషన్ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆరోగ్యం, భద్రత, పర్యావరణం, సుస్థిరత అంశాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రహదారి భద్రతపై విస్తృతంగా పని చేయడంతో పాటు, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని రోడ్డు భద్రతపై పరిశోధన పత్రాలను అందజేసినందుకుగాను పుష్పాల శ్రీనివాస్‌కు ఈ పురస్కారం దక్కింది. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం యువతను, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మూడు దశాబ్దాలుగా ఈ రంగంలో పుష్పాల చేస్తున్న సేవలు అభినందనీయమని, దేశంలో రహదారిభద్రతా ఉద్యమానికి ఎంతో దోహదం చేశాయని ఈ సందర్భంగా ప్రశంసించారు.

వారంలోగా విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ

మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ



మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌తో మాట్లాడి వారంరోజుల్లో విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణపై ప్రకటన చేస్తామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. విద్యుత్ ఉద్యోగ సంఘాలన్నీ కలిసి సోమవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీతో చర్చించి ఓ ఫిట్‌మెంట్ శాతాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. అనంతరం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు సమర్పించే నివేదికపై సీఎం కేసీఆర్ తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. తెలంగాణ విద్యుత్ జేఏసీ నేతలు శనివారం జగదీశ్‌రెడ్డిని మింట్ కాంపౌండ్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పీఆర్సీ ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యుత్ వేతన సవరణ సంప్రదింపుల కమిటీ విద్యుత్ ఉద్యోగులకు 5 శాతం, ఆర్టిజన్లకు 10 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని సిఫారసు చేయగా, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు జేఏసీ నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక జాప్యం చేయకుండా వారంలో పీఆర్సీ ప్రకటిస్తామని, ఆందోళనలు విరమించుకోవాలని జగదీశ్‌రెడ్డి వారికి సూచించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కె.ప్రకాశ్, కన్వీనర్ శివాజీ, వైస్‌చైర్మన్ అంజయ్య, జేఏసీ నేతలు నాసర్ షరీఫ్ పాల్గొన్నారు.

ముందస్తు గుర్తింపుతో గుండె ముప్పునకు చెక్

- దేశంలోని హృద్రోగుల్లో 63% మందికి 3 నాళాలు మూసుకుపోయాయి..
- 73 శాతం కేన్సర్ రోగుల్లో 3 లేదా 4వ దశలోనే వ్యాధి నిర్ధారణ
- ఈ వ్యాధులను తొలి దశలోనే గుర్తిస్తే మరణాలను తగ్గించొచ్చు
- బయో ఆసియా సదస్సులో భాగంగా చర్చాగోష్టిలో వక్తలు

సాక్షి, హైదరాబాద్: బయో ఆసియా సదస్సు-2023 రెండోరోజు కార్య క్రమాల్లో భాగంగా శనివారం జరిగిన ముఖాముఖి సంభాషణలో దిగ్గజ సంస్థ యాపిల్ వైస్ ప్రెసిడెంట్ (హెల్త్) డాక్టర్ సుంబుల్ దేశాయ్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతరెడ్డి పాల్గొన్నారు. ప్రజారోగ్యం, సాంకేతిక పరిజ్ఞాన ప్రభావం అనే అంశాలపై చర్చించారు. ఆరోగ్య సమాజం కోసం యాపిల్ చేస్తున్న కృషిని డాక్టర్ సుంబుల్ దేశాయ్ వివరించగా అపోలో హాస్పిటల్స్ ద్వారా వైద్య సేవలందిస్తున్న తీరు ను, భవిష్యత్ కార్యాచరణను డాక్టర్ సంగీతారెడ్డి ప్రస్తావించారు. అవి వారి మాటల్లోనే..



సంగీత: లింగ సమానత్వం, సాంకేతిక పరిజ్ఞానంలో భారత్ ప్రపంచంలో మేటిగా ఉంది. కానీ ప్రస్తుత సవాళ్లలో ప్రజారోగ్య పరిరక్షణ అతిపెద్దది. దీనికి పరిష్కారాలను చూపుతున్నప్పటికీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. మీ ప్రస్థానాన్ని ఒక ప్రాంతంలో ప్రారంభించి మరో చోటకు మారారు. మిమ్మల్ని ఉత్తేజపర్చిందేమిటి?

సుంబుల్: ఏ పని చేసినా అర్థవంతంగా ఉండాలి. ప్రతి వ్యక్తి ఆరోగ్యకరంగా జీవించాలనే అంశానికి యాపిల్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తున్న యాపిల్ లక్ష్యం ఆ సంస్థ ఉద్యోగిగా నన్ను ఎంతో ఉత్తేజపరుస్తోంది.

సంగీత: విజ్ఞానాన్ని పంచుకోవడానికి సాంకేతికత ఇప్పుడు కేంద్రంగా ఉందంటారా?

సుంబుల్: అవును. నేను దాని గురించి మిమ్మల్ని అడగబోతున్నాను. అపోలో ద్వారా వైద్యసేవలందిస్తున్న మీరు ఆరోగ్యకర జీవన అంశాన్ని ఎలా ఎదుర్కొంటున్నారు?

సంగీత: గుండెపోటు అనేది ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద కిల్లర్‌గా మారుతోంది. దీని ముందస్తు హెచ్చరిక లక్షణాల గురించిన విశ్లేషణలను ప్రజల చేతుల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలి. రెండు వారాల క్రితం మేము క్లినికల్ ఇంటెలిజెన్స్ ఇంజిన్‌ను ప్రారంభించాం. ఇది దేశంలోని వైద్యులకు ఉచితంగా విడుదల చేయాలని భావిస్తున్నాం. మీరు మహిళల ఆరోగ్యం కోసం ఏం చేస్తున్నారు?

సుంబుల్: మా ప్రాధాన్యతలో కీలకమైన అంశం మహిళల ఆరోగ్యం. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక చాప్టర్‌ను తెరిచాం. మహిళల కోసం సైకిల్ ట్రాకింగ్‌ను ప్రవేశపెట్టాం. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆరోగ్య సంరక్షణ కార్మికుల కొరతను అధిగమించేందుకు మీరు ఏం ఆలోచిస్తున్నారు?

సంగీత: కృత్రిమ మేధను మరింత విస్తృతం చేస్తున్నాం. దీంతో ఆరోగ్య సంరక్షణ రంగానికి కొంత వెసులుబాటు కలుగుతోంది. కానీ నిపుణుల కొరతను అధిగమించేందుకు యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం.

సుంబుల్: జీ-20 స్టాండ్ పాయింట్... మహిళలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నారు?

సంగీత: ఆరోగ్య సంరక్షణలో, స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం నిజంగా తగ్గింది. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణలో మహిళలు 60 శాతం ఉన్నారు. మహిళలకు అవకాశాలు అపారమవుతున్నాయి. నాయకత్వం శారీరక బలంతో కాదు.. మానసిక పరాక్రమంతో సాధ్యమవుతుంది.

సంగీత: అపోలోను 40 ఏళ్ల క్రితం ప్రారంభించాం. అత్యాధునిక ఆరోగ్య సేవలను ప్రజలకు వేగంగా అందించాలనే లక్ష్యంతో అడుగులు వేశాం. కానీ ఇప్పటికీ ముందస్తు వ్యాధి నిర్ధారణ సవాలుగానే ఉంది. సాంకేతికత ఎంతలా అభివృద్ధి చెందినప్పటికీ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దేశంలోని కార్డియాక్ పేషంట్లలో 63 శాతం మందిలో గుండెలో మూడు నాళాలు మూసుకుపోయాయి. మొదటి నాళం మూసుకున్నప్పుడే విషయాన్ని గుర్తిస్తే పరిస్థితి ఇంకోలా ఉంటుంది. అలాగే కేన్సర్ రోగుల్లో 73 శాతం మంది మూడో దశ, నాలుగో దశలోనే వ్యాధి బయటపడుతోంది. వారిని మొదటి దశలోనే గుర్తించగలిగితే చరిత్రను తిరగరాయొచ్చు. వాటి గుర్తింపునకు కృత్రిమ మేధ (ఏఐ) మరింత విస్తృతంగా అందుబాటులోకి రావాలి. దీనిపై యాపిల్ ఏవిధంగా ఆలోచిస్తోంది?

సుంబుల్: ప్రజారోగ్యానికి యాపిల్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ఇందులో భాగంగా ఆరోగ్య అంశాల కోసం యాప్‌లు తీసుకొచ్చాం. గుండె స్పందన, నడక తదితరాల కోసం ప్రత్యేక ఫీచర్లు అందించాం. ఇంకా ఎన్నో రకాలను ఆవిష్కరిస్తున్నాం. దీంతో పాటు మహిళల ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాం.



సృజన భళా... ఆరోగ్య మేళా...

సాక్షి, హైదరాబాద్: సూది గుచ్చడం దగ్గర నుంచి సర్జరీ దాకా అవసరమైన సందర్భాల్లో నొప్పి తెలీకుండా చేసే ఉత్పత్తి ఏదైనా ఉంటే? మనం ఇంట్లో కూర్చుని ఓ వైపు మన పని మనం చేసుకుంటుండగానే మన హార్ట్ బీట్, బ్లడ్‌షుగర్ స్థాయిలు వైద్యునికి తెలిసిపోతూ ఉంటే..? ఆకాశమే హద్దుగా ఆరోగ్యరంగంలో వెల్లువెత్తుతున్న సృజన సాకారం చేస్తున్న అద్భుతాలివి... వీటన్నింటికి అద్దం పడుతోంది నగరంలో జరుగుతున్న బయో ఆసియా సదస్సు. ఇందులో విజేతలుగా నిలిచిన స్టార్టప్‌లు చేసిన ఆవిష్కరణలు ఇలా..

బయో ఆసియాలో స్టార్టప్‌ల వినూత్న ఆవిష్కరణలు

అందుబాటు ధరలో కృత్రిమ అవయవాలు



వైకల్య బాధితులను దృష్టిలో పెట్టుకుని అత్యంత తేలికగా, అందరికీ అందుబాటులో ఉండేలా ఉత్పత్తులు రూపొందించాం. ప్రస్తుతం మేము చేతులను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాం. త్వరలో ప్రధాన అవయవాలనూ అందుబాటులోకి తెస్తాం. సహజమైన శరీర భాగాల తరహాలోనే ఇవి పనిచేస్తాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉత్పత్తులు రూ7 లక్షల వరకుంటే.. మా ఉత్పత్తులు రూ.1.50 లక్షల్లోనే లభిస్తున్నాయి.

– మునీష్ కుమార్, ఎగ్జోబొట్ డైనమిక్స్ సంస్థ సీఈఓ

కేన్సర్ మందుల సృష్టితో...



అంతర్జాతీయ మార్కెట్ కోసం కేన్సర్ మందులను తయారు చేసే సంస్థని మూడేళ్ల క్రితం ప్రారంభించాం. ఫస్ట్ ఇన్ క్లాస్ మెకానిజమ్‌తో దేశంలోనే మాది తొలి సంస్థ. లంగ్ కేన్సర్, ట్రిపుల్ నెగిటివ్ బ్రెస్ట్ కేన్సర్‌కు డ్రగ్‌ను అభివృద్ధి చేశాం. దీనిని త్వరలోనే మనుషుల మీద ప్రయోగించనున్నాం. దేశంలో ఇంతవరకు ఎవరూ చేయని మెకానిజమ్‌ను అనుసరిస్తూ ఈ డ్రగ్‌ను తెస్తున్నందుకే మాకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

–సీఎస్ఎన్ మూర్తి, సీఈఓ సత్య ఫార్మా ఇన్నోవేషన్స్, హైదరాబాద్

ఆరోగ్యం చెప్పే మెషీన్

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో కనిపించే వెయింగ్ మెషీన్ తరహాలో ఓ అధునాతన మెషీన్ అందుబాటులోకి వచ్చింది. దీన్ని హైదరాబాద్‌కు చెందిన పల్స్ యాక్టివ్ స్టేషన్స్ నెట్‌వర్క్ రూపొందించింది. ఈ మెషీన్ మీదకు ఎక్కి స్క్రీన్ ముందు నిలబడి మొబైల్ నంబర్ తదితర వివరాలు ఎంట్రీ చేస్తే చాలు. మన ఆరోగ్య వివరాలు వాట్సాప్‌కు వచ్చేస్తాయి. ఇందులో మన బరువు, ఎత్తు, బీఎంఐ, బీపీతోపాటు ఇతర వివరాలను తెలుసుకోవచ్చు. శరీరంలో ఉన్న కొవ్వు శాతాన్ని, ఫిట్‌నెస్ స్థాయిని, డయాబెటిస్ అవకాశాల్ని కూడా అంచనా వేస్తుంది. మెషీన్‌ని పూర్తిగా తెలంగాణలోనే తయారు చేశామని భవిష్యత్తులో అన్ని ఆసుపత్రుల్లో బహిరంగ ప్రదేశాల్లో అమర్చేలా ప్రయత్నిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జోగిందర్ తనికెళ్ల చెప్పారు. ధర రూ.2.50 లక్షలు.



నేరుగా వైద్యుడికి నివేదికలు..



ఆరోగ్య పరీక్షలు సొంతంగా చేసుకోవడంతోపాటు ఆ పరీక్షల ఫలితాలు నేరుగా మన వైద్యునికి చేరేలా ఉత్పత్తులు సృష్టించారు 'ఆబో 1008 డిజిటల్ హెల్త్ కేర్' సంస్థకు చెందిన నగరవాసి సత్యదేవ్. పల్స్ రేట్, బీపీ, ఈసీజీ, శరీర ఉష్ణోగ్రత, రక్తంలో చక్కెర శాతం ఇవన్నీ కలిపి హెల్త్ బోట్ డివైజ్ ద్వారా పరీక్షించుకునే సదుపాయాన్ని తెచ్చారు. అలాగే నిద్రలేమి సమస్యలు, ఒత్తిడి స్థాయిలు, మహిళల రుతుక్రమ సమస్యలు తెలుసుకునే ఉంగరం మాదిరి ఉండే పరికరాన్నీ రూపొందించారు. చర్మ పరీక్షలు, చెవి, గొంతు సమస్యలు తెలుసుకోవడం, గుండె, ఊపిరితిత్తుల సమస్యల్ని గుర్తించడానికి ఆబో వన్ డివైజ్‌లను తయారుచేశారు. ఇంట్లో చేసుకున్న ఈ పరీక్షల రిపోర్టులు నేరుగా వైద్యునికి చేరేలా అప్లికేషన్ రూపొందించామన్నారు.

విద్యుత్ అవసరం లేని 'ఫ్రీజర్'..



- కొన్ని రకాల వైద్య చికిత్సల్లో ఉపయోగించే ఉత్పత్తుల్ని నిర్దీత ఉష్ణోగ్రతలో భద్రపరచాల్సి ఉంటుంది. దీని కోసం ఇప్పటిదాకా థర్మాకోల్‌తో చేసిన బాక్స్‌లనే ఉపయోగిస్తుండగా, బయోస్యూర్ పేరుతో షిప్పర్ బాక్స్‌లను మ్యాక్‌పై అనే సంస్థ రూపొందించింది. విద్యుత్ అవసరం లేకుండా రోజుల తరబడి ఫ్రీజర్ సేవల్ని అందించే ఈ బాక్స్‌ను వెజిటబుల్స్ దాచుకోవడానికీ వాడొచ్చని సంస్థ చెప్పింది. పేస్ ఛేంజ్ మెటీరియల్ ఉపయోగించి దీన్ని చార్జ్ చేయాల్సి ఉంటుందని, ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే నిర్దీత ఉష్ణోగ్రతను 24గంటల పాటు ఉంచుతుందని పేర్కొంది.

అందరికీ ప్రాథమిక వైద్యం కోసం...



ప్రాథమిక వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలన్నది మా హెల్త్ కాన్ అండ్ మెడ్ టెక్ స్టార్టప్ లక్ష్యం. ఆసుపత్రులు అందుబాటులో లేని ప్రజలకు డిజిటల్లీ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ సొల్యూషన్స్, మొబైల్ హెల్త్ సొల్యూషన్స్, అనలటిక్స్ ద్వారా హెల్త్‌కేర్‌ను చేరువ చేస్తున్నాం. అపోలో టెలీ హెల్త్‌తో కలిసి దేశవ్యాప్తంగా 440 కేంద్రాలు ఏర్పాటు చేశాం. దాదాపు 3 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాం. బయో ఆసియాలో లభించిన ఈ గుర్తింపు మా సేవలకు మరింత స్ఫూర్తినిస్తుంది.

– డా.ప్రణయ్ కార్గ్, ప్రతిభ హెల్త్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్

- ఎలాంటి ఇన్ఫెక్షన్ అయినా సరే ఇట్టే గుర్తించే పేపర్ ఆధారిత డివైజ్... రాంజా జీనో సెన్సర్ కూడా టాప్ 5లో నిలిచింది. అమెరికాలోని ఎండీ ఆండర్సన్ కేన్సర్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సింగపూర్‌కు చెందిన ల్యాంబ్‌డజెన్ థెరప్యూటిక్స్ కూడా ఈ జాబితాలో నిలిచింది.

జీనోమ్ వ్యాలీలో జుబ్లియెంట్ కేంద్రం

- గ్లోబల్ మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్న సనోఫీ
- మంత్రి కేటీఆర్‌తో భార్తియా, సనోఫీ ప్రతినిధుల భేటీ



జుబ్లియెంట్ భార్తియా సంస్థ ప్రతినిధితో మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్

సాక్షి, హైదరాబాద్: స్థానికంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులకు ప్రయోజనం చేకూరేలా హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక వసతుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో అంతర్జాతీయంగా పేరొందిన జుబ్లియెంట్ భార్తియా గ్రూప్ ప్రకటించింది. బయో ఆసియా సదస్సులో భాగంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో జుబ్లియెంట్ భార్తియా వ్యవస్థాపకుడు, కో-చైర్మన్ హరి ఎస్. భార్తియా శనివారం భేటీ అయ్యారు. ఫార్మా, పరిశోధన, విలక్షణ ఔషధాలు, లైఫ్‌సైన్సెస్, వ్యవసాయ ఉత్పత్తులు సహా అనేక రంగాల్లో ఉన్న తమ గ్రూప్ ఆసియాలో హైదరాబాద్‌ను అత్యాధునిక వసతుల కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసుకుందన్నారు. ఇప్పటికే లైఫ్‌సైన్సెస్ పరిశోధన రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు జుబ్లియెంట్ రాకతో క్లినికల్ రీసెర్చ్ సంస్థలకు మరింత ఊతం లభిస్తుందని కేటీఆర్ చెప్పారు.

రాష్ట్రంలో సనోఫీ 'గ్లోబల్ మెడికల్ హబ్'

అంతర్జాతీయంగా ఆరోగ్య సంరక్షణలో పేరొందిన 'సనోఫీ' తెలంగాణలో గ్లోబల్ మెడికల్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. బయో ఆసియా సదస్సులో భాగంగా మంత్రి కేటీఆర్‌తో భేటీ సందర్భంగా సనోఫీ గ్రూప్ ఆఫ్ సైట్స్ హెడ్ మాథ్యూ చెరియన్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా తాము గ్లోబల్ మెడికల్ హబ్ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, సనోఫీ మధ్య కుదిరిన భాగస్వామ్యంతో ప్రపంచస్థాయి పెట్టుబడులు, భాగస్వామ్యాలు పెరుగుతాయని మాథ్యూ చెరియన్ ఆశాభావం వ్యక్తం చేశారు. '2025- ఆ తర్వాత' అనే విజన్‌లో భాగంగా ఏర్పాటయ్యే గ్లోబల్ మెడికల్ హబ్‌లో ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ఆవిష్కరణలు, పరిశోధన అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు.

వైద్యంలో దేశానికే దిక్సూచి..

- బయో ఆసియా సదస్సు ముగింపు కార్యక్రమంలో కేటీఆర్
- హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో రాష్ట్ర భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోందని, దేశానికే దిక్సూచిగా ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. హైదరాబాద్ వేదికగా రెండు రోజులపాటు జరిగిన బయో ఆసియా సదస్సు ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. దేశంలో హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రస్తుతం 80 బిలియన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ భాగస్వామ్యం... 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రా, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే మూడు 'ఐ'లు భారత్‌కు నాలుగో కన్నుగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తాయన్నారు. సాంకేతికతను ఉపయోగించి వైద్య పరికరాలు, లైఫ్ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణలను తీసుకురాగల అర్హతలు, ప్రపంచస్థాయి సౌకర్యాలు, వనరులు భారత్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. భౌగోళిక, సామాజిక, ఆర్థిక అసమానతల సరిహద్దులకు అతీతంగా దేశం ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఇన్నోవేషన్స్ తీసుకురావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బయో ఆసియా సదస్సుకు 50 దేశాల నుంచి 215 మంది ప్రతినిధులు హాజరయ్యారని, 175 స్టార్టప్ కంపెనీలు వచ్చాయని వివరించారు. ఈ సదస్సులో పాల్గొన్న స్టార్టప్స్ కంపెనీలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, బయో ఆసియా సీఈవో శక్తి నాగప్పన్, రిపబ్లిక్ ఆఫ్ లిథువేనియా వైస్ మినిస్టర్ కరోలిస్, ఈస్టోనియా రాయబారి కత్రిన్ కియి, ఒడిశా మంత్రి అశోక్‌చంద్ర పాండే, మాజీ ఐఏఎస్ బీపీ ఆచార్య, రెడ్డి ల్యాబ్స్ సతీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో ఒకే విధానం, నాణ్యత అవసరం..

- ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులపై బయో ఆసియా సదస్సులో నిపుణులు
- భారత్‌లో అత్యుత్తమ మౌలిక వసతులున్నా గుర్తింపు లభించడం లేదు
- అయినా ప్రపంచ ఔషధ రంగానికి చిరునామాగా నిలుస్తోందని ప్రశంస

సాక్షి, హైదరాబాద్: నాణ్యతపై దృష్టి పెడితేనే పెట్టుబడులపై మంచి రాబడులు ఉంటాయని.. ఫార్మా, లైఫ్‌సైన్సెస్ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన సానుకూల విధానాలతో పాటు దృఢమైన నియంత్రణలూ అవసరమని ఆయా రంగాల నిపుణులు స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఒకే విధమైన నాణ్యత, ఒకే విధానం ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగ ఉత్పత్తుల నాణ్యత విషయంలో 'బయో ఆసియా 2023' సదస్సు వేదికగా శనివారం 'భారత్ కోసం భారత్.. ప్రపంచం కోసం భారత్.. మరి నాణ్యతలో ఎక్కడ' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. ఇందులో అమెరికా ఎఫ్‌డీఏ అసోసియేట్ కమిషనర్ మార్క్ అబ్డూ, డ్రగ్ క్వాలిటీ డైరెక్టర్ డాక్టర్ కార్మెలో రోసా, ఇండియా కంట్రీ డైరెక్టర్ సారా మెక్‌ములెన్, ఇలినాయిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సర్బరాజ్ కె.నియాజ్, యూకే హెల్త్ సైన్సెస్ డైరెక్టర్ ఇయాన్ వైట్, బయోకాన్ బయోలాజిక్స్ చీఫ్ క్వాలిటీ ఆఫీసర్ మైకేల్ కట్లర్, పవన్ కుమార్ మోచర్ల తదితరులు పాల్గొన్నారు. నిపుణులు చెప్పిన అంశాలు వారి మాటల్లోనే..

''ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో వృద్ధితోపాటు నియంత్రణ కూడా పెరగాల్సిన అవసరం ఉంది. యూఎస్ స్థాయి నాణ్యతకంటే తక్కువ నాణ్యత కలిగిన ఉత్పత్తుల విషయంలో గతంలో ప్రపంచ ఆరోగ్య సంస్థపై విమర్శలు ఉండేవి. ప్రపంచవ్యాప్తంగా ఒకే విధానం, ఒకేవిధమైన నాణ్యత ఉండాల్సిన అవసరం ఉంది.

కంపెనీలు జాగ్రత్తగా ఉండాలి..

భారత్‌లో ఏదైనా ఒక తప్పు జరిగితే విపరీతమైన ప్రతికూల ప్రచారం జరుగుతుంది. భారత కంపెనీలు తప్పులు జరగకుండా చూసుకుంటూ తమ ప్రతిష్టను కాపాడుకోవాలి. ఆహార, ఔషధ నిర్వహణ (ఎఫ్‌డీఏ) విషయంలో అమెరికా అయినా భారత్ అయినా ఒకే రకమైన విధానాలు ఉంటాయి. ఇక్కడ తనిఖీలు తరచూ జరుగుతున్నా కొన్ని లోటుపాట్లు కనిపించడం ఆశ్చర్యకరమైన అంశం. భారత్‌లో అత్యుత్తమైన మౌలిక వసతులున్నా దురదృష్టవశాత్తూ ఇంటా బయటా గుర్తింపు లభించడం లేదు. వసతులు, నైపుణ్యంలో భారత్ ఏ దేశానికీ తక్కువకాదు. నాణ్యత ప్రమాణాల విషయంలో అన్ని దేశాల మధ్య భావసారూప్యత ఏర్పడాల్సిన అవసరం ఉంది. ప్రమాణాల విషయంలో కొన్ని పరిశ్రమలు స్వచ్ఛందంగా పాటిస్తుండగా.. మరి కొన్ని పాటించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఎఫ్‌డీఏ తనిఖీలకు, ఇతర తనిఖీలకు చాలా తేడా ఉంటుంది. కొన్నిమార్లు ఈ తనిఖీలు ఎందుకో అర్థం కావు, ఇలాంటి సందర్భాల్లో నియంత్రణ సంస్థల దృష్టికి తీసుకెళ్తాం. భారత్‌లో కఠినతరమైన తనిఖీల విషయంలో అధికార యంత్రాంగాన్ని నిందించే ఉద్దేశం మాకు లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక నాణ్యత వ్యవస్థను ఆచరించడం భారత్‌లోని పరిశ్రమలకు కూడా మేలు చేస్తుంది.

భారత్ రాణిస్తోంది.. మెడ్‌టెక్‌లోని ఒకట్రెండు విభాగాల్లో ఎగుమతుల విషయంలో భారత్ బాగా రాణిస్తోంది. 2013-14 నాటి పరిస్థితులతో పోలిస్తే సమాచార సమగ్రత పెరిగినా.. అక్కడక్కడా కొంత తప్పుదోవ పట్టించే సమాచారం ఉంటోంది. ఇది కేవలం భారత్‌కే పరిమితమైందని చెప్పడం సరి కాదు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఉత్పత్తుల తయారీ తిరిగి అమెరికా, కెనడా లాంటి దేశాలకు వెళ్తుందని ఇప్పుడే చెప్పలేం. కానీ కోవిడ్ సందర్భంగా ఔషధాల సరఫరాలో ఏర్పడిన అంతరాయం నేపథ్యంలో ఈ తరహా ప్రచారం జరుగుతోంది. అయినా ప్రపంచ ఔషధ రంగానికి చిరునామాగా భారత్ కొనసాగుతోంది'' అని వక్తలు పేర్కొన్నారు.

బయో ఆసియా విజేతలుగా ఐదు స్టార్టప్‌లు..

రెండో రోజు కీలక అంశాలపై చర్చాగోష్టులు

సాక్షి, హైదరాబాద్: ఆసియాలోనే అతిపెద్ద లైఫ్‌సైన్సెస్, ఆరోగ్య రక్షణ సదస్సు బయో ఆసియా-2023లో రెండో రోజు జరిగిన చర్చా గోష్టిలో అంతర్జాతీయంగా పేరొందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు, కార్పొరేషన్లు, పేరొందిన ఆరోగ్య రక్షణ రంగ నిపుణులు, విద్యాసంస్థల అధినేతలు, స్టార్టప్‌ల ప్రతినిధులు ప్రపంచ ఆరోగ్య రక్షణ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. బయో ఆసియా సదస్సులో భాగంగా రెండో రోజు ఐదు కీలక అంశాలపై చర్చా గోష్టులు జరగ్గా ఆపిల్ హెల్త్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుంబుల్ దేశాయ్, అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతారెడ్డి మధ్య ఫైర్‌సైడ్ చాట్ జరిగింది. 50కి పైగా దేశాల నుంచి రెండువేల మందికిపైగా ప్రతినిధులు హాజరు కాగా, రెండు రోజుల్లో రెండు వేల ముఖాముఖి వాణిజ్య సమావేశాలు జరిగాయి. 76 స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ప్రదర్శించగా, అత్యంత వినూత్న ఆవిష్కరణలు ప్రదర్శించిన ఐదు స్టార్టప్‌లను విజేతలుగా ప్రకటించారు. విజేతలైన ఎక్సోబోట్ డైనమిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, లాంబ్డాజెన్ థెరాప్యుటిక్స్, ప్రతిభ హెల్త్‌కాన్, రాంజా జీనో సెన్సర్, సత్య ఆర్ఎక్స్ ఫార్మా ఇన్నోవేషన్స్ స్టార్టప్‌ల ప్రతినిధులను మంత్రి కేటీఆర్ సత్కరించారు. ఈ సదస్సు ఆదివారం ముగియనుంది.

ఆరు లక్షల టికెట్లు 60 నిమిషాల్లో ఖాళీ

శ్రీవారి దర్శనానికి ఆన్‌లైన్‌లో విడుదల చేసిన టీటీడీ

తిరుమల: శ్రీవారి దర్శనాలకు ఆన్‌లైన్‌లో డిమాండ్ కొనసాగుతూనే ఉంది. మార్చి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను శుక్రవారం ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేసింది. ఆరు లక్షల టికెట్లను భక్తులు 60 నిమిషాల వ్యవధిలోనే బుక్ చేసేసుకున్నారు. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించిన అంగప్రదక్షిణ టికెట్లను రోజుకు 750 చొప్పున టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే కేవలం 9 నిమిషాల వ్యవధిలో భక్తులు పొందారు. మార్చి నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను రోజుకు 20 వేల చొప్పున 6.2 లక్షల టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే గంటా 25 నిమిషాల వ్యవధిలో భక్తులు కొనుగోలు చేసేశారు. దీంతో టీటీడీ ఖాతాలో గంట వ్యవధిలో రూ.18.6 కోట్లు జమైంది.



మూఢుడు కోపపడునది నిమిషములోనే బయలుపడును.
వివేకి నిందను వెల్లడిపరచక యూరకుండును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి తె.5.03 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** భరణి ఉ.8.21 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.8.41 నుండి 10.22 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.28 నుండి 5.15 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీష్ కుమార్ (బిహార్ సీఎం)


రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కాంగ్రెస్ నుంచి వచ్చే సిగ్నల్ కోసం ఎదురుచూస్తూ ఉన్నాను. 24న కాంగ్రెస్ ప్లీనరీ మొదలైంది. ఆ రోజు సిగ్నల్ రాలేదు. నిన్న ప్లీనరీ రెండో రోజు. నిన్నా సిగ్నల్ రాలేదు! ఇవాళ ప్లీనరీ ఆఖరి రోజు. ఈరోజూ సిగ్నల్ రాకపోతే ఇక మళ్లీ వచ్చే ప్లీనరీ వరకు సిగ్నల్ రానట్లే. ఏడాది మొత్తంలో ప్లీనరీ జరిగే ఆ మూడు రోజులు మాత్రమే కాంగ్రెస్ కాస్త యాక్టివ్‌గా ఉంటుంది.

సల్మాన్ ఖుర్షీద్‌కి ఫోన్ చేస్తున్నాను. కనెక్ట్ కావడం లేదు! పకీల్ అహ్మద్‌కి చేశాను. కనెక్ట్ అవుతోంది కానీ వెంటనే కట్ అయిపోతోంది! పవన్ బన్సాల్‌కి చేశాను. అవుట్ ఆఫ్ కాలింగ్ ఏరియా అని వస్తోంది!

రాయ్‌పూర్ ఏమీ రెడ్ జోన్‌లో లేదు మావోయిస్టులు వెళ్లి అక్కడి సెల్ టవర్స్ పేల్చేసి ఉంటారని అనుకోడానికి. ఒకవేళ రాయ్‌పూర్ రెడ్ జోన్‌లో ఉన్నా కూడా మావోయిస్టులేమీ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లినవాళ్లు కాదు.. తమకు పనికొచ్చేవాటిని కూడా ధ్వంసం చేసేయడానికి.



మళ్లొకసారి సల్మాన్ ఖుర్షీద్‌కి ఫోన్ చేశాను. ఊహూ. కలవడం లేదు! ఖుర్షీద్ కాంగ్రెస్ సీనియర్ లీడర్. ప్లీనరీకి వెళ్లడానికి ముందు పట్నాలో కలిసినప్పుడు ఆయనే నాతో అన్నారు.. 'కలిసి పని చేద్దాం అని కాంగ్రెస్ ప్లీనరీ నుంచి సిగ్నల్ రాగానే అందరికన్నా ముందు నేనే మీతో కలిసి పని చేసేందుకు వస్తాను నితీష్ భాయ్..' అని!

ఖర్గేకి కూడా ఒకసారి ఫోన్ చేసి చూద్దామని అనుకుంటూ, అలవాటుగా మళ్లీ ఖుర్షీద్‌కే చేశాను. ఫోన్ కనెక్ట్ అయింది!

"ఖుర్షీద్ భాయ్.. మీ ఫోనెందుకు కనెక్ట్ కావడం లేదు?" అని అడిగాను.

ఖుర్షీద్ పెద్దగా నవ్వారు. "నితీష్ భాయ్.. మీతో ఫోన్‌లో కనెక్ట్ కావడం, కాకపోవడం అటుంచండి. ప్లీనరీలో పక్కపక్కనే పదిహేను వేల మందిమి కూర్చొని ఉన్నా.. మాలో మేము ఒకరితో ఒకరం కనెక్ట్ కాలేకపోతున్నాం. ఖర్గే ఒక్కరే మాట్లాడుతున్నారు. అందరం ఆయనకే కనెక్ట్ అయి ఉన్నాం.." అన్నారు!

"ఖుర్షీద్ భాయ్.. 'కలిసి పనిచేద్దాం. మోదీ పని పడదాం' అని ప్లీనరీ నుంచి సిగ్నల్ రావచ్చని మీరే కదా చెప్పారు. పకీల్ అహ్మద్ మాటల్ని వింటుంటే.. 'ఎవరితోనూ కలిసే పని లేదు. కాంగ్రెస్ ఒక్కటే మోదీని ఓడిస్తుంది' అనే సిగ్నల్ వస్తుందేమో అనిపిస్తోంది!" అన్నాను.

"అవునా! ఆయనింకా మాట్లాడుతుందే!!" అని నవ్వారు ఖుర్షీద్.

"ప్లీనరీలో కాదు ఖుర్షీద్ భాయ్. ప్లీనరీకి వెళ్లే ముందు మాట్లాడారు! 'మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వారితో కలిసి ఉంది. పది రాష్ట్రాల్లో బలమైన ప్రతిపక్షంగా ఉంది..' అన్నారు. అంటే.. మోదీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు జేడీ(యూ) గానీ, ఆర్జేడీ గానీ, మరెవరూ గానీ అక్కర్లేదనేగా..!" అన్నాను.

"నితీష్ భాయ్.. ఆ సందర్భం వేరే. ప్రతిపక్షాలన్నీ ఏకమై అధికారంలోకి వస్తే కనుక అప్పుడు రాహుల్ గాంధీనే ప్రధాని అని చెప్పడం పకీల్ ఉద్దేశం.." అన్నారు ఖుర్షీద్!

ఆయనతో మాట్లాడుతుండగానే లైన్ కట్ అయి, పవన్ బన్సాల్ లైన్‌లోకి వచ్చే ప్రయత్నం చేస్తుండడం కనిపించింది. ప్లీనరీ ఏర్పాట్లు చూస్తున్నది ఆయనే. లిఫ్ట్ చేశాను.

"నితీష్‌జీ.. మీరు నాకు ఫోన్ చేసినట్టున్నారు కదా?!" అన్నారాయన.

"అవును బన్సాల్‌జీ. మీవాళ్ల ఫోన్‌లు కలవకపోతుంటే, ఆ దగ్గర్లో ఏమైనా ఉన్నారేమోనని మీకు ఫోన్ చేశానంతే.." అని చెబుతున్నాను.. లైన్ కట్ అయింది!

1996లో, 2004లో, 2009లో అందరం కనెక్ట్ అయి పనిచేశాం. 'ప్రధాని' అభ్యర్థి ఎవరో ప్రకటించకుండానే ఆ మూడు ఎన్నికల్లో విజయం సాధించాం. 2024 ఎన్నికల్లో కూడా 'ప్రకటించని అభ్యర్థి'తో మాత్రమే గెలుపు సాధ్యమౌతుంది. ఆ అభ్యర్థి రాహుల్ అయినా, నితీష్ అనే నేనైనా, మరొకరు ఎవరైనా!


మొదటైతే సిగ్నల్ రావాలి.

వినాశ కాలే విపరీత బుద్ధిః

జనతంత్రం



వర్ధెల్లి మురళి



రక్తబీజుడు అనే అసురుని వృత్తాంతం మన పురాణాల్లో ఉన్నది. ఈ కథను చాలామంది వినే ఉంటారు. ఆ రాక్షసుడు అతిభయంకరంగా తపస్సు చేసి బ్రహ్మదేవుడిని వశపరచుకొని దారుణమైన ఒక వరాన్ని సంపాదించుకున్నాడు. వాడి ఒంటి నుంచి రాలే ఒక్కో రక్తపు బొట్టులోంచి ఒక్కో రక్తబీజుడు పుట్టుకొస్తాడు. అలా పుట్టుకొచ్చిన జూనియర్ రక్తబీజులు కార్చే ప్రతి రక్తపు బొట్టులోంచి ఒక్కో సబ్‌జూనియర్ రక్తబీజుడు ఉద్భవిస్తాడు. ఆ విధంగా ఒక్క నెత్తురు చుక్క నుంచే వేలమందితో కూడిన సైన్యాన్ని సృష్టించుకోగల వరాన్ని పొందడంతో వాడు చెలరేగిపోయాడు. అతడి దాష్టీకానికి, దోపిడీకి అతల సుతల సురాతల భూతలాది చతుర్దశ లోకాలూ గజగజ వణికిపోయాయి. దేవతలు హడలిపోయి పాహి... పాహి అంటూ పరుగులు తీశారు. చివరికి సర్వశక్తి స్వరూపిణి పార్వతీదేవి కాళీమాత అవతారాన్ని ఎత్తవలసి వచ్చింది. దైత్యుని దునుమాడి ఆ తల్లి లోకాలను కాపాడుకున్నదని దేవీ మహత్యం కథ ద్వారా మనకు తెలుస్తున్నది.

మహాకాళి తొమ్మిది ఛాయల్లో ఒకరు మన బెజవాడ కనకదుర్గమ్మ. అమ్మవారు కొండ మీద వేంచేసి ఉండగా కొండ కింద రక్తబీజుని అంశతో కూడిన రాజకీయాలు నేటికీ జరుగుతుండటం ఒక విషాదం. సాక్షాత్తూ అమ్మవారి సమక్షంలో క్షుద్రపూజలు కూడా చేసి రక్తబీజుని వారసత్వాన్ని ఈ 'అంశాం' కురాలు ఘనంగా చాటుకున్నాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పట్టాలు తప్పకుండా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు చెక్స్ అండ్ బ్యాలెన్సెస్‌తో కూడిన పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు స్వతంత్రమైన మూడు స్తంభాలుగా వ్యవహరించాలని భావించారు. మీడియాను నాలుగో స్తంభంగా గౌరవించారు. ఎలక్షన్ కమిషన్, విజిలెన్స్ కమిషన్ వగైరాలను స్వతంత్ర సంస్థలుగా రూపొందించారు. రాజకీయ నాయకత్వం వ్యవస్థల మీద దండయాత్ర చేసి నియంతృత్వంలోకి దేశాన్ని మళ్లించకుండా పలు చర్యలను తీసుకున్నారు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వ్యవస్థల మీదకు రాజకీయ నాయకత్వం జరుపుతున్న దండయాత్రలపై పలుమార్లు ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. బహిరంగ దండయాత్రలు కాకుండా చాపకింద నీరు మాదిరిగా వ్యవస్థల్లోకి పాక్కుంటూ వాటిని తనకు అనుకూలంగా మార్చుకునే విద్యలో పీహెచ్‌డీ చేసిన రాజకీయ నాయకుడు ఈ దేశంలో చంద్రబాబు ఒక్కడే. ఈ పాకుడు కళతోనే ముప్పయ్యేళ్లుగా ఆయన రాజకీయాల్లో కొనసాగగలుగుతున్నారు. రక్తబీజుడు వెదజల్లే నెత్తురులోంచి సైన్యాన్ని తయారుచేసుకున్నట్టు ఈయన వివిధ వ్యవస్థల్లో తన సైన్యాన్ని తయారుచేసుకున్నాడు. అందుకోసం ఏం వెదజల్లాడనేది రహస్యం. మీడియా అధిపతులను వ్యాపార మిత్రులుగా, ఆశ్రిత పెట్టుబడిదారులుగా మార్చుకొని, వారిచేత జేజేలు కొట్టించుకొని ఒక నాయకునిగా వ్యవహారంలోకి వచ్చాడు. ఈ మీడియా భజన కార్యక్రమం శ్రుతి మించడంతో అది ఎల్లో మీడియాగా ఏనాడో అప్రతిష్ఠను మూటకట్టుకున్నది.

న్యాయ వ్యవహారాల్లో ఎలా నెగ్గుకు రావాలో చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని ఏ తెలుగువాడిని అడిగినా టక్కున చెప్పేస్తాడు. బెంచ్ హంటింగ్, నాట్ బిఫోర్ వంటి కోర్టు పదజాలం చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతనే ప్రజల్లోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు స్థాపించుకున్నాడనీ, దాని జెండాను, ఎన్నికల గుర్తును తానే డిజైన్ చేసుకున్నాడనీ నాటి తెలుగు ప్రజలకు తెలుసు. తెలుగుదేశం పార్టీలో ఆశ్రయం కోరుతూ ఒక శరణార్థి మాదిరిగా చంద్రబాబు ప్రవేశించాడని కూడా ప్రజలకు తెలుసు. అయినప్పటికీ ఆ పార్టీపై దురాక్రమణ చేసి హైకోర్టు ద్వారా దానికి న్యాయ ముద్రను వేయించుకున్న బాబు లాఘవం గురించి కూడా ప్రజలకు తెలుసు. ఎన్ని కేసులు వచ్చినా దర్యాప్తు జరక్కుండా స్టేలు తెచ్చుకోగల చాకచక్యం గురించి కూడా తెలుసు. రాజకీయ ప్రత్యర్థుల మీద శూన్యంలోంచి అభియోగాలు సృష్టించి పకడ్బందీగా కేసులు నడపగల దిట్ట అని కూడా తెలుసు.

కీలకమైన అనేక పబ్లిక్ విభాగాల్లో, దర్యాప్తు సంస్థల్లో తనకు అనుకూలమైన మానవ వనరులను గుప్పిట్లో పెట్టుకోవడంలో ఈయన ప్రావీణ్యం సంపాదించినట్టు ఇప్పటికే రుజువైంది. సీబీఐ, ఐటీ, విజిలెన్స్ వగైరా విభాగాల్లోని కొందరు వ్యక్తులు గతంలో చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించారని చాలా ఆరోపణలు కూడా వచ్చాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా వ్యవహరించిన ఒక అధికారి చంద్రబాబు అవసరాలకు అనుగుణంగా ఎముకలు మెడలో వేసుకొని మరీ వ్యవహరించిన తీరు తెలిసిన విషయమే. బాబు హయాంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన అధికారి పచ్చ కండువాను బహిరంగంగా కప్పుకోవడం మాత్రమే మిగిలింది. ఆయన అప్రకటిత తెలుగుదేశం ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడన్న ఆరోపణలున్నాయి.

ఇటువంటి చంద్రబాబుకు రామోజీ వంటి మీడియా అధిపతులు తోడుగా నిలబడి గడిచిన పాతిక ముప్పయ్యేళ్లుగా ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుపుతున్న అత్యాచారాల కథలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. రామోజీ గొంతెమ్మ కోర్కెలకు తలొగ్గనందువల్లనే, అక్రమాలకు సహకరించనందువల్లనే చంద్రబాబుతో కలిసి వెన్నుపోటు పొడిచారని ఎన్టీ రామారావు స్వయంగా ఆరోపించారు. హైదరాబాద్ శివార్లలో ఫిలిం సిటీ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవడంలో రామోజీ అనేక అక్రమాలకు పాల్పడ్డారనేందుకు సాక్ష్యాలున్నాయి. ఈ అక్రమాలకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తోడ్పాటు పూర్తిగా ఉన్నది. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం. కానీ రామోజీ వాటిని యథేచ్ఛగా కొనుగోలు చేసి చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డారు. 'నాలా' చట్టాన్ని ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారు. ఫిలిం సిటీలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు 147 ఉన్నాయని ప్రభుత్వ అధికారులే లెక్క తేల్చారు. 600 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కింద రాష్ట్ర ప్రభుత్వం పంచిపెట్టిన 16 ఎకరాల భూమిని కూడా రామోజీ తన కబ్జాలోనే ఉంచుకున్నారు. ఆ స్థలాన్ని అప్పగించాలని పలుమార్లు సీపీఎం ఆధ్వర్యంలో పేద ప్రజలు ప్రదర్శనగా వెళ్లారు. వారిని తరిమికొడుతున్నాడే తప్ప వారి భూమిని వారికి ఇప్పటికీ అప్పగించడం లేదు.

తన ఫైవ్‌స్టార్ ఫిలిం సిటీ పక్కన పేదల ఇళ్లేమిటనే అసహ్య భావనతోనే రామోజీ వారిని తరిమేస్తున్నాడని అనుకోవాలి. ఈ అపూర్వ సహోదరుల భావసారూప్యత చూడండి. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతౌల్యత దెబ్బతింటుందని కోర్టుకే వెళ్లిన చంద్రబాబు... ఫిలిం సిటీ చేరువలో పేదల ఇళ్లుంటే గ్లామర్ దెబ్బతింటుందని ప్రభుత్వం ఇచ్చిన భూమిలోకి లబ్ధిదారులు రాకుండా తరిమేస్తున్న వ్యక్తి రామోజీ... ఇద్దరి ఐడియాలజీ పెత్తందారివర్గ ప్రయోజనాలే అని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలవా? ఇద్దరూ పేద ప్రజల సాధికారత బద్ధవిరోధులే అని చెప్పడానికి ఎన్ని దుష్టాంతాలు కావాలి? ప్రభుత్వ స్కూళ్లను బాగుచేస్తుంటే, ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టం చేస్తుంటే వీరూ, వీరి అనుబంధ ఎల్లో మీడియా సంయుక్తంగా కళ్లల్లో నిప్పులు పోసుకోలేదా? పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెబుతుంటే గగ్గోలు పెట్టలేదా? ఇప్పటికీ పెట్టడం లేదా?

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని రామోజీ బాహాటంగా ఉల్లంఘించిన విషయం ప్రజలకు తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా ఆయన 2,600 కోట్ల రూపాయల డిపాజిట్లను వసూలు చేశారు. ఈ నేరానికి రెండేళ్ల జైలు, రెట్టింపు సొమ్ము అంటే రూ. 5,200 కోట్ల జరిమానా పడాలి. కానీ రిలయన్స్ దగ్గర అప్పుచేసి ఆ సొమ్ము తిరిగి చెల్లించాను కనుక కేసు తూచ్ అంటున్నారు రామోజీ. దొంగతనం బయటపడిన తర్వాత ఆ దొంగసొత్తును వెనక్కు ఇచ్చేస్తే శిక్ష ఉండదా? భారత శిక్షాస్మృతిలో అటువంటి వెసులుబాటు ఏమైనా ఉన్నదా? చంద్రబాబు అండ్ కో లోని కీలక సభ్యులంతా ఇటువంటి గురువింద గింజలే. ఈ గింజలన్నీ కలిసి ఇప్పుడొక ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఈ ముఠాలోని కమెండోల్లాంటి కీలక సభ్యులను ముందుజాగ్రత్త కోసం చంద్రబాబు ఎప్పుడో బీజేపీలో చేర్పించారు. తమ ప్రయోజనాల కోసం ఏ గడ్డి కరిచేందుకైనా, ఏ జెండా మోసేందుకైనా ఏమాత్రం సిగ్గుపడని షార్ప్ షూటర్స్ వీళ్లంతా. చంద్రబాబుకు అనుకూలంగా జాతీయస్థాయిలో వ్యవస్థలను మేనేజ్ చేసే కార్యక్రమంలో వీళ్లంతా ఇప్పుడు బిజీగా మారిపోయారు. నిత్య అసత్య వ్రత కథనాలతో ఎల్లో మీడియా విరుచుకుపడుతున్నది. వ్యవస్థల్లో ప్రవేశపెట్టిన డమ్మీ రక్తబీజులంతా ఏకకాలంలో ఒకే రాగం తీస్తున్నారు.

విషయం సుస్పష్టం. సాఫ్ సీదా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా చెప్పినట్టు ఇప్పుడక్కడ వర్గపోరు జరుగుతున్నది. పేదల అనుకూల విధానాలను జగన్ ప్రభుత్వం ప్రబలంగా అమలు చేస్తున్నది. పెత్తందారీవర్గ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. ఈ వర్గానికి నాయకత్వం వహిస్తున్న బాబు–రామోజీ ముఠా స్వార్థ ప్రయోజనాలకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ట్రెజర్ హంట్ స్వప్నం కరిగిపోతున్నది. రాజధాని పేరుతో తలకెత్తుకున్న లక్షల కోట్ల వ్యాపారం చెదిరిపోతున్నది. భూములపై పెట్టుబడి పెట్టిన వారిలో అసహనం పెరుగుతున్నది. ఎన్నికల దాకా ఆగేంత ఓపిక లేదు. ఎన్నికల్లో గెలుస్తామన్న ఆశ లేదు. కోట్ల రూపాయలు తగలేసి మూడు నెలలకోసారి నిపుణుల చేత చేయించుకుంటున్న సర్వేలు వెక్కిరిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి అంతో ఇంతో ఓట్ల శాతం పెరగాలి. గత ఎన్నికల్లో టీడీపీకి 39 శాతం ఓట్లు వచ్చాయి. ఫిబ్రవరి మొదటివారంలో వచ్చిన సర్వే ఫలితాలు కరకట్ట అతిథిగృహం గుండెల్లో డైనమైట్లను పేల్చాయి.

తెలుగుదేశం పార్టీకి మద్దతు దారుణంగా 26 శాతానికి పడిపోయిందని సర్వేలో వెల్లడైంది. గడిచిన మూడు నెలల్లో ఐదు శాతం పతనం. ఈ స్థాయి పతన దశలో వున్న పార్టీ బతికి బట్టగట్టి ఏడాది లోపల ఎన్నికలకు సమాయత్తం కావడం అసాధ్యం. ఈ సర్వే ఫలితాలను ఎంత రహస్యంగా ఉంచు దామనుకున్నా కుదరలేదు. పార్టీ శ్రేణుల్లో చాలామందికి తెలుసు. మిత్రపక్షాలకూ తెలుసు. మన బలాన్ని బట్టే కదా పొత్తు కుదుర్చుకునేవారు బేరమాడేది. ఈపాటికే బయల్దేరవలసిన పవన్ కల్యాణ్ వారాహి రథం ఎందుకో బయల్దేరలేదు. ఎల్లో ముఠాకు కవి హృదయం అర్థమైంది. కడుపుమంట పుట్టుకొచ్చింది. పవన్ కల్యాణ్‌కు కేసీఆర్ వెయ్యి కోట్లతో బేరం పెట్టారని బ్లాక్ మెయిలింగ్‌కు దిగింది. ఐనసూ కదలిక లేదు. బహుశా ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని తిరగరాయాల్సి రావచ్చు. లోకేశం బాబు శనివారం నాడు ఎన్టీఆర్ బావకు నర్మగర్భంగా ఆహ్వానం పలికాడు. ఇదొక విశేషం. లోకేశం బావ కారణంగానే ఎన్టీఆర్ బావ తెలుగుదేశం పార్టీకి దూరమయ్యాడనేది బహిరంగ రహస్యం. తెలుగుదేశం పార్టీని ఇప్పుడున్న స్థితి నుంచి పైకి లేపడానికి ఎన్టీఆర్, పవన్ కల్యాణ్‌లే కాదు... అమితాబ్ బచ్చన్, రజనీ కాంత్ వంటి క్రేన్లను ఉపయోగించినా ఫలితముండదు.

వైఎస్ జగన్ ప్రభుత్వంపై కట్టుకథల ప్రచారం చాలాకాలం నుంచి జరుగుతున్నదే. ప్రభుత్వం జనరంజక కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రతి సందర్భంలోనూ మీడియా దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక రభసను సృష్టించే ప్రయత్నాలను కూడా తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రారంభించింది. నవంబర్ సర్వే ఫలితాల తర్వాత వేగాన్ని మరింత పెంచింది. ఫిబ్రవరి ఫలితాలతో పార్టీ పెద్దలతోపాటు మీడియా పెద్దలు కూడా విచక్షణ కోల్పోయారు. అనపర్తిలో, గన్నవరంలో గోక్కోవడం ఈ విచక్షణా రాహిత్యంలో భాగమే. ఎన్ని అసత్యాలు రాసేందుకైనా, ప్రసారం చేసేందుకైనా వెనుకాడేది లేదన్నట్టుగా ఎల్లో మీడియా రెచ్చిపోతున్నది. తానే రెచ్చగొట్టి సవాల్ చేసి, గన్నవరం వెళ్లిన పట్టాభిని పోలీసులు కొట్టినట్టుగా ఈనాడు బ్యానర్ వార్తలను వండేయడం క్షుద్రవిద్యకు పరాకాష్ఠ. ఇందుకోసం రెండేళ్ల కిందటి ఫోటోలను ఈనాడు నిస్సిగ్గుగా వాడేసింది. నడిరోడ్డు మీద గుడ్డలూడదీసుకొని పత్రికారంగ మాన మర్యాదలను మంటగలిపింది.

వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబరచడానికి ఎంత దారుణానికైనా దిగజారేందుకు తెలుగుదేశం, ఎల్లోమీడియాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవలి పరిణామాలన్నీ నిరూపిస్తున్నాయి. 2019లో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును ఎల్లో మీడియా పలురకాల మలుపులు తిప్పుతున్న తీరు పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే గతంలో వైఎస్ జగన్‌పై దాఖలైన తప్పుడు కేసుల దర్యాప్తు సందర్భంగా కూడా కొందరు దర్యాప్తు అధికారులతో కలిసి ఈ ముఠా ఇదే వ్యూహాన్ని అమలు చేసింది. శుక్రవారం నాడు సీబీఐ అధికారులను కలిసిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పిన మాటలు గమనించదగ్గవి. కేసు దర్యాప్తు ఫ్యాక్ట్స్ టార్గెట్‌గా కాకుండా పర్సన్ టార్గెట్‌గా జరగడం సరికాదని అవినాశ్ అన్నారు. ఎవరినో ఇరికించే ఉద్దేశంతోనే దర్యాప్తు జరుగుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రాథమిక సాక్ష్యాలను, వాస్తవాలను విస్మరిస్తూ దర్యాప్తు జరుగుతున్నదని ఇంగిత జ్ఞానానికి కూడా అవగతమవుతున్నది.

ఈ కేసులో నిందితుడుగా వున్న సునీల్ యాదవ్ అనే వ్యక్తి బెయిల్ పిటీషన్ వేసుకుంటే దాని మీద సీబీఐ కౌంటర్ వేసింది. ఆ కౌంటర్‌లోకి అవినాశ్‌రెడ్డి పేరును లాక్కొచ్చింది. తెల్లారి ఎల్లో మీడియాలో 'అవినాశ్ ఇంట్లో సునీల్', 'అవినాశ్‌రెడ్డే' వంటి పతాక శీర్షికలతో మసాలా వార్తలు వచ్చాయి. అవి చదివినవారు హత్య వెనుక అవినాశ్‌రెడ్డి హస్తముందని అనుకోవాలి. హత్య జరిగిన రోజు రాత్రి సునీల్ యాదవ్ అనే వ్యక్తి అవినాశ్ ఇంట్లో ఉన్నాడని గూగుల్ చెప్పిందట. గూగుల్ చెప్పింది గనుక అదే నిజమని అఫిడవిట్‌లో సీబీఐ పేర్కొన్నది. కానీ, ఆరోజు రాత్రి మూడు గంటలపాటు తానూ సునీల్ యాదవ్, నందిక అనే ఆస్పత్రి వద్ద కలిసే ఉన్నామని భరత్ యాదవ్ అనే విలేకరి చెప్పిన విషయాన్ని, ఇచ్చిన వీడియో సాక్ష్యాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు. వివేకా రాసినట్టు చెబుతున్న లేఖ హత్యాస్థలంలో ఆయన పీఏ కృష్ణారెడ్డి దాచి పెట్టాడు. పొద్దున అక్కడికి వచ్చిన అవినాశ్‌కు గానీ, పోలీసులకు గానీ వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉన్నట్లయితే అది హత్య అనే విషయం వెంటనే తెలిసి ఉండేది. లేఖను ఎవరికీ ఇవ్వొద్దని వివేకా అల్లుడు ఎందుకు ఆదేశించినట్టు? వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడం వారి కుటుంబంలో పెద్ద వివాదానికి కారణమైంది. రెండో కుటుంబానికి ఆస్తిలో వాటా ఇవ్వడానికి వివేకా నిర్ణయించారన్నది కూడా రహస్యమేమీ కాదు. ఈ నిర్ణయాన్ని మొదటి భార్య, కూతురు, అల్లుడు రాజశేఖరరెడ్డి, అల్లుని సోదరుడు శివ ప్రకాశ్‌రెడ్డి (వీరు వివేకా మొదటిభార్య సోదరులు) వ్యతిరేకిస్తున్నారు. కేసులో నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి చాలాకాలంగా వివేకాకు సన్నిహితులు. ఆ కారణంగా ఆయన మొదటి కుటుంబ సభ్యులతో కూడా వారికి సాన్నిహిత్యం ఉన్నది. కేసు దర్యాప్తులో ఈ ప్రాసంగిక కోణం కనిపించడం లేదేమన్న అనుమానం సాధారణ ప్రజల్లో కూడా ఉన్నది. ఏమైనా సీబీఐ దర్యాప్తు జరుగుతున్నది. న్యాయస్థానం విచారణ పూర్తి చేయవలసి ఉన్నది. ఈలోగానే ఎల్లో మీడియా నిత్యం తీర్పులు రాసేయడం, వారికి దర్యాప్తు అధికారుల నుంచి లీకులు అందడం విలువల పతనానికి పరాకాష్ఠ. ప్రజా కోర్టులో వైఎస్ జగన్‌ను గెలవ లేమన్న భీతితోనే ఈ కూటమి ఉన్మాదపూరితంగా వ్యవహరిస్తున్నదని అనుకోవాలి.

vardhelli1959@gmail.com

చాపకింద నీరు మాదిరిగా వ్యవస్థల్లోకి పాక్కుంటూ వాటిని తనకు అనుకూలంగా మార్చుకునే విద్యలో పీహెచ్‌డీ చేసిన రాజకీయ నాయకుడు ఈ దేశంలో చంద్రబాబు ఒక్కడే. ఈ పాకుడు కళతోనే ముప్పయ్యేళ్లుగా ఆయన రాజకీయాల్లో కొనసాగగలుగుతున్నారు. రక్తబీజుడు వెదజల్లే నెత్తురులోంచి సైన్యాన్ని తయారుచేసుకున్నట్టు ఈయన వివిధ వ్యవస్థల్లో తన సైన్యాన్ని తయారుచేసుకున్నాడు. అందుకోసం ఏం వెదజల్లాడనేది రహస్యం. మీడియా అధిపతులను వ్యాపార మిత్రులుగా, ఆశ్రిత పెట్టుబడిదారులుగా మార్చుకొని, వారిచేత జేజేలు కొట్టించుకొని ఒక నాయకునిగా వ్యవహారంలోకి వచ్చాడు. ఈ మీడియా భజన కార్యక్రమం శ్రుతి మించడంతో అది ఎల్లో మీడియాగా ఏనాడో అప్రతిష్ఠను మూటకట్టుకున్నది.


న్యాయ వ్యవహారాల్లో ఎలా నెగ్గుకు రావాలో చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని ఏ తెలుగు వాడిని అడిగినా టక్కున చెప్పేస్తాడు. బెంచ్ హంటింగ్, నాట్ బిఫోర్ వంటి కోర్టు పదజాలం చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతనే ప్రజల్లోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు స్థాపించుకున్నాడనీ, దాని జెండాను, ఎన్నికల గుర్తును తానే డిజైన్ చేసుకున్నాడనీ నాటి తెలుగు ప్రజలకు తెలుసు. అయినప్పటికీ ఆ పార్టీపై దురాక్రమణ చేసి హైకోర్టు ద్వారా దానికి న్యాయ ముద్రను వేయించుకున్న బాబు లాఘవం గురించి కూడా ప్రజలకు తెలుసు.

తెలుగుదేశం పార్టీకి మద్దతు దారుణంగా 26 శాతానికి పడిపోయిందని సర్వేలో వెల్లడైంది. గడిచిన మూడు నెలల్లో ఐదు శాతం పతనం. ఈ స్థాయి పతన దశలో వున్న పార్టీ బతికి బట్టగట్టి ఏడాది లోపల ఎన్నికలకు సమాయత్తం కావడం అసాధ్యం. ఈ సర్వే ఫలితాలను ఎంత రహస్యంగా ఉంచుదామనుకున్నా కుదరలేదు. పార్టీ శ్రేణుల్లో చాలామందికి తెలుసు. మిత్రపక్షాలకూ తెలుసు. మన బలాన్ని బట్టే కదా పొత్తు కుదుర్చుకునేవారు బేరమాడేది. ఈపాటికే బయల్దేరవలసిన పవన్ కల్యాణ్ వారాహి రథం ఎందుకో బయల్దేరలేదు. ఎల్లో ముఠాకు కవి హృదయం అర్థమైంది. కడుపుమంట పుట్టుకొచ్చింది. పవన్ కల్యాణ్‌కు కేసీఆర్ వెయ్యి కోట్లతో బేరం పెట్టారని బ్లాక్‌మెయిలింగ్‌కు దిగింది. ఐనసూ కదలిక లేదు. బహుశా ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని తిరగరాయాల్సి రావచ్చు. లోకేశం బాబు శనివారం నాడు ఎన్టీఆర్ బావకు నర్మగర్భంగా ఆహ్వానం పలికాడు. ఇదొక విశేషం. లోకేశం బావ కారణంగానే ఎన్టీఆర్ బావ తెలుగుదేశం పార్టీకి దూరమయ్యాడనేది బహిరంగ రహస్యం. తెలుగుదేశం పార్టీని ఇప్పుడున్న స్థితి నుంచి పైకి లేపడానికి ఎన్టీఆర్, పవన్ కల్యాణ్‌లే కాదు... అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ వంటి క్రేన్లను ఉపయోగించినా ఫలితముండదు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై కట్టుకథల ప్రచారం చాలాకాలం నుంచి జరుగుతున్నదే. ప్రభుత్వం జనరంజక కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రతి సందర్భంలోనూ మీడియా దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక రభసను సృష్టించే ప్రయత్నాలను కూడా తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రారంభించింది.

వేణువై పలకరించి... స్నేహమై పరిమళించి...

కొందరు మనుషులుంటారు, వాళ్లు మనుషులెవరూ చెయ్యలేని పనులు చేస్తారు. వారిని దేవతలనో, దేవుళ్లనో పొగిడే లోపే సామాన్యులుగా తమ అసామాన్యత్వాన్ని చాటుకుంటారు. అటువంటి వారిని సామాన్యులే నెత్తిన పెట్టుకుని మోస్తారు. అందుకు మన కాలపు సాక్ష్యం తుమ్మల వేణుగోపాలరావు... సింపుల్‌గా వేణు మాస్టారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పట్టుదలగా చదివి, అంచెలంచెలుగా పైస్థాయికి ఎదిగిన వ్యక్తి ఆయన. ఎక్కడో కృష్ణా జిల్లాలోని ఘంటశాల పాలెంలో పుట్టి అమెరికాలో ఎమ్మెస్ చేసే వరకూ ఎదగడం అంటే ఆ రోజుల్లో అంత సులువేమీ కాదు. కానీ, ఇలా ఎదుగుతున్న క్రమంలోనే ఆయన తన చుట్టూ ప్రపంచపు లోతును సులువుగానే కనుగొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను ఆకళింపు జేసుకున్నారు. రావాల్సిన మార్పులకు వేగుచుక్క కావాలని నిశ్చయించుకున్నారు. వయసు, హోదా, సామాజిక స్థితులను పట్టించుకోకుండా అందరికీ స్నేహ హస్తం చాచారు. కడవరకూ అందరికీ మంచి స్నేహితుడిగా నిలిచిపోయారు.

డిగ్రీ పరీక్షలు రాసి విశాఖలోని హెచ్‌బీ కాలనీలో అడుగు పెట్టిన నాకు, ఆయన ఎదురు పడినప్పుడు హడిలి చచ్చా. మామూలు కాలేజీ ప్రిన్సిపాల్ అంటేనే ఉలికిపాటుగా ఉండే వయసులో ఏకంగా యూనివర్సిటీలో ప్రిన్సిపాల్ అనేసరికి మాటలు పెగల్లేదు. నా పరిస్థితి అర్థం చేసుకున్న ఆయన నెమ్మదిగా లోపలకు వెళ్లి పోయారు. చలసాని ప్రసాద్, కృష్ణాబాయిలతో మాట్లాడి వెళ్లిపోతుంటే బయటకు వచ్చి 'అరవైలో ఇరవై' అనే పుస్తకం, దానితోపాటు చిన్న బుక్‌లెట్ చేతిలో పెట్టారు. అప్పుడు రాళ్లయినా అరిగించుకునే ఆకలితో ఉండేవాడిని కాబట్టి రాత్రికి రాత్రే చదివేశా. ఆయనంటే గౌరవం రెట్టింపు అయ్యింది. కానీ, మళ్లీ కలిసినప్పుడు మాత్రం మామూలే. అందుకు కారణం,



ఆయన గట్టిగా, ఖరాకండీగా, నిర్దిష్టంగా మాట్లాడటం. రావిశాస్త్రి, కారా మాస్టార్ల గురించి ఆసక్తికరమైన కబుర్లు చెప్పే వారు. ఆయనకు గుర్తుకు వచ్చినప్పుడల్లా 'మీరు ఇది తప్పకుండా చదవాలి', 'ఇది చూశారా?' అంటూ లోపలెక్కడ్నించో పుస్తకాలు పట్టుకొచ్చి ఇచ్చే వారు.

విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మార్గ దర్శిగా నిలిచిన వేణు మాస్టారు కృషినీ, ప్రతిభనీ, ఆశయాలనీ... ఇటు విద్యా రంగం వారు గానీ, అటు సాహిత్య రంగంవారు గానీ గుర్తించకపోయినా సొంత గ్రామస్థులు అక్కున చేర్చుకుని విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరం. అక్కడే వికాస కేంద్రం కూడా ఏర్పాటు చేసి, ఆయన భావాలను బాగానే ఒంట బట్టించుకున్నట్టు నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సాన్నిహిత్యం కలిగిన అనేకమంది చిన్నా, పెద్దల అభిప్రాయాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించడం ద్వారా ఆయన గురించి భావితరాలు కూలంకషంగా తెలుసుకునే వీలు కల్పిస్తున్నారు.

తుమ్మల వేణుగోపాలరావు లాంటి కృషీవలురు అరుదుగా ఉంటారు. అటువంటి అసామాన్యులను పట్టించుకుని, పదిమందికీ ఆదర్శంగా నిలిపేవారే ప్రస్తుత సమాజానికి అవసరం.

– దేశరాజు
సీనియర్ జర్నలిస్ట్ । 9948680009

(నేడు కృష్ణా జిల్లా ఘంటసాల పాలెంలో తుమ్మల వేణుగోపాలరావు విగ్రహావిష్కరణ)

సేంద్రియ సాగుబాట

దేశంలో ఆర్గానిక్ ఫార్మింగ్‌వైపు రైతుల అడుగులు

- ప్రస్తుతం 66 లక్షల ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం
- ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు కల్పిస్తే మొగ్గు చూపనున్న మరింత మంది అన్నదాతలు



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: సేంద్రియ వ్యవసాయం.. ఇప్పుడు ఈ పదం పంటల సాగులో ఎక్కువగా వినిపిస్తోంది. ఇంతకాలం అధిక దిగుబడి ఆశతో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడిన రైతులు దానివల్ల భూమి నిస్సారంగా మారడమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమవడం, పురుగుమందుల అవశేషాలున్న పంట ఉత్పత్తులను ఆహారంగా వినియోగిస్తూ ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని క్రమంగా గుర్తిస్తున్నారు. నెమ్మదిగా మళ్లీ సేంద్రియ సాగువైపు మళ్లుతున్నారు.

బుడిబుడి అడుగులు..

దేశంలో ప్రస్తుతం 39.4 కోట్ల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంది. అందులో వ్యవసాయం చేస్తున్న భూమి 21.5 కోట్ల ఎకరాలు ఉంది. ఇందులో 66 లక్షల ఎకరాల్లో మాత్రమే సర్టిఫైడ్ ఆర్గానిక్ సాగు జరుగుతున్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే పూర్తి సాగు విస్తీర్ణంలో సేంద్రియ సాగు కేవలం 3.24 శాతమేనన్న మాట. అయినప్పటికీ గత కొన్నేళ్లతో పోలిస్తే సేంద్రియ సాగు దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయని అర్థమవుతోంది. సర్టిఫికేషన్ లేకుండా సేంద్రియ సాగు చేస్తున్న రైతులు కూడా ఉన్నారు. ఈ విస్తీర్ణం దాదాపు సర్టిఫైడ్ సేంద్రియ సాగు కంటే ఏడెనిమిది రెట్లు అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఆదర్శంగా సిక్కిం..

ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన సిక్కిం చిన్న రాష్ట్రమే అయినా.. సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఆ రాష్ట్ర రైతులకు ప్రోత్సాహకాలు కల్పించడంలో అక్కడి ప్రభుత్వం ముందంజలో ఉండడమేకాక... వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించే యత్నం చేస్తోంది. దేశంలో మొట్టమొదటి పూర్తి సేంద్రియ సాగు (ఆర్గానిక్ ఫామింగ్) సర్టిఫికేషన్ పొందిన రాష్ట్రం కూడా సిక్కిం ఒక్కటే కావడం విశేషం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సేంద్రియ వ్యవసాయ రైతులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ప్రధాన దేవాలయాలకు సరఫరా చేసే ఆహారపదార్థాలను సేంద్రియ సాగు ద్వారా పండించినవే వినియోగించేలా ముందుకు సాగుతోంది.

మధ్యప్రదేశ్ అగ్రస్థానం..

సేంద్రియ సాగుపై రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ప్రస్తుతం విస్తీర్ణపరంగా చూస్తే మధ్యప్రదేశ్, రాజస్తాన్, మహారాష్ట్ర తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఏపీ సైతం గత రెండేళ్లుగా దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తోంది. భారీగా రైతులు సేంద్రియ సాగువైపు మళ్లేలా ప్రణాళికలు అమలు చేస్తోంది. ఏపీలో దాదాపు 10 శాతం మంది రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఆరేడు లక్షల ఎకరాల వరకు సేంద్రియ సాగు జరుగుతున్నట్లు అంచనా. సేంద్రీయ వ్యవసాయంలో అనుభవం గడించిన వారితోనే మిగిలిన రైతాంగానికి శిక్షణ ఇప్పిస్తుండటంతో రైతులు ఆకర్షితులు అవుతున్నారు. గుజరాత్, హరియాణా కూడా సేంద్రియం వైపు వడివడిగా అడుగులేస్తున్నాయి. ఆయా రాష్ట్రాలు తమ దగ్గర సాగైన సేంద్రియ పంటలను విదేశాలకు ఎగుమతి చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

సేంద్రియ ఉత్పత్తుల విలువ రూ.14,800 కోట్లు

దేశంలో సాగవుతున్న సేంద్రియ ఉత్పత్తుల మొత్తం విలువ రూ.14,800 కోట్లు. ఇందులో విదేశాలకు దాదాపు రూ.11,500 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అవుతుండగా.. రూ.2వేల కోట్ల విలువైన ఉత్పత్తులు రిటైల్ మార్కెట్లకు వెళుతున్నాయి. మిగిలిన ఉత్పత్తులను రైతులు నేరుగా విక్రయించుకుంటున్నారు.


ఎందుకు ఈ సేంద్రియం..?

సేంద్రియ సాగుతో ప్రధానంగా రైతులు చేసే వ్యయం గణనీయంగా తగ్గుతుంది. సంప్రదాయ వ్యవసాయంతో వచ్చే ఆదాయం కంటే కూడా సేంద్రియ వ్యవసాయంతో లాభాలు ఎక్కువ. దీనికితోడు పొలాలు సారవంతం కావడం, భూగర్భ జలాలు కలుషితం కావు. సేంద్రియ సాగుతో అటు ప్రకృతికి, ఇటు ప్రజలకు మేలు జరుగుతుంది. అయితే దేశంలోని రైతులంతా సేంద్రియ సాగు బాట పట్టేలా అడుగులేయడానికి ఇంకా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వాలు కూడా సేంద్రియ సాగు వైపు రైతులను మళ్లించడానికి వీలుగా తగిన ప్రోత్సాహకాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

ఆసియాలోని టాప్-10 దేశాల్లో సేంద్రియ సాగు..

విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)

దేశం	విస్తీర్ణం
చైనా	68.84
భారత్	66.44
ఫిలిప్పీన్స్	5.40
థాయ్‌లాండ్	2.92
కజకిస్తాన్	2.83
ఇండోనేసియా	2.08
వియత్నాం	1.86
పాకిస్తాన్	1.74
శ్రీలంక	1.66
దక్షిణ కొరియా	1.01



రైతుకు నమ్మకం కలిగిస్తున్నాం..



ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయంపై నమ్మకం కలిగించేలా చర్యలు చేపట్టాం. 2030–31 నాటికి రాష్ట్రంలోని రైతులంతా ప్రకృతి సాగు వైపు మళ్లించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రైతు భరోసా కేంద్రాలే ప్రకృతి సాగుపై శిక్షణ ఇచ్చే కార్యాలయాలు. రైతులు ఒకేసారి మారాలంటే మారరు. అందుకు ఓపికగా వారిని మార్చడానికి ప్రయత్నించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారు. అలా రైతులను ఒప్పించడం వల్లే 10 శాతం మంది సేంద్రియ సాగువైపు మళ్లారు. సాధారణ ఉత్పత్తుల కంటే ఆర్గానిక్ ఉత్పత్తులకు 10 శాతం అధిక ధరలు లభిస్తున్నాయి. మధ్యప్రదేశ్, మేఘాలయ, రాజస్తాన్, ఒడిశా రాష్ట్రాల నుంచి రైతులు ఏపీలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయడానికి వస్తున్నారు.

– విజయ్‌కుమార్ ఐఏఎస్, ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్

ప్రపంచంలోనే ఎక్కువ మంది రైతులు మన దగ్గరే..



సేంద్రియ వ్యవసాయం చేస్తున్న వారిలో ప్రపంచంలో అత్యధిక రైతులు భారత్‌లోనే ఉన్నారు. వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే ఎక్కువ మంది ఈ సాగుపట్ల మొగ్గు చూపుతారు. ప్రభుత్వాలు దీనిపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంది. సేంద్రియ సాగు సర్టిఫికేషన్‌పై రైతుల్లో ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– సీవీ రామాంజనేయులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

క్లుప్తంగా...

శ్రీకృష్ణుడి అలంకార సేవలో శ్రీలక్ష్మీనరసింహుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీస్వామి వారు మురళి చేతబట్టి శ్రీకృష్ణుడి అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం.. పొన్న వాహన సేవలో తిరు మాడ వీధుల్లో ఊరేగారు. ఆచార్యులు తిరు మాడ వీధుల్లో స్వామిని ఊరేగించి, పడమటి రాజగోపురం ముందున్న వేంచేపు మండపంలో అధిష్టించి అలంకార సేవల విశిష్టతలను వివరించారు. సాయంత్రం ఆలయ మాడ వీధిలో వైటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లకు జాతీయ పురస్కారాలు


సోమిరెడ్డి


రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఆర్టీసీకి చెందిన ఇద్దరు డ్రైవర్లకు జాతీయ పురస్కారాలు దక్కాయి. తమ సర్వీసు కాలంలో ప్రమాదాలకు ఆస్కారం లేని విధంగా బస్సులు నడిపినందుకు రహదారి భద్రత కేటగిరీలో వీరికి 'హీరోస్ ఆన్ ది రోడ్' పురస్కారం దక్కింది. కుషాయిగూడ డిపోకు చెందిన రంగారెడ్డి, సూర్యాపేట డిపోకు చెందిన సోమిరెడ్డిలకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) పురస్కారాన్ని ప్రకటించింది. ఏప్రిల్ 18న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వీరికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లయ్య మృతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.ఎల్. మల్లయ్య శనివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందారు. మల్లయ్య అకాల మరణంపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ మహేష్ కుమార్‌గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, టీపీసీసీ ఫిషర్మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో గంగపుత్ర జేఏసీ అధ్యక్షుడు సుదర్శన్, యువజన రాష్ట్ర అధ్యక్షుడు గౌటే గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

'వర్సిటీల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టరాదు'

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): తెలంగాణలోని యూనివర్సిటీల్లో ఉద్యోగాల నియామకాలు చేపట్టరాదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు ఆయా వర్సిటీల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ అనుమతి లేనిదే యూనివర్సిటీల అధికారులు స్వతహాగా టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేపట్టరాదని స్పష్టంచేశారు. వర్సిటీల్లో ఇక నుంచి రెగ్యులర్, సెల్ఫ్‌ఫైనాన్స్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ తదితర బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయకూడదని ఉన్నత విద్యా మండలి అధికారులు ఆయా విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లకు జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు.

5న ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగాలకు అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి మార్చి 5వ తేదీన ఉదయం, మధ్యాహ్నం అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. హాల్‌టిక్కెట్లను ఈనెల 27 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వెల్లడించారు.

విజయవాడలో ఖమ్మం వైద్యవిద్యార్థి ఆత్మహత్య


నవీన్‌కుమార్

ఏన్కూరు: ఖమ్మం జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి ఏపీలోని విజయవాడలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం భగవాన్ నాయక్ తండాకు చెందిన బానోతు నవీన్‌కుమార్ (23) విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మెడిసిన్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 15వ తేదీన అతను విజయవాడలోని తన గదిలో పురుగు మందు తాగగా స్నేహితులు ఆస్పత్రిలో చేర్పించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న నవీన్ శనివారం ఉదయం మృతి చెందగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా, నవీన్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని అంటున్నారు.

ప్రీతిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం



- ఇంకా విషమంగానే పరిస్థితి..వెంటిలేటర్‌పై చికిత్స
- హెల్త్ బులెటిన్ విడుదల చేసిన నిమ్స్

లక్డీకాపూల్ (హైదరాబాద్)/సాక్షి, వరంగల్: పీజీ వైద్యవిద్యార్థిని ప్రీతిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నామని నిమ్స్ వైద్యులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమెకు ప్రొటోకాల్ ప్రకారం వైద్య చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్యంపై శనివారం యాజమాన్యం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా నిమ్స్ వైద్య బృందం సభ్యులు మాట్లాడుతూ.. ప్రీతి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందన్నారు. ప్రస్తుతం ఆమెకు ఎక్మో సపోర్ట్‌తో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామన్నారు. కాగా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ పరిస్థితిలో ఉన్న ప్రీతిని నిమ్స్‌కు తీసుకువచ్చారని వైద్యులు తెలిపారు. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లు నిమ్స్‌కు వచ్చి ప్రీతి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. ప్రీతి ర్యాగింగ్ ఘటనకు మతం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రీతి విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిష్పాక్షికంగా విచారణ: మంత్రి హరీశ్‌రావు

ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు భరోసా కల్పించారు. నిష్పాక్షికంగా పూర్తి విచారణ జరుగుతుందని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్యంపై మంత్రి సమీక్షించారు. ఆమెకు అందిస్తున్న వైద్యం గురించి, చికిత్స చేస్తున్న ప్రత్యేక వైద్య బృందాన్ని ఆరా తీశారు. డాక్టర్ ప్రీతికి అత్యుత్తమ చికిత్స అందించాలని వైద్యులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.

సైఫ్ విషయంలో ఏం చేద్దాం?: పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసులో అరెస్టయిన సీనియర్ విద్యార్థి సైఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ) అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికే ర్యాగింగ్, వేధింపుల కేసులో అరెస్టయి జైలుకెళ్లిన సైఫ్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై కాళోజీ హెల్త్‌వర్సిటీకి.. కేఎంసీ ప్రిన్సిపల్ మోహనదాస్ శనివారం లేఖ రాశారు. సోమవారంలోగా నిర్ణయం రావొచ్చని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సైఫ్‌పై చర్యలు ఉంటాయని ప్రిన్సిపల్ శనివారం 'సాక్షి'కి తెలిపారు. అలాగే, కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా కేఎంసీలో సోమవారం ర్యాగింగ్ నియంత్రణ కమిటీ సమావేశమై నివేదికను రూపొందించి పంపుతుందన్నారు. ప్రీతి కేసులో సైఫ్‌పై ఆరోపణలు రుజువైతే అతడి పీజీ అడ్మిషన్‌ను రద్దు చేసే అవకాశం ఉందని చెపుతున్నారు. ఏమైనా.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు లోబడి చర్యలుంటాయని మోహన్‌దాస్ తెలిపారు.

'సర్'పై సర్వత్రా చర్చ: కేఎంసీ కాలేజీలో సీనియర్లను.. జూనియర్లు 'సర్'అని పిలుస్తున్నారని, దీనిపై దృష్టి సారించాల్సి ఉందని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇలా పిలిపించుకోవడం ర్యాగింగ్ కిందికే వస్తుందని వరంగల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అభిప్రాయపడింది. సీనియర్లు, జూనియర్ల మధ్య 'సర్'అనే పదం చాలా గ్యాప్ తీసుకొస్తుందని నిపుణులు అంటున్నారు.


చొక్కా ఇస్త్రీ చేస్తున్న మంత్రి పువ్వాడ. పక్కన రజకుడు రామయ్య

సీఎంకు నా కృతజ్ఞతలు తెలపండి

మంత్రి పువ్వాడకు రజకుడి వినతి

ఖమ్మం మయూరి సెంటర్: 'మీ ద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపాలనుకుంటున్నా.. నాకు మీరే ఎదురు కావడం అదృష్టం'.. అంటూ రజకుడు రామయ్య తన మనసులోని మాటను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు తెలిపారు. 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో భాగంగా మంత్రి శనివారం ఉదయం ఖమ్మం 55వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బ్యాంక్ కాలనీలో రోడ్డు వెంట ఇస్త్రీ చేస్తున్న రామయ్యను పలకరించారు. దీంతో ఆశ్చర్యపోయిన ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు, రజకులకు సీఎం కేసీఆర్ 120 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుండడం ఆనందంగా ఉందని చెప్పారు. 'మీకు, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పాలని అనుకుంటున్నా.. ఇంతలోనే మీరే వచ్చారు' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఓ చొక్కా ఇస్త్రీ చేశారు.

బిడ్డను తీశారు.. కత్తెర మరిచారు

- సిజేరియన్ సమయంలో వైద్యురాలి నిర్లక్ష్యం
- ఆరేళ్లుగా నరకయాతన పడిన బాధితురాలు
- గోదావరిఖనిలోని ప్రైవేట్ నర్సింగ్ హోంలో ఘటన


బాధితురాలి కడుపులో మర్చిపోయిన కత్తెర

కోల్‌సిటీ(రామగుండం): ప్రసవం చేయమని డాక్టరుని వేడుకుంటే..సిజేరియన్ ద్వారా కడుపులో బిడ్డను తీసి..కత్తెర ఉంచి కడుపు కుట్టేశారు. దీంతో అనారోగ్య సమస్యలతో బాధితురాలు ఆరేళ్లుగా నరకయాతన అనుభవించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాలకు చెందిన ఓ మహిళ మొదటికాన్పు కోసం గోదావరిఖనిలోని తన పుట్టింటికి వచ్చింది. కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో 2017 ఏప్రిల్ 15న చేరింది. మరుసటిరోజు ఆస్పత్రిలోని సీనియర్ గైనకాలజిస్టు సిజేరియన్ ద్వారా మగబిడ్డకు పురుడు పోశారు. అయితే సిజేరియన్ అనంతరం మహిళ కడుపులో కత్తెర మరిచిపోయి కుట్లు వేసి వారం తర్వాత ఇంటికి పంపేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కుటుంబంతో ఉంటున్న సదరు మహిళకు మొదటి కాన్పు జరిగి ఆరేళ్లయినా గర్భం దాల్చలేదు. కడుపునొప్పితోపాటు తరుచూ అనారోగ్య సమస్యలు ఎదురవుతుండటంతో రెండురోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చూపించుకుంది. అక్కడి వైద్యుల సూచన మేరకు ఎక్స్‌రే తీయించగా...ఆమె కడుపులో కత్తెర ఉందని వైద్యులు నిర్ధారించారు.

పరిహారం చెల్లించేందుకు ఒప్పుకున్న వైద్యురాలు

బాధితురాలికి జరిగిన దారుణంపై కుటుంబ సభ్యులు సిజేరియన్ చేసిన గైనకాలజిస్టును నిలదీయడంతో విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు రాజీ కుదుర్చుకోవాలని వైద్యురాలు వేడుకున్నారు. బాధితురాలి కడుపులో కత్తెర తీసేందుకు చేసే శస్త్రచికిత్సకు ఖర్చును తానే భరించడంతోపాటుగా రూ.3.50లక్షలు చెల్లిస్తానని చెప్పడంతో అందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. అయితే ఈ విషయం బయటకు తెలియడంతో వెంటనే డబ్బులిచ్చి ఆ మహిళను హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. దీనిపై వైద్యురాలిని వివరణ అడగగా..ఆపరేషన్ సమయంలో పొరబాటు జరిగి ఉండొచ్చని చెప్పారు. కాగా, కడుపులోనే కత్తెర మర్చిపోయిన గైనకాలజిస్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రామగుండం నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు తెలంగాణను పాలించే నైతికత లేదు

- తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతిని కోరుతాం
- గవర్నర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణను పాలించే నైతికత లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ వర్గానికీ రక్షణ లేదన్నారు. ప్రతిపక్షాలపై బీఆర్ఎస్ నేతలు విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శనివారం తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ.. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు షర్మిల వినతిపత్రాన్ని సమర్పించారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. పట్టపగలే వీధికుక్కలు పసిపిల్లలపై దాడులు చేస్తుంటే బీఆర్ఎస్ గూండాలు ప్రతిపక్షాల మీద కుక్కల్లా పడి దాడులు చేస్తున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదంటూ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి పక్షాలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు, మహిళలకు గౌరవం లేదన్నారు. దేశంలో భారత రాజ్యాంగం అమలవుతుంటే.. తెలంగాణలో మాత్రం కేసీఆర్ రాజ్యాంగం అమలవుతోందని షర్మిల ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు అన్న పదం వింటేనే కేసీఆర్, బీఆర్ఎస్‌కు ఎందుకు అంత అసహనమని ప్రశ్నించారు. భూములన్నీ కబ్జాలు చేసి అక్రమంగా సంపాదించుకున్న ఆ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ కేసీఆర్ టికెట్లు ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ.. త్వరలో రాష్ట్రపతి దగ్గరకు కూడా వెళ్లబోతున్నామని షర్మిల తెలిపారు. గవర్నర్ తాము చెప్పిన దానికి ఏకీభవించారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా కలిసిరావాలని ఆమె పిలుపునిచ్చారు. మెడికల్ విద్యార్థిని ప్రీతికి తన సానుభూతి ఉందని పేర్కొంటూ.. ఆత్మహత్యాయత్నం చేసిన మరో మెడికల్ స్టూడెంట్‌కు కూడా తమ పార్టీ సానుభూతి ఉంటుందని షర్మిల ప్రకటించారు.

నిజామాబాద్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య

హాస్టల్ గదిలో ఉరేసుకుని బలవన్మరణం ● ఏడాదిగా నడుమునొప్పితో ఇబ్బంది పడుతున్న వైనం ● ఆత్మహత్యకు తెలియని కారణాలు..


కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి రాధ.(ఇన్‌సెట్‌లో) దాసరి హర్ష (ఫైల్)

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చింతగూడకు చెందిన దాసరి హర్ష (24) తాను ఉంటున్న హాస్టల్ గదిలోనే శనివారం తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ప్రస్తుతం ఫైనల్ పరీక్షలు జరుగుతుండగా, శుక్రవారం పరీక్ష రాసిన అనంతరం హర్ష నడుం నొప్పిగా ఉందని స్నేహితులతో చెప్పి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకున్నాడు. రాత్రి భోజనం తర్వాత 10 గంటలకు తన గదికి వెళ్తూ.. తెల్లవారుజామున 3 గంటలకు నిద్ర లేపాలని స్నేహితుడు తరుణ్‌కు చెప్పాడు. తరుణ్ ఆ సమయానికి వచ్చి హర్ష గది తలుపు తట్టగా స్పందనలేదు. మళ్లీ ఉదయం 7 గంటలకు వచ్చి పిలిచినా హర్ష స్పందించకపోవటంతో తరుణ్ తోటి విద్యార్థులకు విషయాన్ని తెలిపాడు. మెస్ ఇన్‌చార్జులు వచ్చి హర్షను పిలవగా స్పందించకపోవటంతో తలుపును బలవంతంగా తెరిచారు. హర్ష ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించటంతో అంతా షాక్‌కు గురయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు హర్ష తల్లి రాధకు విషయం తెలిపి, మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తెలియని కారణాలు.. అనుమానాలు

దాసరి శ్రీనివాస్, రాధ దంపతులకు హర్ష, ధనుష్ ఇద్దరు కుమారులు. పెద్దవాడైన హర్ష ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ పన్నెండేళ్లుగా మలేసియాలో ఉంటున్నారు. తల్లి ఇంటివద్ద ఉంటున్నారు. హాస్టల్‌లో ఎలాంటి ఇబ్బందుల్లేవని, హర్ష చదువులో చురుగ్గా ఉండేవాడని స్నేహితులు చెబుతున్నారు. తోటి విద్యార్థులతో కలిసిమెలసి ఉండే హర్ష ఆత్మహత్యకు పాల్పడటం అనుమానాలను రేకెత్తిస్తోందని అంటున్నారు. హర్షకు ఎలాంటి దురలవాట్లు లేవని కుటుంబసభ్యులు చెప్పారు. ప్రేమ వ్యవహారాలు కారణమా అనే సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ఘటనపై విచారణ జరిపించాలంటూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర సంఘాల విద్యార్థులు హాస్టల్ ఎదుట బైఠాయించారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు.

మమ్మీ నేను డాక్టరవుతున్నా..

'మమ్మీ నేను డాక్టర్‌ను అవుతున్నా.. నీకు ఇల్లు కట్టిస్తా.. కారు కొనిస్తా' అంటూ తన కుమారుడు మూడ్రోజుల క్రితమే ఫోన్లో సంబరంగా చెప్పాడని తీరా శవమై కనిపిస్తాడని అనుకోలేదంటూ హర్ష తల్లి దాసరి రాధ విలపించిన తీరు కలచివేసింది. సంవత్సరం నుంచి హర్షకు నడుం నొప్పి ఉందని, బుధవారం ఫోన్‌చేసి నొప్పి బాగా ఉందని ఏడ్వటంతో ఇంటికి రమ్మని చెప్పానన్నారు. కాని పరీక్షలు ఉన్నాయని, ఇప్పుడే ఇంటికి రాలేనని అన్నాడని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యాక హర్షను హైదరాబాద్‌కు తీసుకెళ్లి చూపిద్దామనుకున్నామని, ఇంతలోనే అఘాయిత్యానికి పాల్పడతాడనుకోలేదన్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లి, బంధువులు గుండెలవిసేలా రోదించారు. నడుం నొప్పి మినహా మరే సమస్యలు లేవని, తన కొడుకు ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడంటూ తల్లి రాధ కళాశాల అధికారులను, తోటి విద్యార్థులను ప్రశ్నిస్తూ విలపించడం కలచివేసింది.

క్లుప్తంగా...

..బీజేపీకి 100 సీట్లే: నితీశ్

పూర్ణియా: కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ ఏకమై పోరాడితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వంద సీట్లకే కట్టడి చేయవచ్చని బిహార్ సీఎం నితీశ్ కుమార్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలతో జట్టుకట్టే విషయంలో కాంగ్రెస్ తొందరగా ఒక నిర్ణయానికి రావాలన్నారు. 'నా సూచనను మీరు అంగీకరిస్తే కాషాయ పార్టీని 100 సీట్లలోపే కట్టడి చేయవచ్చు. అంగీకరించని పక్షంలో ఏం జరుగుతుందో మీకు తెలుసు'అని ఆయన కాంగ్రెస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను ఏకం చేసి, బీజేపీని అధికారం పీఠం నుంచి దించేయడమే తన ఏకైక లక్ష్యమన్నారు. తన లక్ష్యం సాకారమయ్యేందుకు కృషి చేస్తున్నానని, బీజేపీని దేశంలో లేకుండా చేయాలని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని పూర్ణియాలో శనివారం జరిగిన మహాఘట్‌బంధన్ ర్యాలీలో నితీశ్ ప్రసంగించారు.

బీజేపీవి విభజన రాజకీయాలు: లాలూ

కుల, మత ప్రాతిపదికన దేశప్రజలను విభజించే కుట్రకు బీజేపీ తెరతీసిందని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స తర్వాత ఢిల్లీకి చేరుకున్న లాలూ అక్కడి నుంచే పూర్ణియాలో మహాకూటమి ర్యాలీనుద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. 'మైనారిటీలంటే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు గిట్టదు. కులం, మతాల వారీగా జనాన్ని విడగొట్టడమే బీజేపీ పని. బీజేపీని ఓడించే సంకల్పానికి బిహార్ నుంచి శ్రీకారం చుడదాం' అని పిలుపునిచ్చారు.

భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఎన్ఈపీ: మోదీ

న్యూఢిల్లీ: యువత సామర్థ్యం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్య, నైపుణ్యాలకు నూతన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) కొత్త రూపమిచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. ఏళ్లుగా విద్యావిధానంలో సరళత లోపించడంతో ఈ రంగంలో స్తబ్దత ఆవరించిందని చెప్పారు. ఎన్ఈపీలో విద్య, నైపుణ్యాలకు సమాన ప్రాముఖ్యత లభించిందన్నారు. దీని వల్ల విద్యార్థులకు ప్రతిబంధకాలుగా మారిన గత నిబంధనలను తొలగించి విద్యారంగంలో మరిన్ని సంస్కరణలను చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలు కలుగుతుందని ప్రధాని చెప్పారు. విద్య, నైపుణ్యాలతో యువశక్తిని సంసిద్ధులను చేయడం అంశంపై శనివారం జరిగిన బడ్జెట్ అనంతర వెబినార్‌నుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'మన ఉపాధ్యాయుల పాత్ర ఇకపై కేవలం తరగతి గదులకే పరిమితం కారాదు. దేశవ్యాప్తంగా ఉన్న మన విద్యా సంస్థలకు మరిన్ని రకాల బోధనోపకరణాలు అందుబాటులోకి రానున్నాయి. వీటివల్ల గ్రామాలు, నగరాల్లోని పాఠశాలల మధ్య అంతరాన్ని తగ్గించే అనేక అవకాశాలు ఉపాధ్యాయులకు చేరువలో రానున్నాయి'అని ప్రధాని మోదీ చెప్పారు.

అమెరికాను వణికిస్తున్న జాంబీ డ్రగ్

ప్రాణాంతకంగా మారుతున్న జైలజీన్-ఫెంటానిల్ మిశ్రమం



- విచ్చలవిడిగా వాడుతున్న డ్రగ్ బానిసలు
- భయంకరమైన సైడ్ ఎఫెక్టులకు కారణం
- ఒళ్లంతా పుండ్లు, అవయవాల తొలగింపు
- ఫిలడెల్ఫియాలో మొదలై దేశమంతా వ్యాప్తి
- 36 రాష్ట్రాల్లో విస్తరించిన జాంబీ డ్రగ్
- కెనడాలో కూడా విస్తరిస్తున్న జాఢ్యం



జాంబీ డ్రగ్ వాడితే...


- జైలజీన్ చర్మాన్ని, మాంసాన్ని తినేస్తుంది.
- కేంద్ర నాడీ వ్యవస్థపై నేరుగా తీవ్ర ప్రభావం చూపుతుంది.
- రక్తనాళాలు పాడవుతాయి. రోగ నిరోధక శక్తి క్షీణిస్తుంది.
- దాంతో చర్మం ఊడటంతో పాటు ఒళ్లంతా పుండ్లు పుడతాయి.
- పుండ్లు ముదిరి సంబంధిత అవయవాలు కుళ్లిపోతున్నాయి. వాటిని తీసేయాల్సి వస్తోంది.
- మతిమరుపు వంటి మరెన్నో భయానక సైడ్ ఎఫెక్టులూ తలెత్తుతాయి.
- గుండె, ఊపిరితిత్తుల పనితీరు, కంటిచూపు మందగిస్తాయి.
- శ్వాస అందదు. బీపీ పడిపోయి ప్రాణాంతకంగా మారుతుంది.



ఫిలడెల్ఫియాలో మూడో వంతుకు పైగా డ్రగ్ మరణాలు ట్రాంక్ వల్లేనని తేలింది



కెన్సింగ్టన్‌కు చెందిన ఈమె పేరు పెడెర్ (38). ట్రాంక్ వాడకంతో కుళ్లిపోయిన ఎడమ కాలిని తొలగించగా కుడి చేయి కూడా ఇప్పుడిలా పుండ్లు పడిపోయింది.



జైలజీన్. ప్రస్తుతం అమెరికాను వణికిస్తున్న 'జాంబీ' డ్రగ్. గుర్రాలు, ఆవులు తదితర జంతువుల్లో నరాలకు విశ్రాంతి ఇచ్చే నిమిత్తం అనుమతించిన ఈ ట్రాంక్విలైజర్ ఇప్పుడక్కడ పెను విలయానికి దారి తీస్తోంది. దీన్ని ఫెంటానిల్ అనే డ్రగ్‌తో కలిపితే అత్యంత హెచ్చు పొటెన్సీతో కూడిన ప్రాణాంతకమైన మత్తుమందుగా మారుతోంది. కారుచౌకగా తయారవుతుండటంతో డ్రగ్ డీలర్లు కొన్నేళ్లుగా దీన్నే విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ట్రాంక్, ట్రాంక్ డోప్, జాంబీ డ్రగ్‌గా పిలిచే ఈ డ్రగ్ ప్రస్తుతం యూఎస్ వీధుల్లో పొంగిపొర్లుతోంది. ఎక్కడ చూసినా డ్రగ్ బానిసలు ట్రాంక్ మత్తులో జోగుతూ కన్పిస్తున్నారు. శరీరంపై దీని దుష్ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఒంటిపై పుండ్లు పడటం, చర్మం ఊడిపోవడంతో మొదలై చూస్తుండగానే ఒంట్లో శక్తులన్నీ ఉడిగిపోయే పరిస్థితి తలెత్తుతోంది. అడుగు తీసి అడుగేయడమూ కష్టమై బాధితులు నడిచే శవాల్లా మారి అచ్చం జాంబీలను తలపిస్తున్నారు! ఈ ధోరణి కొంతకాలంగా మరీ ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోంది.

కేంద్ర స్థానం ఫిలడెల్ఫియా

ఈ జాంబీ డ్రగ్ ఉత్పాతానికి ఫిలడెల్ఫియా కేంద్ర స్థానంగా తేలింది. మామూలుగానే ఈ నగరం డ్రగ్స్ డీలర్లకు, బానిసలకు అడ్డా. దాంతో సహజంగానే జాంబీ డ్రగ్ వాడకం కూడా ఇక్కడ విచ్చలవిడిగా పెరిగింది. ఏ వీధిలో చూసినా దీని ప్రభావంతో ఎటూ కదల్లేక ఎక్కడపడితే అక్కడ పడిపోయిన డ్రగ్ బానిసలే కన్పిస్తున్నారు. జాంబీ డ్రగ్ బెడద చూస్తుండగానే అమెరికా అంతటికీ పాకుతోంది. తూర్పున న్యూయార్క్, మసాచుసెట్స్, మైన్, పశ్చిమ తీరంలో కాలిఫోర్నియా, ఒరెగాన్, వాషింగ్టన్, దక్షిణాన టెక్సాస్, లూసియానా, అలబామా... ఇలా 36కు పైగా రాష్ట్రాల్లో వేలాది జాంబీ కేసులు వెలుగు చూడటం అధికారులను ఆందోళన పరుస్తోంది. సమస్య తీవ్రత బయటికి కన్పిస్తున్న దానికంటే చాలా ఎక్కువగా ఉందని అధికారులే అంగీకరిస్తున్నారు. ఫిలడెల్ఫియాలోనే ఏకంగా 90 శాతానికి పైగా డోప్ టెస్టు శాంపిళ్లలో జైలజీన్ జాడలు కన్పించాయి. న్యూయార్క్ నగరంలో 25 శాతానికి పైగా శాంపిళ్లలో జైలజీన్ బయటపడింది.

> "జాంబీ డ్రగ్ తమకు మరింతగా లాభాల పంట పండించగలదని ఫిలడెల్ఫియా డ్రగ్ డీలర్లు తొలుత కనిపెట్టారు. ఇప్పుడిది అమెరికాను దాటి కెనడా దాకా విస్తరించింది"
> – నబురన్ దాస్‌గుప్తా, ఎపిడెమాలజిస్ట్, సీనియర్ సైంటిస్ట్, నార్త్ కరోలినా వర్సిటీ

సులువుగా దొరికేస్తోంది


జైలజీన్ అమెరికాలో అతి సులువుగా దొరుకుతోంది. కేవలం పశువుల డాక్టర్ చీటీ చాలు. పైగా కారుచౌక కూడా. దీంతోపాటు దీని సరఫరాపై పెద్దగా నియంత్రణ కూడా లేదు. ఇది డ్రగ్ మాఫియాకు మరింతగా కలిసొచ్చింది. కరోనా సమయంలో ఫెంటానిల్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఆ క్రమంలోనే ట్రాంక్ వాడకం పెచ్చరిల్లింది! మితిమీరిన డ్రగ్స్ వాడకం వల్ల మరణిస్తున్న వారి సంఖ్య అమెరికాలో బాగా పెరుగుతోంది. 2021లో లక్ష మందికి పైగా డ్రగ్స్‌కు బలయ్యారు! వీటిలో 70 వేలకు పైగా కేసుల్లో ఫెంటానిల్ వాడినట్టు తేలింది. వాటిలో చాలావరకు ట్రాంక్ కేసులేనని అనుమానిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

చికిత్స లేదు

ఫిలడెల్ఫియా తదితర చోట్ల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులు, క్లినిక్‌లకు జాంబీ డ్రగ్ బాధితులు బారులు తీరుతున్నారు. చాలామందికి కాళ్లు, చేతులు తీసేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న వారికంటే రకరకాల కారణాలతో ముఖం చాటేస్తున్న వారే చాలా ఎక్కువగా ఉంటారని వారంటున్నారు. అయితే జైలజీన్ ఓవర్ డోస్ తాలూకు దుష్ప్రభావాలను తగ్గించేందుకు చికిత్స ఏదీ ఇప్పటిదాకా అందుబాటులో లేకపోవడం మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఫెంటానిల్‌తో పాటు ఇతర డ్రగ్స్ తాలూకు లక్షణాలను నెమ్మదింపజేయడానికి వాడే నాలోగ్జోన్ వంటివాటినే ప్రస్తుతానికి వీరికీ వాడుతున్నారు. కాకపోతే జైలజీన్ వాడకంతో తలెత్తున్న శ్వాస, బీపీ సమస్యలకు ఇది పని చేయడం లేదు. జైలజీన్ వాడకం తాలూకు సైడ్ఎఫెక్టుల గురించి హెచ్చరిస్తూ అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) గత నవంబర్లోనే చాలా రాష్ట్రాల్లోని ఆస్పత్రులు, క్లినిక్‌లకు అలర్ట్ పంపింది. చూడటానికి ఇతర డ్రగ్ ఓవర్ డోస్ కేసుల్లాగే కన్పించడం వల్ల దీన్ని ఆరంభ దశలోనే కనిపెట్టడం కూడా కష్టమే.

అమెరికాలో డ్రగ్ ఓవర్ డోస్ మరణాలు




ఫెంటానిల్ మరణాలు



జైలజీన్ కథా కమామిషు

- గుర్రాలు, ఆవులు, గొర్రెలపై వాడేందుకు దీన్ని 1962లో తయారు చేశారు.
- అప్పట్లోనే మనుషులపైనా ప్రయోగాలు చేసినా శ్వాస, హృదయ స్పందన, బీపీ తగ్గిపోవడంతో నిలిపేశారు.
- 2000 నుంచీ డ్రగ్ బానిసలు దీన్ని హెరాయిన్‌తో కలిపి తీసుకోవడం మొదలైంది.



- కొకైన్, ఓపియం వంటివాటితో కలిపినా ఇది ప్రాణాంతకమే. కానీ ఫెంటానిల్ చౌక కావడంతో ఎక్కువగా దాన్నే వాడుతున్నారు.
- ఇలా ట్రాంక్‌గా పిలిచే జైలజీన్-ఫెంటానిల్ మిశ్రమ డ్రగ్ వాడకం 2011లో ప్యూర్టోరికోలో మొదలైంది.
- ప్యూర్టోరికో వాసులు ఎక్కువగా ఉండే ఫిలడెల్ఫియాలోని కెన్సింగ్టన్ తదితర చోట్లకూ పాకింది.
- కారుచౌకగా దొరుకుతుండటంతో కరోనా వేళ దీని వాడకం విచ్చలవిడిగా పెరిగింది.
- ఇప్పుడు అమెరికాలో కనీసం 30కి పైగా రాష్ట్రాల్లో విస్తరించి వణుకు పుట్టిస్తోంది.
- జైలజీన్ కారుచౌక. పైగా కేవలం పశువుల డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటే ఎంత పరిమాణంలో అయినా దొరుకుతుంది.
- ఇంజక్షన్‌తో పాటు పొడి రూపంలో కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటంతో డ్రగ్ డీలర్ల పని మరింత తేలికైంది.
- హెరాయిన్ డోసు కనీసం 10 డాలర్లు పెట్టనిదే దొరకదు. కానీ ట్రాంక్ మాత్రం మూడు నాలుగు డాలర్లకే దొరికేస్తోంది.
- ఇల్లూ వాకిలీ లేక రోడ్లపై కాలం గడుపుతూ ఏళ్ల తరబడి డ్రగ్స్‌కు బానిసలైన అమెరికన్లంతా ట్రాంక్ బాట పడుతున్నారు.

నా ఇన్నింగ్స్ ముగిసింది!

- కాంగ్రెస్ ప్లీనరీలో సోనియా వ్యాఖ్యలు
- రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం
- అధ్యక్షురాలిగా మాత్రమేనన్న పార్టీ



నవ రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): 'పార్టీలో నా ఇన్నింగ్స్ పూర్తి అయిందని భావిస్తున్నా' అంటూ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి! శనివారం కాంగ్రెస్ ప్లీనరీ రెండో రోజు సమావేశాలు ఇందుకు వేదికయ్యాయి. పాతికేళ్ల క్రితం సోనియా అధ్యక్షురాలయ్యాక ఆమె సారథ్యంలో పార్టీ సాధించిన విజయాలు, స్మరణీయ ఘటనలపై వీడియోను ప్రదర్శించారు. అది చూశాక సోనియా ఉద్వేగంతో మాట్లాడారు. ''1998లో తొలిసారిగా పార్టీ అధ్యక్షురాలినవడాన్ని గౌరవంగా భావిస్తా. ఈ పాతికేళ్లలో పార్టీ ఎన్నో శిఖరాలను అధిరోహించింది. సవాళ్లు ఎదుర్కొంది. 2004, 2009 ఎన్నికల విజయాలు, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో పాలన నాకెంతో సంతోషం కలిగించాయి. రాహుల్ సారథ్యంలో సాగిన భారత్ జోడో యాత్ర నాకెంతో సంతృప్తిని ఇచ్చింది. పార్టీ కీలక మలుపులో జరిగిన ఆ యాత్ర నా ఇన్నింగ్స్‌కు సంపూర్ణ సంతృప్తినిచ్చింది. ఈ యాత్ర ఘన విజయం ద్వారా పార్టీలో నా ఇన్నింగ్స్ ముగిసిందని భావిస్తున్నా. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో నవతరానికి ఖర్గే తన అపార అనుభవంతో మార్గదర్శకం చేస్తారు'' అని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు పార్టీతో పాటు జాతీయ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయంగా మారాయి. సోనియా వ్యాఖ్యలకు ఎవరికి వారు భాష్యం చెప్పుకున్నారు. ఆమె క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారనీ కొందరన్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లోనూ చర్చనీయంగా మారడంతో కాంగ్రెస్ నాయకురాలు కుమారి సెల్జా దీనిపై స్పష్టతనిచ్చారు. 'పార్టీ అధ్యక్షురాలిగా తన ఇన్నింగ్స్ ముగిసిందన్నది మాత్రమే సోనియా వ్యాఖ్యల ఉద్దేశం'' అని వివరణ ఇచ్చారు.

బీజేపీపై సోనియా నిప్పులు

దేశంలో మైనారిటీలపై కక్షగట్టిన బీజేపీ.. విస్తృతస్థాయిలో విద్వేషాగ్నిని ఎగదోస్తోందని సోనియా ఆరోపించారు. ''మోదీ సర్కార్ కేవలం ఒక్క కుబేరుడికి లబ్ధి చేకూర్చే విధానాలు అవలంబిస్తూ దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టతను దెబ్బ తీస్తోంది. మైనారిటీలు, మహిళలు, దళితులు, గిరిజనులను లక్ష్యం చేసుకుని దేశంలో విద్వేష వాతావరణాన్ని బీజేపీ సృష్టించింది. ఈ తరుణంలో కాంగ్రెస్ కార్యకర్తలు కార్యసాధకులై ముందుకు కదలాలి. పార్టీ విస్పష్టమైన సందేశాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడిదాకా తీసుకెళ్లాలి. రాజ్యాంగ విలువల తీవ్ర ఉల్లంఘనకు బీజేపీ సర్కార్ తెగించింది. ఖర్గే నాయకత్వంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల పోరులో బీజేపీని ఓడించే లక్ష్యాన్ని పార్టీ కార్యకర్తలు సాధించి చూపాలి'' అని పిలుపునిచ్చారు.

పొత్తుకు సై

- బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం
- భావసారూప్య పార్టీలతో పొత్తులు
- త్యాగాలకూ సిద్ధం: ఖర్గే
- ప్లీనరీలో శ్రేణులనుద్దేశించి ప్రసంగం



ప్లీనరీ వేదికపై సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరులు

నవ రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భావసారూప్య పార్టీలతో చేయిచేయి కలిపేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. లక్ష్య సాధన కోసం త్యాగాలు చేసేందుకు వెనుకాడబోమని ఉద్ఘాటించారు. రాయ్‌పూర్‌లో పార్టీ ప్లీనరీలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. 'ఢిల్లీ ప్రధానసేవకుడైన ఆయన ముఖచిత్రంతో రోజూ పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు వస్తూనే ఉన్నాయి. ఆయన మాత్రం తన సొంత స్నేహితుడి కోసం 'సేవలందిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'పేదల వ్యతిరేక వైఖరి బీజేపీ డీఎన్ఏలోనే ఉంది. ప్రజాస్వామ్యం ఖూనీకాకుండా ఆపేందుకు ప్రజాఉద్యమం వెల్లువలా రావాల్సిన అవసరమొచ్చింది. భారత్ జోడో యాత్ర.. ప్రజాసమస్యలకు గొంతుకగా మారింది. బీజేపీ హయాంలో రాజ్యాంగ విలువలు, సామాజిక సామరస్యం దెబ్బతిన్నాయి. చైనాతో సరిహద్దు వివాదం, పెచ్చరిల్లుతున్న విద్వేషం, పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఆర్థిక అసమానతలు దేశానికి పెను సవాళ్లు విసురుతున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ నేతృత్వంలోని భావసారూప్య పార్టీలే కొత్త ప్రభుత్వపాలన ద్వారా ప్రజాసంక్షేమాన్ని సాధ్యంచేయగలవు. అందుకోసం ఎలాంటి త్యాగాలు చేసేందుకైనా సదా సిద్ధం' అని వ్యాఖ్యానించారు. 'పార్లమెంటరీ, రాజ్యాంగ సంప్రదాయాలను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు ఈడీ, సీబీఐలను బీజేపీ రంగంలోకి దింపింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్లీనరీ సమావేశాలకు ఇబ్బందికలిగేలా ఇక్కడి నేతలపై ఈడీ దాడులకు తెగబడింది. అయినా నేతలు తెగవతో ఎదుర్కొని సమావేశాలు సజావుగా సాగేలా చేశారు' అని అన్నారు.

రైతుకు రూ.27.. వారికి రూ.1,000 కోట్లు

కుబేరుడు గౌతమ్ అదానీని ఉద్దేశిస్తూ.. 'దేశం ఎటు పోతోంది? ఓవైపు రైతుకు రోజుకు కేవలం రూ.27 ఆదాయం దక్కుతుంటే ప్రధాని స్నేహితుడు రోజుకు రూ.1,000 కోట్ల ఆదాయం ఎలా రాబట్టగలుగుతున్నారు? కోవిడ్ కాలంలో ప్రధాని స్నేహితుల సంపద 1,300 శాతం ఎగసింది. రైల్, భెయిల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్), సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా).. ఇలా ప్రతీదీ వారికే ధారాదత్తం చేస్తున్నారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ అయినా ఉంచుతారో లేక వీరికే అమ్మేస్తారోనని ప్రజల్లో ఆలోచనలు పెరిగాయి. ధరాఘాతంతో దేశ ప్రజల ఇంటి బడ్జెట్ తలకిందులవుతుంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలు అపరకుబేరుల అవతారం ఎత్తుతున్నారు. అధికార బుల్డోజర్ కింద పేదలు నలిగిపోతున్నారు. ఓవైపు చైనా భారత భూభాగంలోకి చొరబడుతుంటే విదేశాంగ మంత్రి జైశంకర్ తన తండ్రికి అప్పట్లో ప్రమోషన్ దక్కలేదని వాపోతారు' అని ఖర్గే అన్నారు.

ఇవే మా లక్ష్యాలు

'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో కోట్లాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నిత్యావసర సరకుల ధరలు దించుతాం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గిస్తాం. రైతుల ఉత్పత్తులకు సరైన ధర కల్పిస్తాం. విద్వేష వాతావరణాన్ని చెదరగొట్టి సామరస్యాన్ని సాధించి చూపుతాం. ధన బలం, అధికార బలం లేకుండా చూస్తాం. దేశ పురోభివృద్ధిలో ప్రజలతో కలిసి నడుస్తాం. ముందుండి నడిపిస్తాం' అన్నారు.

సీడబ్ల్యూసీలో 50 శాతం వారికే

వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు, మహిళలు, యువత, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ తన పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసింది. సవరణ ప్రకారం పార్టీ నుంచి ప్రధానులైన నేతలు, మాజీ ఏఐసీసీ చీఫ్‌లకు సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఉంటుంది. సీడబ్ల్యూసీ సభ్యుల సంఖ్యను 25 నుంచి 35కు పెంచారు. ఇకపై పార్టీలో కేవలం డిజిటల్ మెంబర్‌షిప్, రికార్డులను కొనసాగిస్తారు.

మూడో ఫ్రంట్‌తో ఎన్డీయేకే మేలు

మూడో ఫ్రంట్ అనే మాటే వినపడకుంటే భావసారూప్యత ఉన్న అన్ని పార్టీలను 'గుర్తించి', 'సమీకరించి', 'ఏకంచేసే' బృహత్తర పనికి వెంటనే పూనుకోవాలనే రాజకీయ తీర్మానం ముసాయిదాలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు లౌకిక, సామ్యవాద శక్తుల ఏకీకరణే అసలైన హాల్‌మార్క్‌గా నిలుస్తుంది. ఎన్డీయేకు వ్యతిరేకంగా విపక్షాలను ఐక్యం చేయాల్సిన అత్యవసరస్థితి ఇది. ఆలస్యం చేస్తే అది ఎన్డీయేకే మేలు చేస్తుంది' అని ముసాయిదాలో నేతలు ఆందోళన వ్యక్తంచేశారు.

'ప్రధాని ఆశతోనే కాంగ్రెస్, ఆర్జేడీతో దోస్తీ

బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై అమిత్ షా ధ్వజం

లారియా(బిహార్): బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌పై బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపణల వర్షం కురిపించారు. బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలోని లారియాలో శనివారం ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. 'మూడేళ్లకోసారి నితీశ్‌కు ప్రధాని పీఠంపై ప్రేమ పుట్టుకొస్తుంది. అందుకే హఠాత్తుగా బీజేపీతో పొత్తును తెగతెంపులు చేసుకుని కాంగ్రెస్, ఆర్జేడీతో జట్టుకట్టారు. ఆయన పచ్చి అవకాశవాది' అంటూ నిప్పులు చెరిగారు.'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ కంటే బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించినా ఇచ్చిన మాట కోసం నితీశ్‌నే మోదీ ముఖ్యమంత్రి చేశారు. ఇకపై నితీశ్‌తో ఇక జట్టుకట్టేదిలేదు' అని తేల్చిచెప్పారు.

బెంగాల్‌లో కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

దిన్హాటా: పశ్చిమబెంగాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ కాన్వాయ్‌పై తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులుగా భావిస్తున్న వారు దాడికి పాల్పడ్డారు. కూచ్‌బెహార్ జిల్లా దిన్హాటా ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. 'పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుండగా టీఎంసీ కార్యకర్తలు నా కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేశారు. బాంబులు విసిరారు. కాల్పులు కూడా జరిపారు. దాడిలో పలువురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు చూస్తుండగా ఇవన్నీ జరిగాయి'అని మంత్రి ఆరోపించారు. ఈ సందర్భంగా టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టి, పరిస్థితిని సద్దుమణిగించారు.

ఎదురుకాల్పుల్లో నేలకొరిగిన ముగ్గురు జవాన్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ అటవీప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు డీఆర్జీ జవాన్లు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్జీ బలగాలు జేగురుగొండ నుంచి దండకారణ్య అటవీ ప్రాంతంలో రోజువారీ గాలింపుల్లో ఉండగా కందేడ్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ముగ్గురు జవాన్లు మృతి చెందగా గాయపడిన వారిని వెంటనే క్యాంప్‌కు తరలించి వైద్యమందించారు. రెండు ఏకే 47 తుపాకులు, 51 ఎంఎం మోర్టార్‌ను మావోయిస్టులు అపహరించారు. కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయి ఉంటారని పోలీసులంటున్నారు. వారి కోసం భారీగా కూంబింగ్ చేపట్టినట్టు బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ చెప్పారు.

ఆర్మీ జవాన్‌ను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శనివారం ఓ ఆర్మీ జవాన్‌ను మావోయిస్టులు హతమార్చారు. జిల్లాలోని బడెతెవాడకు చెందిన జవాన్ మోతీరామ్ సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సమీపంలోని ఉసేలీ వారపు సంతలో కోడి పందేలు చూస్తుండగా ముగ్గురు మావోయిస్టులు మూడు రౌండ్ల కాల్పులు జరపడంతో మోతీరాం అక్కడికక్కడే మృతిచెందారు.

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా పౌద్యాల్!

ఎనిమిది పార్టీల మద్దతు • ప్రమాదంలో ప్రచండ సర్కారు!

కాఠ్‌మాండూ: నేపాల్ నూతన అధ్యక్షుడిగా నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్ ఎన్నికయ్యే అవకాశముంది. దేశాధ్యక్ష ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన అభ్యర్థిత్వానికి ఎనిమిది రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని సీపీఎన్(యూఎంఎల్), పుష్పకమల్ దహాల్(ప్రచండ) నేతృత్వంలోని సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్), మరో ఐదు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన సంగతి తెల్సిందే. అయితే కూటమి పార్టీ అయిన సీపీఎన్(యూఎంఎల్) బలపరిచిన అభ్యర్థి సుభాష్ నెబాంగ్‌కి కాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధానమంత్రి ప్రచండ మద్దతు పలకడంతో రెండునెలల క్రితమే కొలువుదీరిన ప్రభుత్వం కూలే పరిస్థితులు నెలకొన్నాయి. నేపాల్ పార్లమెంట్‌లో పార్టీల ప్రస్తుత బలాబలాల ప్రకారం ఈ ఎనిమిది పార్టీలు బలపరిచే అభ్యర్థే వచ్చే నెలలో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో గెలుస్తారు. ప్రచండ నిర్ణయంతో ఆగ్రహించిన అధికార కూటమిలోని నేషనల్ డెమొక్రటిక్ పార్టీ తాము ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లింగ్డెన్ ఉప ప్రధానిగా రాజీనామా చేశారు. కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో ప్రచండ విశ్వాస పరీక్షలో నెగ్గాలి.

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం

- ఉక్రెయిన్ సంక్షోభంపై మోదీ
- జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌తో భేటీ



రాష్ట్రపతి ముర్ముతో షోల్జ్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే చెబుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి శాంతి ప్రక్రియలోనైనా భాగస్వామిగా మారేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీలో శనివారం జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో చర్చలు జరిపారు. ఏడాదిగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం పర్యవసానాలు ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత వంటి పలు అంశాలతో వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, వాతావరణ మార్పు వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో షోల్జ్..'ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తీవ్ర విపత్తు, ఇది ప్రపంచంపై విపరీత దుష్ప్రభావాలను కలుగజేసింది. ఈ అంశంపై ఐక్యరాజ్య సమితి సహా అన్ని వేదికలపై మనం వేసే అడుగులపై స్పష్టత అవసరం'అని పేర్కొన్నారు. హింసామార్గం ద్వారా సరిహద్దులను ఎవరూ మార్చ జాలరని షోల్జ్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీఏ), పెట్టుబడుల రక్షణ ఒప్పందాలను సాధ్యమైనంత తొందరగా ఖరారు చేయాలనుకుంటున్నట్లు షోల్జ్ చెప్పారు.

భారత్ వైఖరి మొదట్నుంచీ అదే

'ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మొదట్నుంచీ కోరుతోంది. ఇందుకు సంబంధించి జరిగే శాంతి ప్రక్రియలో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉంది'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలోనూ ఇదే విషయం కుండబద్దలు కొట్టిందన్నారు. 'భారత్, జర్మనీల మధ్య రక్షణ, భద్రత సహకారం వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా మారనుంది. ఈ రంగాల్లో మరిన్ని అవకాశాలను అన్వేషించాలి. ఉగ్రవాదం, వేర్పాటు వాదంపై పోరులో భారత్, జర్మనీల మధ్య మంచి సహకారం కొనసాగుతోందని మోదీ అన్నారు. భారత్‌లో రెండు రోజుల పర్యటనకు గాను షోల్జ్ శనివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

అమెరికాను వదలని మంచు తుపాను



కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆల్పైన్ మిడోస్ ప్రాంతంలో కొండలా పేరుకుపోయిన మంచు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలు మంచు తుపాను తాకిడికి విలవిల్లాడుతున్నాయి. దాదాపు 10 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు మూతబడ్డాయి. ఒక్క శుక్రవారమే 300పైగా విమాన సర్వీసులు రద్దవగా, మరో 5 వేల సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. కాలిఫోర్నియా, మిషిగన్ రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. సియోర్రా నెవడా, దక్షిణ కాలిఫోర్నియా పర్వత శ్రేణుల్లో 1.5 మీటర్ల మేర మంచు కురియవచ్చని, ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ తీరంలోని కీలకమైన నార్త్–సౌత్ హైవేను కలిపే ఇంటర్ స్టేట్ –5ను మూసివేశారు. మిషిగన్‌లో మంచు కురియడంతో కరెంటు లైన్లు తెగిపోయాయి. ఒక దశలో మిషిగన్‌లోని 8.20 లక్షల ఇళ్లకు కరెంటు సరఫరా బందయింది. గత 50 ఏళ్లలో ఇంత తీవ్రంగా ప్రభావం చూపిన మంచు తుపాను ఇదేనని డెట్రాయిట్ విద్యుత్ శాఖాధికారి ఒకరు చెప్పారు. .శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో భారీ స్థాయిలో మంచుకురియడం చాలా అరుదని శంకర్ క్రిష్ణన్ అనే స్థానికుడు చెప్పారు.



ధర్మపురిలో భక్తుల సందడి

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



యాగశాలకు శంకుస్థాపన

కరీంనగర్‌కల్చరల్: రామచంద్రపురికాలనీ దేవుళ్లపురి పంచముఖ హనుమదీశ్వరాలయ ఆవరణలో యాగశాలకు నమిలికొండ రమణాచార్యులు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

2,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ అర్బన్: జిల్లాలో ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి సారించేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో అయిల్‌పాం సాగుపై సమీక్షించారు. మార్చి లోగా జిల్లాలో 2,500ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగేలా చూడాలని సూచించారు. ప్లాంటేషన్ మెటీరియల్ జిల్లాలో అందుబాటులో లేనందున ఇతర జిల్లాల నుంచి తెప్పించి రైతులకు ఇవ్వాలన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీనేరంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలి



మాట్లాడుతున్న చంద్రమోహన్

కరీంనగర్‌క్రైం: ప్రతీనేర సంఘటనలో నిందితులు శిక్షింపబడేలా కోర్టుడ్యూటీ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్ అన్నారు. శనివారం కమిషనరేట్‌కేంద్రంలో కోర్టుడ్యూటీ అధికారుల(సీడీవో)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రతీకేసులోని దశలను సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ కావాల్సిన చర్యలు తీసుకోవడం ద్వారా నిందితులు శిక్షింపబడుతారని తెలిపారు. సీడీవోలు కేసులు ఏయే దశల్లో ఉన్నాయో ఏరోజుకారోజు సీసీటీఎన్ఎస్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. సమర్థవంతంగా పనిచేసే సీడీవోలకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. ఏసీపీ పి.కాశయ్య, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటనర్సయ్య పాల్గొన్నారు.


ఎస్సారార్‌లో ప్రకృతి పరిరక్షణ సదస్సు



ఎన్‌సీసీ కెడెట్లతో ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ

శాతవాహనయూనివర్సిటీ: కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో ప్రకృతి పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పర్యావరణానికి హితంచేసే విధంగా అందరం ఎకోమిత్ర విధానాలు అవలంబించాలని కోరారు. పర్యావరణ చట్టాలు పరిరక్షణ విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్క నాటారు. ఎన్‌సీసీ ఎన్‌వో లెఫ్టినెంట్ పి.రాజు, డాక్టర్ జి.కిషోర్‌కుమార్, కేడెట్లు నగేశ్, సుష్మిత, రాకేశ్ పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన కరీంనగర్ జోన్ ఈడీ



బస్‌స్టేషన్‌ను తనిఖీచేస్తున్న వెంకటేశ్వర్లు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ బస్‌స్టేషన్‌ను శనివారం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణీకుల రద్దీని బట్టి బస్సు సర్వీసులను ఏర్పాటు చేసి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచనలిచ్చారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంట కరీంనగర్– 2డిపో మేనేజర్ మల్లయ్య, కరీంనగర్ జోన్ డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం. చంద్రయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు బి. సత్తయ్య, గోపాల్‌రెడ్డి, ఏజే.రెడ్డి, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య ఉన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- త్వరలో పందులు, కోతుల తరలింపు
- ప్రభుత్వ సూచన మేరకు కుక్కల నియంత్రణ
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్



'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ వేణుమాధవ్

కొత్తపల్లి(కరీంనగర్):కొత్తపల్లి పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఏఈ ఆసిఫ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రమేశ్‌తో కలిసి శనివారం నిర్వహించిన 'సాక్షి ఫోన్ ఇన్' కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పట్టణానికి చెందిన 22 మంది పలు సమస్యలపై ఫోన్ చేయగా, మున్సిపల్ కమిషనర్ సమాధానాలిచ్చారు. ప్రస్తుతం పట్టణంలో మంచినీటి సమస్య లేకున్నా వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీలు, రోడ్లు నిర్మాణాలపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. పందులను తరలిస్తున్నామని, కోతులను తరలించేందుకు కౌన్సిల్‌లో చర్చించి ఏజెన్సీ ఏర్పాటు చేస్తామని, కుక్కల బారినుంచి రక్షించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రశ్న: కుక్కలు, పందులు, కోతులను నియంత్రించండి.
– వాసాల రమేశ్, స్వర్గం శ్రీనివాస్, రాజేశం, మ్యాకల పోచమల్లు, కేశ అరవింద్, ఎండీ ఖాజాఖాన్, పెంటి శ్రీనివాస్, మారుతి, మేరుగు మల్లేశం
కమిషనర్: ఇప్పటివరకు 800 పందులు తరలించాం. యుద్ధప్రాతిపదికన మిగిలినవాటిని తరలిస్తాం. కుక్కల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎనిమల్ కేర్ సెంటర్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం కుక్కలను పంపిస్తాం. కోతులను తరలించేందుకు కౌన్సిల్ తీర్మానం మేరకు ఏజెన్సీ ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: 20 రోజులుగా చెత్త సేకరణ చేపట్టడం లేదు
– బి.నరేష్, వి.రామకృష్ణ
కమిషనర్: చిన్న గల్లీలుండటం వల్ల ఆటోలకు ఇబ్బంది ఏర్పడింది. రిక్షాలు పంపించి చెత్త సేకరిస్తాం.

ప్రశ్న: ఫోన్‌ఇన్ నిర్వహించిన 'సాక్షి'కి కృతజ్ఞతలు. సెట్‌బ్యాక్ లేని నిర్మాణాలు, ర్యాంప్‌లపై చర్యలు చేపట్టండి.
– శశిధర్‌రెడ్డి
కమిషనర్: సెట్‌బ్యాక్‌లేని నిర్మాణాలు, ర్యాంప్‌లపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న: చెట్ల కొమ్మల వల్ల ప్రధాన రహదారిపై, బస్టాండ్‌లో నెలరోజులుగా వీధిదీపాలు వెలగడం లేదు.
– బూర్ల వాసు
కమిషనర్: చెట్ల కొమ్మలను తొలగించి ప్రధాన రహదారిపై వెలుతురు పడేలా తక్షణ చర్యలు తీసుకుంటాం. బస్టాండ్‌లో ఈసీఎల్ సిబ్బందిచే ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: ప్రధాన రహదారి వెంట ప్రమాదకరమైన చెట్లను తొలగించండి
– ఎం.హరీశ్
కమిషనర్: ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్లను విద్యుత్ అధికారుల సమన్వయంతో తొలగిస్తాం.

ప్రశ్న: ప్రధాన రహదారి నుంచి అన్నమయ్య కాలనీకి రోడ్ వేయండి.
– డోలి రమేశ్
కమిషనర్: మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి సభ్యుల సూచనల మేరకు బడ్జెట్ వెసులుబాటును బట్టి నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న: చెత్తబండి వస్తున్నట్లు సంకేతంగా మైక్ వాడటం లేదు.
– గుంటి రాజమల్లు
కమిషనర్: మైక్‌ను ఉపయోగిస్తూ చెత్త సేకరణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించా.



ప్రశ్న: చనిపోయిన పందులను వాగులో వేస్తున్నారు.
– మారుతి
కమిషనర్: పందులను వాగులో వేసిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఒడ్డెర కాలనీ సమస్యలు పరిష్కరించండి.
– ఓర్సు శ్రీనివాస్
కమిషనర్: ఒడ్డెరకాలనీలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, మంచినీటి వంటి మౌలిక వసుతుల కల్పనకు డీపీఆర్ రూపొందించి కౌన్సిల్‌కు అందజేస్తాం.

ప్రశ్న: చికెన్ వ్యర్థాలు రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోండి.
– ఎండీ ఖాజాఖాన్
కమిషనర్: చికెన్ సెంటర్ల యజమానులకు నోటీసులు జారీ చేశాం. వారంతా మున్సి పల్ బండిలోనే వ్యర్థాలు వేస్తున్నారు.

ప్రశ్న: అంబేద్కర్‌నగర్ నుంచి రామాలయం వరకు ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ నిర్మించండి. ఆర్‌ఓ ప్లాంట్‌ను పునరుద్ధరించండి. – జేరిపోతుల శ్రీకాంత్
కమిషనర్: మున్సిపల్‌లో నిధుల వెసులుబాటును బట్టి డ్రైనేజీ నిర్మిస్తాం. అంబేద్కర్‌నగర్‌లోని ఆర్‌ఓ ప్లాంటు మరమ్మతుకు కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న: ప్రధాన రహదారిపై డివైడర్లు నిర్మించి ప్రమాదాలు అరికట్టండి.
– కేశ అరవింద్
కమిషనర్: రోడ్లు, భవనాలు శాఖ అధికారులతో చర్చించి డివైడర్లు నిర్మించేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీకి ప్రహరీ నిర్మించండి.
– గాలిపల్లి నరేశ్
కమిషనర్: ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది
– శంకర్, బోగ రాజేశం, పోచమల్లు
కమిషనర్: డ్రైనేజీ చిన్నదిగా ఉండటం వల్ల శుభ్రం చేయడం కష్టంగా మారింది. అయినా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించా.

ప్రశ్న: గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మత్తులు చేపట్టండి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి.
– వాసాల రమేశ్
కమిషనర్: గుంతల రోడ్లను గుర్తించాం. కౌన్సిల్ తీర్మానం మేరకు మరమ్మతు చేపడతాం. అక్రమ నిర్మాణాలను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం . వేసవిలో నీట ఎద్దడి లేకుండా చర్యలు చేపడతాం.

పర్యాటక రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- పల్లె ప్రగతి పనులు నిరంతర ప్రక్రియ
- ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. శనివారం పర్యాటకశాఖ ఎండీ మనోహర్‌తో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. రూ.410 కోట్లతో ఇరిగేషన్, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో లోయర్ మానేరు రివర్ ఫ్రంట్‌పై చేపట్టిన ఫుట్‌పాత్, బోటింగ్ ఘాట్ల ఏర్పాట్లు, బతుకమ్మ ఘాటు, బోట్ క్రుజెస్ తదితర పనులు పరిశీలించారు. ఫ్రాన్స్ తరహాలో రెండు ఆధునీకరించిన బోట్ క్రూజెస్ తెప్పించడానికి వెంటనే ఆర్డర్ జారీ చేయాలని ఆదేశించారు. 2021–22లో తెలంగాణ ప్రభుత్వం మానేరు రివర్ ఫ్రంట్ ఎల్ఎండీ కోసం రూ.100 కోట్లు కేటాయించిందని, అందులో రూ.60 కోట్లు మ్యూజికల్ ఫౌంటేన్ ఏర్పాట్లకు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం పట్టణంలో రూ.15కోట్లతో నిర్మిస్తున్న హరితటూరిజం బడ్జెట్ హోటల్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పల్లెప్రగతి, ఉపాధిహామీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర గ్రామీణాభివృద్ధి పథకాలపై సమీక్షించారు. పల్లె ప్రగతితో 9,300 గ్రామపంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలు లభించాయని, వారి వేతనం కూడా ప్రభుత్వం రెట్టింపు చేసిందన్నారు. కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, లెనిన్, జెడ్పీ సీఈవో ప్రియాంక పాల్గొన్నారు.

నెలలో స్పోర్ట్స్ స్కూళ్లో వసతులు

క్రీడాపాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను నెలరోజుల్లో అందజేస్తానని ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. నగరంలోని క్రీడాపాఠశాలను సందర్శించి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. పట్టుదల, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు క్రీడల్లో అద్భుతమైన విజయాలను సాధించి దేశం గర్వించదగ్గ గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మెస్‌లో ఏర్పాటు చేసిన రెండు కూల్ వాటర్ ప్యూరిఫయర్లను ప్రారంభించారు. డీవైఎస్‌వో కీర్తి రాజవీరు, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎం లీలాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సేంద్రియ ఎరువు

మానకొండూర్: చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయడంలో తిమ్మాపూర్ పంచాయతీ ఆదర్శంగా ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. గ్రామ పంచాయతీ ద్వారా తయారు చేస్తున్న వర్మీ కంపోస్ట్‌ను పరిశీలించారు. ఇంటింటికీ రోజువారీగా సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చి'తిమ్మాపూర్ వర్మీ కంపోస్ట్' పేరుతో బ్యాగులు, వాడిన బాటిళ్ల విక్రయాన్ని అభినందించారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లలో ఇలా వర్మీ కంపోస్టు తయారు చేయించాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్‌కు సూచించారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్డీవో శ్రీలత, డిప్యూటీ సీఈవో పవన్ పాల్గొన్నారు.

బంజారాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- త్యాగాలకు ప్రతీక సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్



హోమంలో పాల్గొన్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: బంజారాలకు ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ అని, బంజారాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి కమలాకర్ అన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాల సందర్భంగా సప్తగిరికాలనీలోని సంత్ శ్రీ సేవాలాల్ మందిర స్థలంలో శనివారం నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ త్యాగాలకు ప్రతీక అని కొనియాడారు. సేవాలాల్ మందిరం నిర్మాణానికి సంబంధించిన రూ.30లక్షల ప్రొసీడింగ్స్‌ను అందించారు. ప్రస్తుతం ఇచ్చిన నిధులతో భవన నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన హోమంలో మంత్రి గంగులతో పాటు మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్ దిండిగాల మహేశ్, చింతకుంట ఎంపీటీసీ తిరుపతినాయక్, లక్‌పతి నాయక్, భాస్కర్‌నాయక్, డీటీ నాయక్ పాల్గొన్నారు.

నిరంతరంగా అభివృద్ధి పనులు

కరీంనగర్‌సిటీ: నగరంలో ప్రతీడివిజన్‌లో నిరంతరంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే ఉంటామని బీసీ సంక్షేమ, పౌరసరఫరాశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని 23వ డివిజన్ ఆదర్శనగర్, సుభాష్‌నగర్ ప్రాంతంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ అర్ష కిరణ్మయితో కలిసి పర్యటించారు. రూ.19 లక్షల నిధులతో సీసీరోడ్డు డ్రైనేజీ పనులు ప్రారంభించారు. సుభాష్‌నగర్ పోచమ్మఆలయంలో పూజలు చేశారు. రూ.10 లక్షల నిధులతో ఆలయ నిర్మాణం పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ సేవాఇస్లావత్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి పాల్గొన్నారు.

బీదర్ దొంగల పనే!

- కొండగట్టు ఆలయ చోరీ కేసులో పురోగతి
- 24 గంటల్లోనే నిందితులను గుర్తించిన పోలీసులు
- సెల్‌టవర్ డంప్ ఆధారంగా ముగ్గురి నంబర్లు గుర్తింపు
- చోరీ అనంతరం కర్ణాటక పారిపోయిన దొంగలు
- పట్టుకువచ్చేందుకు కర్ణాటక వెళ్లిన ప్రత్యేక బృందం
- పొరుగురాష్ట్రం దొంగలని ముందే వెల్లడించిన 'సాక్షి'



ఆలయంలో చోరీ చేసిన దొంగలు (సీసీఫుటేజీ)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా కొండగట్టు చోరీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఆలయంలో వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలను కర్ణాటకలోని బీదర్ జిల్లాకు చెందినవారిగా చోరీ జరిగిన ప్రాంతంలో లభించిన సీసీ ఫుటేజీ, సెల్‌టవర్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా గుర్తించారు. ఇటీవలే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా పర్యటించి ఆలయాభివృద్ధికి రూ.600 కోట్లు ప్రకటించిన నేపథ్యంలో చోరీ జరగడం సంచలనం రేపింది. రాష్ట్రమంతా కొండగట్టు పుణ్యక్షేత్రంపై చర్చిస్తున్న నేపథ్యంలో ప్రధానాలయంలో చోరీ జరగడంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని 24 గంటల్లోనే నిందితులను గుర్తించారు.

మధ్యాహ్నానికి కొలిక్కి వచ్చిన కేసు

సీఎం పర్యటించిన వారంరోజుల్లోనే ఆలయంలో చోరీ జరగడంపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి మధ్యాహ్నానికి కేసులో కీలక పురోగతి సాధించారు. ఆలయంలో దొంగతనం చేసింది కర్ణాటకకు చెందిన ముఠాగా గుర్తించారు. దొంగలు 24వతేదీ శుక్రవారం తెల్లవారుజామున 1.20 గంటల తరువాత భేతాళ గుడి పక్క నుంచి ప్రధానాలయం వెనక తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. లోనికి వచ్చే సమయంలో జనాల దృష్టి మరల్చేందుకు సెక్యూరిటీ దస్తులు, చేతిలో లాఠీ, ఒంటిపై కొత్త పసుపు శాలువా కప్పుకుని వచ్చారు. శాలువాలో చోరీ చేసేందుకు వీలైన పనిముట్లు తీసుకొచ్చారు. ఉదయం 1.20నిమిషాల నుంచి ఉదయం 4 గంటల మధ్యలో దొంగతనం జరిగింది. ఈ మధ్యకాలంలో కొండగట్టుపై యాక్టివ్‌గా ఫోన్ నంబర్ల డేటాను పోలీసులు సేకరించారు.

కర్ణాటకకు బయల్దేరిన పోలీసులు

అందులో కొన్ని నంబర్లు కర్ణాటకకు చెందినవి. అనుమానాస్పదంగా కనిపించిన ఈ నంబర్లకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరించేందుకు కొండగట్టుపై సెల్‌ఫోన్ సేవలు అందించే సెల్‌టవర్ల నుంచి డంప్ (కాల్స్ వివరాలు) మొత్తం జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన నంబర్లు కర్ణాటకకు చెంది ఉండటం, చోరీకి ముందు తరువాత అక్కడ నుంచి మాయమవడంతో పోలీసులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించారు. అనుమానాస్పద నంబర్ల చిరునామాలు, వీటి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను కూడా సంగ్రహించారు. ఆ నంబర్ల కాల్స్ కర్ణాటకకు చెందిన నంబర్లతో కనెక్ట్ అయి ఉన్నట్లు హిస్టరీ తేలడంతో మరింత లోతుగా అన్వేషించారు. దీంతో అవే నెంబర్లు మెట్‌పల్లి, కామారెడ్డిల మీదుగా బీదర్ వరకు ఆయా సెల్‌టవర్ల లోకేషన్లతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు కూడా కీలక ఆధారాలుగా మారాయని తెలిసింది. దీంతో నిందితులు బీదర్ జిల్లాకు చెందిన దొంగలుగా నిర్ధరణకు వచ్చారు. వెంటనే బీదర్ పోలీసులకు సమాచారం ఇచ్చి రెండు ప్రత్యేక బృందాలు కర్ణాటకకు బయల్దేరాయి.

దొంగలను పట్టుకున్న పోలీసులు..?

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పోలీసు బృందం కర్ణాటకకు వెళ్లింది. దొంగలు అక్కడికి వస్తారని అనుకున్న పోలీసులకు శుక్రవారం రాత్రి నిరాశే ఎదురైనట్లు సమాచారం. శనివారం సాయంత్రం ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వారిలో ఒకరు దొరికినట్లు సమాచారం. నిందితులను పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా.. ఈ విషయాన్ని పోలీసులు ఇంకా నిర్ధారించలేదు. ఆదివారం లేదా సోమవారం దొంగలను తెలంగాణకు తీసుకువచ్చి, ప్రెస్‌మీట్ నిర్వహించే అవకాశాలున్నాయని తెలిసింది. పోలీసులు విడుదల చేసిన సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దొంగలు మహారాష్ట్ర లేదా పొరుగు రాష్ట్రం వారి అయి ఉంటారని 'సాక్షి' ముందే వెల్లడించిన విషయం తెలిసిందే.

నైట్‌వాచ్‌మన్‌పై సస్పెన్షన్ వేటు

- ఇద్దరు ఆలయ ఉద్యోగులు, నలుగురు హోంగార్డులకు మెమోలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువ జామున చోరీ జరిగేందుకు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యమే కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈమేరకు నైట్‌వాచ్‌మన్ శంకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో వెంకటేశ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, హుండీ కీపర్ చంద్రమౌళి, హోంగార్డులు కొండ రమేశ్, కొడిమ్యాల రమేశ్, రాజేశ్, అంజయ్యకు మెమోలు జారీచేశారు. వీరు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, నిర్దేశిత సమయంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, విధుల్లో నిర్లక్ష్యం వహి ంచిన అధికారులను వదిలేసి చిరుద్యోగులపై వేటు వేయడం ఏమిటనే చర్చ సాగుతోంది.

27న ఉమ్మడి జిల్లా ఎన్జీవోల ఫోరం సమావేశం

విద్యానగర్(కరీంనగర్): అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎన్జీవోల ఫోరం సమావేశం ఈనెల 27న కరీంనగర్‌లోని జ్యోతినగర్, ఓల్డ్ డీఐజీ బిల్డింగ్ వద్ద ఉన్న ఆప్తమిత్ర సేవా సమితి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎన్జీవోల ఫోరం గౌరవ అధ్యక్షుడు జి.కొమురయ్య, అధ్యక్షుడు కె.వెంకటయ్య తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతో పాటు నూతన సభ్యత్వాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

జంగపల్లి పాఠశాలలో టాంజానియా బృందం



కంప్యూటర్ విద్యను పరిశీలిస్తున్న సభ్యుడు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను శనివారం టాంజానియ, నైజీరియా ఆధ్యాపక బృందం సందర్శించింది. ఈ పాఠశాలకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ముంబయి అందిస్తున్న కంప్యూటర్ విద్యా విధానాన్ని(సీఎల్ఐఎక్స్)ను పరిశీలించారు. విద్యాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులు నేర్చుకుంటున్న కంప్యూటర్, ల్యాబ్‌లను పరిశీలించారు. పాఠశాలలో అమలు చేస్తున్న ఈ క్లిక్స్ విధానాన్ని ఆ దేశాల్లోని పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. నైజీరియాలోని ఇబ్రహీం, బాదామసి, బబాంగిడా యూనివర్శిటీల ప్రొఫెసర్లు టాజర్ మస్తఫా, యాకీ ఆంగ్వాల్, పెలిక్సీ మలెంగికీ, రాంబేషా మెడార్ఫ్, క్లిక్స్ ఫ్యాకల్టీ జనత్ రహమాన్, ఇమ్మాకనమ్మ, స్టేట్ కోఆర్డినేటర్ కార్తీక్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, ప్రధానోపాధ్యాయురాలు సూర సుమలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైనిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ



చొప్పదండి : మండలంలోని రుక్మాపూర్ శివారు..సైనిక శిక్షణ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారు. ఈ ఏడాది యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేయగా కె. హరీశ్, ఈ కార్తీక్, టి. భరత్‌కుమార్, ఎన్ అభినయ్ ప్రవేశానికి ఎంపిక య్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ లచ్చయ్య అభినందించారు.

ఏఐసీసీ ప్లీనరీకి పొన్నం, కోమటిరెడ్డి హాజరు



కరీంనగర్‌టౌన్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో జరుగుతున్న 85వ ఏఐసీసీ ప్లీనరీలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. సోనియా, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్ర నాయకులు పాల్గొన్న ఈ ప్లీనరీలో ఏఐసీసీ, పీసీసీ సభ్యులు పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు.

డే కేర్ సెంటర్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్



సీనియర్ సిటిజన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

కరీంనగర్ కల్చరల్ : వృద్ధుల కోసం సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ భవన పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయనున్న డే కేర్ సెంటర్ ఏర్పాటు పనులను జడ్పీ సీఈవోతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందులో భాగంగా రీడింగ్ రూం, క్యారమ్స్, చెస్, పుస్తకాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతివారం ఫిజియోథెరపీతో పాటు మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రియాంక, డీడబ్ల్యూవో సబితా కుమారి, డిప్యూటీ సీఈవో పవన్, ఎక్స్ ఎమ్మెల్యే, రాష్ట్ర సీనియర్ సిటిజన్ సభ్యులు మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్ రావు, రెడ్ క్రాస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు మోసం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ విద్యుత్ ఉద్యోగుల నిరసన



కొత్తపల్లి (కరీంనగర్) : విద్యుత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు శనివారం నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. కరీంనగర్‌లోని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం, టీఎస్ ట్రాన్స్‌కో జోనల్ కార్యాలయాల ఆవరణలో అన్ని విభాగాల విద్యుత్ ఉద్యోగులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకపోతే నిరసనలు ఇలాగే కొనసాగుతాయన్నారు. వచ్చేనెల మొదటి వారంలో ధర్నాలు, 6వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలకు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇక్కడ జేఏసీ నాయకులు ఎన్.అంజయ్య, సీహెచ్ భాస్కర్, శ్రీనివాస్, సంపత్ కుమార్, స్వామి, రజనికాంత్, సత్యనారాయణ, సుధీర్ కుమార్, కిరణ్ కుమార్, వీరయ్య, యుగేందర్, రఘు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కుక్కదాడిలో తీవ్రగాయాలు



జమ్మికుంట: కుక్కదాడిలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో మారపల్లి భవాని అనే మహిళ తన ఇంటి ఎదుట పని చేసుకుంటుండగా శనివారం పిచ్చికుక్క దాడిచేసింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉచిత ఆన్‌లైన్ కోర్సుకు ట్యూరిటో సీఈవో శ్రీకారం



వీణవంక(హుజూరాబాద్): కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని నిరుపేద విద్యార్థుల కోసం ఉచితంగా ఆన్‌లైన్ కోర్సు అందించడానికి వీణవంక గ్రామానికి చెందిన ట్యూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. శనివారం అయన జన్మదినం సందర్భంగా వీణవంక నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. 4 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఐఐటీ, నిట్, జేఈఈ వంటి కోర్సులతో పాటు పోటీ పరీక్షల్లో రాణించడానికి 'ట్యూరిటో ఫ్లాగ్ షిప్ చాంపియన్‌షిప్' ద్వారా శిక్షణ ఇస్తారు. సుమారు రూ.20కోట్ల విలువ గల కోర్సులను ఉచితంగా అందించడానికి ముందుకువచ్చారు. ఈ కోర్సు ద్వారా నిపుణులైన టీచర్స్, లైవ్‌క్లాసులు, మాక్ టెస్టులు, ప్రతి రోజు స్టడీ మెటీరియల్స్, ప్రాక్టీస్ పేపర్స్‌తో పాటు విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆన్‌లైన్ ద్వారా నివృత్తి చేయడం జరుగుతుందని సీఈవో తెలిపారు. శనివారం ఆయన జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని నివాసంలో విద్యార్థులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. దాసారపు ప్రభాకర్, చిన్నాల ఐలయ్య, అమృత ప్రభాకర్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయంలో విచారణ

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో ఉద్యోగాలు పెట్టిస్తానని మోసం చేసిన విషయంపై శనివారం వరంగల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆడిట్)రవీంద్రనాథ్ విచారణ జరిపారు. హుజూరాబాద్ ట్రాన్స్‌కో కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి తోటి ఉద్యోగులను మెడికల్ అన్‌ఫిట్ చేయించి పిల్లలకు ఉద్యోగాలు పెట్టిస్తానని, పలువురి వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. ట్రాన్స్‌కోలో హెల్పర్ ఉద్యోగాలు పెట్టిస్తానని సుమారు 8మంది నుంచి ఒక్కొక్కరివద్ద రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు తీసుకున్నట్లు తెలిసింది. మూడేళ్ల గడిచిన వారికి ఉద్యోగాలు రాకపోవడంతో తమ డబ్బులు తిరిగిఇవ్వాలని సదరు ఉద్యోగి ఇంటి చుట్టూ తిరిగినా డబ్బులు ఇవ్వలేదు. దీంతో బాధితులు వరంగల్ సీఎండీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కోసం రవీంద్రనాథ్ డీఈ కార్యాలయానికి చేరుకుని విచారణ నిర్వహించారు. నివేదికను సీఎండీకి అందజేయనున్నట్లు వారు తెలిపారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- ప్రీతికి న్యాయం చేయాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం



మాట్లాడుతున్న నిషాని రామచంద్రం

కరీంనగర్‌కల్చరల్ : కాకతీయ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌తో ఆత్మహత్యాయత్నం చేసుకున్న మెడికల్ విద్యార్థిని ధరావత్ ప్రీతికి న్యాయం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌ను అరికట్టలేని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. మెదక్ జిల్లాలో ఖదీర్ ఖాన్ మృతికి కారణమైన పోలీసులపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతి ఆత్మహత్యా యత్నానికి కారణమైన విద్యార్థిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ప్రీతి, ఖదీర్ ఖాన్ కుటుంబాలకు చెరో కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అక్కి బాలకిషన్, జోన్ మహిళా కన్వీనర్ జన్ను స్వరూప, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు నరేశ్, కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు గాలి అనిల్ కుమార్, టౌన్ అధ్యక్షుడు అస్తపురం మధు, చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి మంద రవీందర్, కత్తుల హేమంత్, అసెంబ్లీ కన్వీనర్ అనురాధ తదితరులున్నారు.

వెల్ఫేర్ కమిటీ సభ్యులతో ఈడీ సమావేశం

- సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి
- కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కరీంనగర్: కరీంనగర్ జోన్ (కరీంనగర్, ఆదిలాబాద్, నిజామబాద్, వరంగల్, ఖమ్మం) పరిధిలో 38 డిపోలకు చెందిన ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో శనివారం కరీంనగర్ రీజియన్ సమావేశ మందిరంలో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వేంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలన్నారు. జోన్ పరిధిలోని 38 డిపోల్లో కేవలం 15 డిపోలకు మాత్రమే లాభాలు వస్తున్నాయని, అన్ని డిపోల్లోనూ ఆదాయం పెంచాలన్నారు. రోజూ దాదాపు రూ.14 కోట్ల ఆదాయం ఆర్జిస్తుండగా దానిని రూ.16 కోట్లకు పెంచితే సంస్థ నష్టాలను అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.చందర్ రావు, అధికారులు స్వప్నకుమారి, చంద్రయ్య, యుగేంధర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

కంటోన్మెంట్ భూమిని ప్రభుత్వానికి అప్పగించాలి

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినోద్‌కుమార్ లేఖ

కరీంనగర్: హైదరాబాద్ శివారు.. కరీంనగర్ ఉమ్మడి జిల్లా మార్గంలో ఉన్న కేంద్ర రక్షణ శాఖ కంటోన్మెంట్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన లేఖ రాశారు. కంటోన్మెంట్ భూమిని వెడల్పు చేసి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మిస్తుందని, తద్వారా హైదరాబాద్ శివారులో ట్రాఫిక్ సమస్యలు తొలగి ఉమ్మడి కరీంనగర్ – హైదరాబాద్ ప్రజలకు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లానుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు హకీంపేట – బొల్లారం – అల్వాల్ – తిరుమలగిరి – కార్ఖానా – జింఖానా గ్రౌండ్ మధ్యలో రోడ్డును వెడల్పు చేసి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. కంటోన్మెంట్ రక్షణ శాఖ భూమిని ప్రభుత్వానికి అప్పగించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు ప్రధాని మోదీ, కేంద్రరక్షణ శాఖకు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కరీంనగర్‌టౌన్ : నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందగా, వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయిందంటూ మృతురాలి బంధువులు ఆందోళన చేశారు. వివరాల్లోకెళ్తే.. సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన చిమ్మని ప్రవంతి (32) గాల్‌బ్లాడర్ సమస్యతో సర్జరీ కోసం ఈనెల 15న జిల్లా ఆసుపత్రి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేశారు. పరిస్థితి విషమించడంతో నగర సమీపంలోని వైద్య కళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందిందని మృతురాలి బంధువులు మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఇదే విషయమై ఆసుపత్రి వైద్యులను వివరణ కోరగా రోగి పరిస్థితిపై ఎప్పటికప్పుడు వారి కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ చికిత్స అందించామని వారు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



మానకొండూర్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వాగేశ్వరి కళాశాల సెక్రటరీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ వేడుకలను నిర్వహించారు. బీఫార్మసీ సెకండియర్ విద్యార్థులు ఫస్ట్ ఇయర్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం శ్రమించాలన్నారు. కళాశాలలోని అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి. డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకష్ణ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అభినందన సభను విజయవంతం చేయాలి



కరీంనగర్‌కల్చరల్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లోని ఆర్ట్స్, సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగే బీసీల ఆత్మీయ అభినందన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘం బలోపేతంతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీలను ఏకతాటిపైకి తీసుకువచ్చి బీసీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వరాల జ్యోతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన కిరణ్, ప్రచార కార్యదర్శి దుంపట మురళి, మహిళా సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిపెల్లి అరుణ , అధికార ప్రతినిధి సొల్ల రాణి తదితరులున్నారు.

ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

జమ్మికుంట: జమ్మికుంట మానేరు వాగు బ్రిడ్జి ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నవారిపై కరీంనగర్ జిల్లా విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. జేసీబీ, రెండు ఎక్స్‌లెటర్లు, లారీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇసుక లారీని హుజూరాబాద్ ఆర్డీవో అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఆ వాహనాలకు రూ.25వేల జరిమానా విధించామని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు.

ఆశ్రయమిస్తూ.. భరోసా కల్పిస్తూ

- బాధిత స్త్రీలకు ఆపన్నహస్తం అందిస్తున్న 'స్వధార్'
- వారిలో మనోధైర్యం, ఆత్మస్థైర్యం నింపుతూ..
- బతుకుపై ఆశలు పెంచుతూ.. చట్టపరంగా సహకారం
- స్వయం ఉపాధి మార్గాల్లో శిక్షణ





స్వధార్‌లో ఆశ్రయం పొందుతున్న బాధిత మహిళలు

విద్యానగర్: నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ఆధిక్యతను నిరూపించుకుంటున్నా.. స్త్రీ జీవితాన్ని భౌతికంగా, మానసికంగా అతలాకుతలం చేసే ఘటనలు అనేకం. వరకట్నం, అత్యాచారం, వేధింపులు తదితర కారణాలతో నిరాశ, నిస్పృహాలతో బతుకును భారంగా వెళ్లదీస్తున్న వారెందరో ఉన్నారు. ఆశ్రయం కోరి వచ్చిన అలాంటి వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపే ఆపన్న హస్తం అందిస్తుంది 'స్వధార్ గృహ్'(బాధిత స్త్రీల పునరావాస కేంద్రం).

స్వధార్ లక్ష్యం

వివిధ సామాజిక సమస్యలతో సతమతమవుతున్న వారికి అవసరం మేరకు 3 రోజుల నుంచి 3 ఏళ్ల వరకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తుంది. వారిలో మనోధైర్యం, ఆత్మస్థైర్యం, బతుకుపై ఆశలు కల్పిస్తూ, సమస్యలను స్వతహాగా ఎదుర్కొనేలా ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తూ చట్టపరంగా అవసరమైన సహకారం అందిస్తుంది. స్వయం ఉపాధి మార్గాల్లో శిక్షణతోపాటు ఆర్థిక పరమైన చేయూతనందిస్తూ మిగిలిన జీవితాన్ని అర్థవంతంగా మలుచుకునేలా తోడ్పాటు అందించడమే స్వధార్ గృహ్ లక్ష్యం.

సెంటర్ నిర్వహణ

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో సామాజిక సేవిక మూగ జయశ్రీ అధ్యక్షతన ఏర్పాటైంది. స్వధార్ కేంద్రం. ప్రకృతి పర్యావరణ, ప్రభుత్వేతర సంస్థల సేవలను గుర్తించిన కేంద్ర స్త్రీ శిశు సమగ్రాభివృద్ధి శాఖ ఆ సంస్థకు స్వధార్ గృహ నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. కరీంనగర్‌లోని బొమ్మకల్ రోడ్డులో కేంద్ర స్త్రీ, శిశు సమగ్రాభివృద్ధి శాఖ ద్వారా 2005 నవంబర్ 23న అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఎం. సత్యనారాయణరావు ప్రారంభించారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో స్వధార్ గృహం కొనసాగుతుంది.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

స్వధార్ కేంద్రంలో టైలరింగ్, బ్యూటీషియన్, కుట్లు అల్లికలు, జూట్ ప్రొడక్ట్స్‌లలో బాధిత మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

స్వధార్‌లో పునరావాసం పొందడానికి అర్హులు

- కుటుంబ సభ్యుల నిరాధరణకు గురైన వారు. కుటుంబ కలహాలతో విడిపోయి అనాథలైన వారు. అనాథలైన వితంతువులు.
- లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, వరకట్న వేధింపులకు గురైనవారు. వ్యభిచార వృత్తిని విడిచి సాధారణ జీవితాన్ని గడపాలనుకునేవారు.

బాధిత మహిళల వయో పరిమితి

15 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల వయసులోబడిన బాధిత మహిళలకు ఆశ్రయం కల్పిస్తుంది. బాధిత స్త్రీతోపాటు 5 సంవత్సరాలోపు ఉన్న ఆమె పిల్లలకూ ఆశ్రయం ఇస్తుంది. ప్రస్తుతం 30 మంది వరకు బాధితులు స్వదార్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

బాధిత మహిళలు, అనాథలకు ఆశ్రయం



సమాజంలో వివిధ రుగ్మతలతో సతమతమవుతున్న మహిళలు, అత్యాచార బాధితులు, వరకట్న వేధింపులు, కుటుంబ కలహాలతో బాధపడేవారికి స్వధారం కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తాం. వారికి స్వయం ఉపాధి అంశాల్లో శిక్షణ ఇప్పిస్తాం. న్యాయపరమైన సలహాలు, సహకారం అందేలా చూస్తాం. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందెలా చూస్తాం.

– మూగ జయశ్రీ, స్వధార్ చైర్‌పర్సన్

క్లుప్తంగా

పే స్కేల్ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి

కరీంనగర్‌రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని కోరుతూ శనివారం ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియాకు ఉపాధి హామీ జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరగా ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ ప్రతినిధులు శారద, శోభారాణి, రాధ రాణి తెలిపారు.

దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్స్, తదితరులు

విద్యానగర్: ట్రినిటి కళాశాలల వ్యవస్థాపక చైర్మన్, పెద్దపల్లి శాసన సభ్యులు దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కరీంనగర్‌లోని ట్రినిటి ప్రైమ్ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రినిటి కళాశాలల వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీన్ హత్య నిందితుడిని శిక్షించాలి

విద్యానగర్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ బీటెక్ ట్రిపుల్ ఈ ఫైనల్ ఇయర్ విద్యార్థి నునావత్ నవీన్‌ను హత్య చేసిన హరిహర కృష్ణను కఠినంగా శిక్షించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపి నవీన్ హత్య వెనక ఉన్న కారణాలు, నిందితులను గుర్తించాలన్నారు. మృతుడి హత్య వెనక ప్రియురాలి ప్రమేయం ఉంటే ఆమె పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి రిమాండ్ చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి అర్హతకు తగిన ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. విద్యార్థుల్లో క్రూరమైన ప్రవృత్తిని నియంత్రించేందుకు ప్రతీ విద్యాసంస్థలో సైకాలజిస్ట్‌తో కూడిన ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సెమినార్‌లు నిర్వహించాలని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలు, ఉద్యమ సంస్థలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులకు నష్టం జరగకుండా తూం నిర్మాణం



రైతులతో చర్చిస్తున్న అధికారులు, ఏఎంసీ చైర్మన్ మధు

కొత్తపల్లి: మండలంలోని నాగులమల్యాల చెరువు నుంచి బావుపేట బావు చెరువుకు నీటిని మళ్లించే క్రమంలో నిర్మిస్తున్న తూం వల్ల రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు తెలిపారు. నాగులమల్యాల శివారులో కొడిపెకుంట వద్ద రూ.30 లక్షలతో నిర్మిస్తున్న తూం పనులను ఆచంపల్లి రైతులు వ్యతిరేకించగా, శనివారం ఇరిగేషన్ డీఈ, ఏఈ, నాగులమల్యాల, ఆచంపల్లి సర్పంచ్‌లు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్ తదితర నాయకులు సదరు రైతులతో చర్చలు జరిపారు. తూం నిర్మాణం వల్ల జరిగే నష్టాన్ని మంత్రి కమలాకర్ దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం వచ్చేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తూం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నాయకులు రాజు, కూన నాగరాజు, మిట్ట లక్ష్మయ్య, బద్దిపల్లి, కొండాపూర్, ఆచంపల్లి రైతులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

విద్యానగర్: స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా కోట్ల రూపాయలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకుని తమ వ్యాపారాలు చేస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ప్రకటనలో ఆరోపించారు. నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ఏరియాలో నిర్మించిన ఫుట్‌పాత్ వాకింగ్ ట్రాక్‌లను పూర్తిగా వ్యాపారస్తులు కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. పేదవాళ్లు రోడ్డుపై ఏదైనా వ్యాపారం చేస్తే మున్సిపల్ అధికారులు వాహనంతో వచ్చి వారి సామగ్రిని వాహనాల్లో వేసుకొని తీసుకెళ్తున్నారని, రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా సామగ్రిని తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర మేయర్, కమిషనర్ వెంటనే ఆక్రమణలపై దృష్టి సారించి తొలగించాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు



పుట్టబంగారం తీసుకొస్తున్న భక్తులు

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్‌లో శ్రీ కొచ్చెగుట్ట మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమైనాయి. వేదపండితుడు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఓంకాలేశ్వర జ్యోతిర్లింగక్షేత్రం నుంచి తీసుకవచ్చిన 108 సాలగ్రామ బాణలింగాలతో మహాలింగార్చన నిర్వహించారు. ఒగ్గు పూజారులు సాయిల్ల శివయ్య ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ల నడుమ ఆలయ కమిటీ సభ్యులు పుట్టబంగారం తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెండ్యాల అమర్‌నాథ్‌శర్మ ఆధ్వర్యంలో రుద్ర పుష్ప చండీహోమం నిర్వహించారు. ఎంపీటీసీ వెంగల్‌దాసు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ దాది సుధాకర్, కార్పొరేటర్ నల్వాల రవీందర్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కాల్వ కొమురయ్య దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాల్వ మొగిలి, సభ్యులు కాల్వ మల్లేశం, శేఖర్, మహేందర్, లింగయ్య, అశోక్, రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్యలేంటి.. ఏం కావాలి?

- క్రీడా పాఠశాల విద్యార్థులతో సందీప్‌కుమార్ సుల్తానియా



విద్యార్థులతో మాట్లాడుతున్న సందీప్‌కుమార్ సుల్తానియా

కరీంనగర్‌స్పోర్ట్స్: మీ సమస్యలేంటి.. ఏం కావాలి అంటూ పర్యాటక, క్రీడ, సాంస్కృతిక, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా క్రీడా పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం కరీంనగర్‌కు వచ్చిన ఆయన విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. నిఖత్ జరీనా ప్రపంచ మెడల్ సాధిస్తే ప్రభుత్వం రూ.15కోట్ల విలువ చేసే భూమి, రూ.2 కోట్ల నగదు ఇచ్చిందని, తాను ఐఏఎస్ చదివి కలెక్టర్ అయినా తనకు భూమి కూడా ఇవ్వలేదని, క్రీడలకు అంతటి ప్రియారిటీ ఉంటుందని విద్యార్థులతో చమత్కరించారు. అనంతరం పాఠశాలకు చెందిన యశ్వంతిక, అనుదీప్, దీపిక, విక్రాంత్, మాధురి మాట్లాడుతూ, తాము క్రీడల్లో చాంపియన్‌లుగా ఎదుగుతామని, పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తాం అని పేర్కొన్నారు. తమకు స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, ఒక ఫిజియోథెరపిస్ట్, టేరా బ్యాండ్, యోగా హాల్, కోచ్‌లు కావాలని అడిగారు. ఇంకా ఏం కావాలో డీవైఎస్‌ఓ, కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపిస్తే నెల రోజుల్లో సమకూర్చుతానని సందీప్‌కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- ప్రధాని మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో నాయకులు



మాట్లాడుతున్న బాస సత్యనారాయణ

కరీంనగర్‌టౌన్: ప్రతీ కార్యకర్త బీజేపీ బలోపేతానికి పాటుపడాలని నాయకులు అన్నారు. నగర శాఖ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో నిర్వహిస్తున్న స్ట్రీట్ కార్నర్ సమావేశాలు శనివారం పలు డివిజన్లలో జరిగాయి. 59వ డివిజన్ శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశం ఇన్‌చార్జి రెడ్డి శ్రీనివాస్ (బాలు), పబ్బుల్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగింది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రఘునందన్‌రావు, నరహరి లక్ష్మారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, పబ్బుల్ల వీరయ్య, దయ్యాల అశోక్‌కుమార్, కర్రె శ్రీనివాస్, ఒజ్జెం సంజీవ్‌కుమార్, పరకాల ఆంజనేయులు, దయ్యాల సంజీవ్ కుమార్, దయ్యాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో భారత్‌టాకీస్ ఏరియాలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో జోన్ అధ్యక్షుడు దుర్శేటి అనూప్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ సౌత్ జోన్ ఆధ్వర్యంలో 10,12వ డివిజన్ల పరిధిలో జరిగిన సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు ఓదెల మల్లికార్జున్, వంగల సంపత్, కార్పొరేటర్ కాసర్ల ఆనంద్, మంజులవాణి, పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, ధీరజ్, కన్నాంబ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌ను నిర్మించేది పాఠశాలలే

- మంత్రి గంగుల కమలాకర్



మంత్రి చేతుమీదుగా పోలీసు వెల్ఫేర్‌కు రూ.లక్ష విలువైన చెక్కు అందజేస్తున్న చైర్మన్ ముస్తాక్ అలీ

కరీంనగర్‌కల్చరల్: చిన్నారుల భవిష్యత్‌ను నిర్మించేది పాఠశాలలే అని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం నగరంలోనిక్ష్ లక్ష్ విద్యా సంస్థల 13వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యాసేవయే పరమావధిగా భావిస్తూ, సాధారణ ఫీజులతో అసాధారణ స్థాయిలో విద్యాబోధన గావిస్తున్న లక్ష్ విద్యా సంస్థల సేవలు అమోఘమని కొనియాడారు. విద్యాసంస్థల చైర్మన్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ సమాజంలో ఉగ్గుపాలతోనే చిన్నారులు తమ జీవిత లక్ష్యం ఎంచుకుంటున్నారని, వారి లక్ష్యం నెరవేర్చే దిశగా తమ విద్యా సంస్థ నిరంతరాయంగా పాటుపడుతోందన్నారు. పాఠశాల తరుపున పోలీస్ వెల్ఫేర్‌కు రూ.లక్ష అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు చల్ల హరిశంకర్, ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్ న్యాయవాదుల బృందం జిల్లా కోర్టు న్యాయవాదుల సమస్యలను మంత్రి గంగుల కమలాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులకు విశ్రాంతి గది, న్యాయవాదులందరికీ కాన్ఫరెన్స్ హాల్‌తో పాటు రెండు కోర్టు భవనాల మధ్యలో వాకర్ బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై మంత్రి స్పందించినట్లు, వారంలోగా స్థలాన్ని గుర్తించి పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి న్యాయవాదుల బృందానికి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ న్యాయవాది అనిల్‌కుమార్, పీవీ రాజ్‌కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆరెల్లి రాములు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, కోశాధికారి కొట్టి తిరుపతి, ఏవీ రమణ ఉన్నారు.

అజయ్‌బంగా నామినేట్‌పై హర్షం

విద్యానగర్: భారత సంతతికి చెందిన అజయ్‌బంగాను ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ నామినేట్ చేయడం అభినందనీయమని తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి

- మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

కొత్తపల్లి: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాటలు వేయాలని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు పిలుపునిచ్చారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శనివారం జరిగిన పేరెంట్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో ఉన్నంత సేపు ఉపాధ్యాయులు, ఇంటికి చేరుకున్నాక తల్లిదండ్రులు విద్యార్థులను పర్యవేక్షించాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు హితబోధ చేయాలని చెప్పారు. సమావేశంలో మండల విద్యాధికారి మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయురాలు కె.జలజారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవంలో చైర్మన్ పాల్గొన్నారు. హెచ్ఎం శ్రీలత, కౌన్సిలర్ ఎస్కే నజియాబాబా, కో ఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐరీస్ ఫ్లోరెస్ట్ స్కూల్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిపాల్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని రేకుర్తిలో గల ఐరిస్ ఫ్లొరెస్ట్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి అతిథులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ బోడ మహిపాల్‌రెడ్డి, సైకాలజిస్ట్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు శిరవేణి తిరుపతి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. చిన్నతనం నుంచే పట్టుదలతో చదివితే విజయం తొందరగా వరిస్తుందని, విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గుండ జలజతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఎస్‌యూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీలో సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థులు సమ్మేళనం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి శాతవాహన వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ హాజరై మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో విద్యార్థులు పాత్ర కీలకమైనదని తెలిపారు. యూనివర్సిటీకి '12బి' వచ్చినట్టుగా తెలియజేస్తూ, ఇంకా ముందు పలు అభివృద్ధి పనులను చేయాల్సి ఉందని తెలియజేశారు. పూర్వ విద్యార్థులు యూనివర్సిటీ ప్రఖ్యాతలను పలు దిశలకు వ్యాపింపచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ప్రిన్సిపల్ జయంతి పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి

కరీంనగర్‌కల్చరల్: సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి సప్తగిరికాలనీలోని కోదండ రామాలయంలో సమరసతా సమ్మేళనం నిర్వహించారు. సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని అన్నికులాల వారు సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. తుమ్మల శ్రీరామ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రాంత సహ కార్యదర్శి పుల్లూరి రామారావు, పెంచాల శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను నిత్యం గమనించాలి

చిగురుమామిడి: తల్లిదండ్రులు పిల్లల దైనందిన కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని ఎంఎస్‌కే జిల్లా వెల్ఫేర్ కో ఆర్డినేటర్ చిట్టంపల్లి శైలజ అన్నారు. శనివారం మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో వేర్వేరుగా అవగాహన సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తే భవిష్యత్‌లో సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని, పిల్లలు మంచి వారితో స్నేహం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్



సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి



సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

సప్తగిరికాలనీ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు సోలార్ సిస్టం, ఎర్త్‌క్వేక్ అలారం సిస్టం, ఆవర్తన పట్టిక, జంతుకణం, మానవ జీర్ణవ్యవస్థ తదితర ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అంతకుముందు కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. సైన్స్ మన జీవితంలో ఒక భాగమని, విజ్ఞానశాస్త్రంలో నూతన పోకడలను నేర్చుకుంటూ దానికి అనుగుణంగా మేధస్సును వినియోగించాలన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీనగర్ ఉన్నత పాఠశాలలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం జూబ్లీనగర్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను సర్పంచు రుద్ర భారతీ ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రజుమంలో హెచ్ఎం వెంకటపద్మాదేవి, విద్యాకమిటీ చైర్మన్ వెంకట్, నాయకులు రాజేశం, రాము పాల్గొన్నారు.

స్నేహితుడిని కత్తితో పొడిచి..
తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి


నిందితుడు హరిహర కృష్ణతో జీవన్ (సర్కిల్‌లో)

అబ్దుల్లాపూర్‌మెట్/కల్వకుర్తి టౌన్/ చారకొండ/ ఎంజీయూ (నల్లగొండ రూరల్)/ నార్కట్‌పల్లి: అతను స్నేహితుడు.. కానీ తాను ప్రేమించిన యువతికి దగ్గర అవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు.. మనసులో కక్ష పెంచుకున్నాడు.. ఫ్రెండ్స్‌తో గెట్ టుగెదర్ ఉంది రమ్మని పిలిచాడు.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి చంపేశాడు.. తర్వాత గుండె, తల, మొండెం, కాళ్లు చేతులను వేరుచేసి.. వాటి ఫొటోలను వాట్సాప్ ద్వారా ప్రియురాలికి పంపి పైశాచికానందం పొందాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం ఆలస్యంగా వెలుగు చూసిన దారుణ ఘటన ఇది. హతుడు, నిందితుడు ఇద్దరూ స్నేహితులు, ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం, ప్రేమ విషయం హత్యకు దారితీయడం కలకలం రేపింది.

ఇంటర్ నుంచీ స్నేహితులు..

పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని వంకరాయి తండాకు చెందిన నేనావత్ శంకర్ కుమారుడు నేనావత్ నవీన్ (20), వరంగల్‌కు చెందిన పేరాల ప్రభాకర్ కుమారుడు పేరాల హరిహరకృష్ణ (21) ఇద్దరూ స్నేహితులు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీఎల్ కాలేజీలో కలిసి ఇంటర్ చదివారు. తర్వాత హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని అరోరా కళాశాలలో.. నవీన్ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బీటెక్‌లో చేరారు. అయినా తమ స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే హరిహరకృష్ణ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. నవీన్ కూడా అదే యువతిని ఇష్టపడ్డాడు. సదరు యువతి కూడా కొంతకాలం నుంచి తనను దూరం పెడుతూ నవీన్‌తో చనువుగా ఉండటాన్ని హరిహరకృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయానికి వచ్చాడు.

ముందుగానే ప్లాన్ చేసుకుని..

నవీన్‌ను అంతమొందించాలని రెండు నెలల నుంచే ప్లాన్ చేసుకున్న హరిహరకృష్ణ.. ఈ నెల 17న ఇంటర్ ఫ్రెండ్స్ గెట్ టు గెదర్ ఉందని, రావాలని నవీన్‌కు ఫోన్ చేశాడు. ఇది నమ్మిన నవీన్ యూనివర్సిటీ నుంచి హైదరాబాద్‌కు వచ్చి హరిహరకృష్ణను కలిశాడు. కాసేపు ఇద్దరూ బైక్‌పై కలిసి తిరిగారు. సాయంత్రం మద్యం తీసుకుని బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. మద్యం తాగుతూ మాట్లాడుకున్నారు. ఈ సమయంలో ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే ప్లాన్ ప్రకారం పదునైన కత్తి తెచ్చుకున్న హరిహరకృష్ణ దానితో దాడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్ దీనిని ప్రతిఘటించలేకపోయాడు. తీవ్ర ఆవేశంలో ఉన్న హరిహరకృష్ణ కత్తితో నవీన్ తలను, కాళ్లు, చేతులు, ప్రైవేట్ పార్ట్స్‌ను కోసి ముక్కలు చేశాడు. ఛాతీ భాగాన్ని చీల్చి గుండెను బయటికి తీశాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మరో స్నేహితుడి ఇంటికి వెళ్లి.. స్నానం చేసి..

నవీన్‌ను హత్య చేసిన తర్వాత హరిహరకృష్ణ నేరుగా హసన్ అనే మరో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. కాస్త టెన్షన్‌గా కనిపించడంతో ఏం జరిగిందని హసన్ ప్రశ్నించినా ఏమీ లేదంటూ.. బాత్రూంలోకి వెళ్లి స్నానం చేసిన వచ్చాడు. తర్వాత హత్య గురించి హసన్‌కు చెప్పాడు. దీనితో భయపడిన హసన్ వెంటనే వెళ్లి పోలీసులకు లొంగిపోవాలని సూచించగా.. తెల్లారాక వెళ్తానని చెప్పి, అక్కడే నిద్రపోయాడు. మరునాడు మూసారాంబాగ్‌లోని తన సోదరి మమత ఇంటికి వెళ్లాడు. నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నాడు.

ఏమీ తెలియనట్టు నటిస్తూ..

ఈ నెల 16న యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచీ నవీన్ ఆచూకీ తెలియకపోవడంతో.. అతడి కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. హరిహరకృష్ణను కలిసి ఏం జరిగిందని నిలదీశారు. అయితే ఓ యువతి విషయంలో తమ మధ్య గొడవ జరిగినది నిజమేనని, కానీ తర్వాత ఇద్దరం కలుసుకున్నామని హరిహరకృష్ణ చెప్పాడు. నవీన్ నార్కట్‌పల్లికి వెళ్తానంటే విజయవాడ జాతీయ రహదారిపై దింపేసి తాను హైదరాబాద్‌కు వెళ్లిపోయానని వివరించాడు. నవీన్ కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకుండా అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నప్పుడువారి వెంటే ఉంటూ నమ్మించాడు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చాడని నవీన్ స్నేహితులు తెలిపారు.

అన్నివైపులా ఒత్తిడి పెరగడంతో..

నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్న హరిహరకృష్ణ తర్వాత విశాఖపట్నంతోపాటు పలు ప్రాంతాల్లో తిరిగాడు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి ప్రియురాలికి ఫోన్ చేసి పిలిపించుకుని మాట్లాడాడు. నవీన్‌ను హత్య, ఇతర అంశాలను ఆమెకు వివరించగా.. పోలీసులకు లొంగిపోవాలని ఆమె చెప్పినట్టు తెలిసింది. మరోవైపు హరిహరకృష్ణను కలవడానికి వెళ్లిన నవీన్ ఆచూకీ లేకపోవడం, హరిహరకృష్ణ ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో.. నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిహరకృష్ణ కుటుంబ సభ్యులనూ ప్రశ్నించారు. ఇలా అన్నివైపులా ఒత్తిడి రావడంతో హరిహరకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు అతడిని శనివారం రాత్రి హయత్‌నగర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. కాగా.. నవీన్ హత్యకు హరిహరకృష్ణ ఒక్కడే పాల్పడ్డాడా, మరెవరైనా ఉన్నారా అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ హత్యకు గురైన రోజు హరిహరకృష్ణతోపాటు మరో స్నేహితుడైన జీవన్ కూడా తన బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ వరకు వచ్చినట్టు తెలిసింది. అతను వెళ్లిపోయాక హత్య జరిగిందా? కలిసే హత్య చేశారా అన్నదానిపై ఆరా తీస్తున్నారు.

నవీన్ కుటుంబ సభ్యుల ఆందోళన

నిందితుడు హరిహరకృష్ణను కఠినంగా శిక్షించాలంటూ నవీన్ కుటుంబ సభ్యులు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని.. నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దొరకకుండా జాగ్రత్తపడి..

నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ఆధారాలు దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహంపై డ్రెస్‌ను తొలగించి దూరంగా పడేశాడని.. హత్యచేసి, శరీర భాగాలను కోసిన సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని వివరించారు. అలాగే ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తనకు చెందిన రెండు ఫోన్లలోని డేటా మొత్తాన్ని తొలగించినట్టు సమాచారం.

విషాదంలో వంకరాయి తండా

నవీన్ హత్య విషయం తెలియడంతో అతడి స్వగ్రామం వంకరాయితండాలో విషాదం అలుముకుంది. నవీన్ తండ్రి శంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి వసంత కూలిపనులకు వెళ్తుంది. గ్రామం నుంచి కల్వకుర్తికి వలస వచ్చిన వారిద్దరూ.. కష్టపడి పనిచేస్తూ కుమారుడిని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు దారుణంగా హత్యకు గురికావడంతో కన్నీటిలో మునిగిపోయారు. పోలీసులు శనివారం సాయంత్రం నవీన్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రికి వంకరాయితండాలో అంత్యక్రియలు నిర్వహించారు.


నవీన్ స్వగ్రామం వంకరాయి తండాలో విషాదఛాయలు

20 మీటర్లకు ఓ ముక్క.. యువతికి వాట్సాప్‌లో ఫొటోలు!

పోలీసులు లొంగిపోయిన హరిహరకృష్ణను ఘటనా స్థలానికి తీసుకెళ్లి విచారించారు. మద్యం మత్తులోనే నవీన్‌ను హత్య చేసినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నవీన్ శరీరాన్ని ముక్కలుగా చేశాక.. 20 మీటర్లకో భాగాన్ని దూరదూరంగా పారేసినట్టు తేల్చారు. ఆ భాగాలను పోలీసులు సేకరించి ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఇక నవీన్‌ను కిరాతకంగా చంపిన హరిహరకృష్ణ.. అతడి శరీర భాగాలను ఫొటోలు తీసి ప్రేమించిన యువతికి, పలువురు ఇంటర్ స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపినట్టు తెలిసింది.

పథకం ప్రకారమే హత్య

నవీన్ హత్య పథకం ప్రకారమే జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. నిందితుడు తన వెంట పదునైన కత్తిని తీసుకుని వచ్చాడంటే అది క్షణికావేశంలో జరిగిన హత్యగా కనిపించడం లేదు. కొంతకాలంగా నవీన్‌పై హరిహరకృష్ణ పెంచుకున్న పగే ఈ హత్యకు దారితీసినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తాం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తాం.

– సాయిశ్రీ, డీసీపీ ఎల్బీనగర్

మల్లన్న సేవలో సీజేఐ


ఆలయం వద్ద సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కి స్వాగతం పలుకుతున్న దేవస్థానం చైర్మన్ తదితరులు

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ వై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చక స్వాములు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి దంపతులు రత్నగర్భ స్వామిని, తర్వాత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, భ్రమరాంబాదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల చూపు ఏపీ వైపు

- 44 నెలల్లో వాస్తవ రూపంలోకి రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు
- ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు

సాక్షి, అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోని దిగ్గజ సంస్థలు పారిశ్రామిక అనుకూల విధానాలున్న ఏపీ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ సంస్థలు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది.

14,36,992 మందికి ఉపాధి

సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టాక 2019 జూన్ నుంచి 2023 జనవరి వరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు (ఎంఎస్ఎంఈ సహా) వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలైంది. ఇందులో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 5న లాంఛనంగా ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 13,63,706 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా మరో 86 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,35,125.60 కోట్ల విలువైన పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా వాస్తవ రూపంలోకి వస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది.

ప్రకృతి సాగులో ఏపీ ఆదర్శం

కేంద్రం ప్రశంసలు.. సామాజిక ఆర్థిక సర్వేలో ప్రస్తావన

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏపీలో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి అరుదైన గౌరవం దక్కింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలో ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రశంసించింది. అన్ని రాష్ట్రాలూ ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించింది. తొలుత 704 గ్రామాల్లో 40 వేల మందితో ప్రారంభమైన ప్రకృతి సాగు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఓ ఉద్యమంలా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రైతులు కాకుండా ఈ ఉద్యమంలో ఇప్పటివరకు 1.32 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. 1.71 లక్షల మంది పేద, మధ్య తరగతుల ప్రజలు ఇళ్లలో కిచెన్ గార్డెన్లను పెంచుతున్నారు. ఏపీ స్ఫూర్తితో ఈ ఏడాది జాతీయ స్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

చిన్నప్పటి నుంచి చదువులో చురుకే..!

- నిజామాబాద్‌లో మెడికో ఆత్మహత్య
- జన్నారం మండలం చింతగూడలో విషాదం


మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి రాధ

జన్నారం(ఖానాపూర్): కొడుకు వైద్య విద్య పూర్తి డాక్టర్‌గా సేవలు అందిస్తాడని ఆశించిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. అర్ధంతరంగా తనువు చాలించడంతో తీరని దుఃఖం మిగిలింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి దాసరి హర్ష(22) నిజామాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాస్, రాధ దంపతులకు కుమారులు హర్ష, ధనుష్ ఉన్నారు. హర్ష ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు జన్నారంలోని జయరాణి పాఠశాలలో చదివాడు. ఎనిమిది నుంచి పదో తరగతి వరకు మంచిర్యాలలోని ప్రైవేటు పాఠశాలలో అభ్యసించాడు. పదో తరగతిలో 10జీపీఏ సాధించి హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ 908 మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. నీట్‌లో 1320వ ర్యాంకు సాధించి జనరల్ కోటాల నిజామాబాద్‌లోని మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండే హర్ష మెడికల్ కళాశాలలోనూ చురుగ్గా ఉండేవాడు.

కొన్నేళ్లుగా వెన్నుముక నొప్పి

హర్ష కొన్నేళ్లుగా వెన్నుముక నొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం ఎంఆర్ఐ స్కానింగ్ కూడా చేయించుకున్నాడు. రిపోర్టు రావాల్సి ఉంది. రాత్రి 11గంటల వరకు చదువుకుని ఉదయం నాలుగు గంటలకే లేచి చదువుకునేవాడని చెబుతున్నారు. పరీక్షలు ఉన్నాయి.. మూడు గంటలకే లేపాలని స్నేహితులకు చెప్పి శుక్రవారం రాత్రి 9గంటలకే నిద్రపోయాడు. రాత్రి ఏమైందో గానీ తెల్లారే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అతడి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చింతగూడలో విషాదం నెలకొంది.

అమ్మా నొప్పి ఎక్కువవుతుంది..

''అమ్మా నొప్పి ఎక్కువగా ఉంది.. తగ్గేలా లేదని శుక్రవారం రాత్రి ఫోన్ చేసి చెప్పాడు. నేను వచ్చి పరీక్షలు అయ్యే వరకు అక్కడే ఉంటాను బిడ్డా అని చెప్పగా.. వద్దమ్మా.. పరీక్షలు అయ్యాక నేను వస్తాను. ఆసుపత్రికి వెళుదాం అని చెప్పాడు..'' అంటూ హర్ష తల్లి రాధ రోదిస్తూ తెలిపింది. కాగా, గత కొన్ని రోజులుగా ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా నొప్పి తగ్గడం లేదని బంధువులు తెలిపారు.

మలేషియాలో తండ్రి.. రావడం కష్టమే..!

ఉపాధి కోసం మలేషియా వెళ్లిన తండ్రి శ్రీనివాస్‌కు కొడుకు చనిపోయాడనే విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. విదేశాల్లో పని చేస్తే కొడుకులు చదివి ప్రయోజకులు అవుతారని అనుకుంటే ఇలా జరగడం జీర్ణించుకోలేకపోతున్నాడు. నెల రోజుల క్రితమే శ్రీనివాస్ మలేషియా వెళ్లడంతో ఇక్కడికి పంపించడం కష్టమేనని బంధువులు అంటున్నారు. అంత్యక్రియలకు హాజరు కాదని చెబుతున్నారు. హర్ష మరణవార్త విన్న ఆయన మేనమామ శ్రీనివాస్ దుబాయ్ నుంచి బయలు దేరాడని తెలిపారు. ఆయన అంత్యక్రియలకు హాజరవుతారని పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులతోపాటు వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, సర్పంచ్ భర్త ఆరే శిరీష్ తదితరులు హర్ష మృతదేహాన్ని తీసుకురావడానికి నిజామాబాద్ వెళ్లారు.

వైద్య విద్యార్థుల నివాళి

నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌అర్బన్: హర్ష మృతి చెందటంతో తోటి విద్యార్థులు విషాదంలో మునిగారు. విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా, ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ నివాళులు అర్పించారు. ఆస్పత్రి నుంచి బయట వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లారు. హర్ష ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ జనరల్ మెడిసిన్ పేపర్–1, పేపర్ 2 పరీక్షలు రాయగా, శనివారం సర్జికల్ విభాగం పేపర్లు రాయల్సి ఉంది. ఇంతలోనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 74శాతం, రెండో సంవత్సరంలో 81శాతం, మూడో సంవత్సరంలో 76శాతం, నాల్గో సంవత్సరంలో 78శాతం మార్కులు సాధించాడు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరా తెలిపారు.

రాత్రి వరకు కలిసే చదువుకున్నాం



శుక్రవారం రాత్రి భోజనం చేశాక గంట వరకు కలిసే చదువుకున్నాం. రాత్రి 10 గంటల తర్వాత ఎవరి గదికి వారు వెళ్లిపోయాం. తెల్లవారుజామున 3 గంటలకు తనను నిద్రలేపాలని హర్ష చెప్పాడు. లేపేందుకు గదికి వెళ్తే స్పందించలేదు. మళ్లీ ఉదయం 7 గంటలకు పిలిచినా పలకలేదు. పరీక్షకు సమయం అవుతుండడంతో ఫోన్ చేసిన స్పందించలేదు. విషయాన్ని హాస్టల్ సిబ్బందికి తెలుపగా తలుపును బలవంతంగా తెరిచి చూడగా హర్ష ఉరేసుకుని చనిపోయాడు.

– తరుణ్, విద్యార్థి

నేడు రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

- హాజరుకానున్న 1,000 మంది క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించనున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీవైఎస్ఓ రాజవీరు, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం ఇండోర్ స్టేడియంలో గోజురాయ్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 7వ రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురభి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజవీరు ఆవిష్కరించారు. అనంతరం రాజవీరు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా క్రీడా హబ్‌గా తయారైందన్నారు. కరాటే పోటీలకు నిలయంగా మారిందని, ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలు అంబేద్కర్ స్టేడియం వేదికగా జరగడం అభినందనీయమన్నారు. సురభి వేణుగోపాల్ మాట్లాడుతూ గోజురాయ్ కరాటే సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలతో పాటు గ్రాండ్ చాంపియన్ షిప్, నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పోటీలను ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియా చీఫ్ ఎల్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళ బస్సులు నడిపించాలి

సిరిసిల్లటౌన్: కరీంనగర్ నుంచి సిరిసిల్లకు రాత్రి వేళలో బస్సులు సమయపాలన పాటించాలని పలువురు ప్రయాణికులు సిరిసిల్ల డిపో మేనేజర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము గత పదేళ్లుగా సిరిసిల్ల నుంచి కరీంనగర్‌కు తమ పనులపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నామని వివరించారు. గతంలో కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు రోజూ రాత్రి 11.15 గంటలకు కొనసాగేదని, అలాగే కామారెడ్డి డిపోకు చెందిన బస్సు రాత్రి ఒంటి గంటకు నడిచేదని గుర్తు చేశారు. కరోనా అనంతరం ఆ రెండు బస్సులు రద్దు అయ్యాయని తెలిపారు. దీంతో రాత్రి వేళలో సమయానికి బస్సులు లేక సిరిసిల్ల, వేములవాడకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల డిపో మేనేజర్ స్పందించి రోజూ రాత్రి కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వచ్చే బస్సును రాత్రి 11.30 గంటలకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రయాణికులు సిరిసిల్ల వెంకటేశ్, భాను, హరీశ్, నాగరాజు తదితరులున్నారు.

నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి


వైఎస్ షర్మిలకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న చొక్కాల రాము

వేములవాడ: మధ్యమానేరు ముంపు గ్రామాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆపార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. నూలుతో తయారు చేసిన షర్మిల చిత్రపటాన్ని బహూకరించారు. త్వరలోనే ముంపు గ్రామాలను సందర్శించాలని కోరినట్లు రాము తెలిపారు.

వామ్మో.. పులులు

- అటవీ ప్రాంతాన్ని సందర్శించిన డీఎఫ్‌వో
- బేస్‌క్యాంప్ సిబ్బంది కంటపడ్డ పులులు


గొల్లఘాట్ శివారులో పాదముద్రల పరిశీలన

తాంసి: మహారాష్ట్ర సరిహద్దు ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంత గ్రామాలకు మళ్లీ పులి భయం పట్టుకుంది. గురువారం అర్ధరాత్రి భీంపూర్ మండలం గొల్లఘాట్ సమీపంలో మరోసారి నాలుగు పులులు ఒకే చోట సంచరిస్తూ స్థానికుల కంటపడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. పులులు ఎటు నుంచి దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు చేతికొచ్చిన పంటలను కాపాడుకోవడం రైతులకు ఇబ్బందికరంగా మారింది.

అటవీ ప్రాంతాన్ని సందర్శించిన డీఎఫ్‌వో

గొల్లఘాట్ సమీపంలో ఇటీవల పులులు సంచరించిన ప్రదేశాలను ఎఫ్‌డీవో బర్నోబాతో కలిసి డీఎఫ్‌వో రాజశేఖర్ శనివారం పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులుల కదలికలను పర్యవేక్షిస్తూ సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎఫ్‌వో మాట్లాడారు. తిప్పేశ్వర్ నుంచి వచ్చిన నాలుగు పులులు పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్న నేపథ్యంలో గొల్లఘాట్, గుంజాల, తాంసి(కె), పిప్పల్‌కోటి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులులతో ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా 10 మంది సిబ్బందితో బేస్‌క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అడవిలో సీసీ కెమెరాలు అమర్చి పులుల కదలికలను నిత్యం పరిశీలిస్తున్నామన్నా రు. పంట చేలకు వెళ్లేటప్పుడు రైతులు గుంపులుగా, చప్పుడు చేస్తూ వెళ్లాలన్నారు. పశువులను ఇంటి వద్ద ఉంచాలన్నారు. పులులు కనిపిస్తే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్, సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గులాబ్, యానిమల్ ట్రాకర్స్ ఉన్నారు.

బేస్ క్యాంపు సిబ్బందికి కనిపించిన పులులు

గుంజాల శివారు అటవీప్రాంతంలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో బేస్‌క్యాంపు సిబ్బందికి ఒకేసారి నాలుగు పు లులు కనిపించాయి. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాల పరిశీలన కోసం వెళ్తున్న క్రమంలో వారికి 50 మీటర్ల దూరంలోనే అవి కనిపించడంతో అలర్ట్ అయ్యారు. తొలుత మూడు పిల్లలను రోడ్డు దాటించిన అనంతరం పెద్ద పులి కూడా అటవీ ప్రాంతంలోకి వెళ్లింది.

రాజన్న సేవలో సందీప్‌కుమార్ సుల్తానియా


సందీప్‌కుమార్ సుల్తానియాకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం రాజన్నను దర్శించుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఈఈ రాజేశ్ ఘనస్వాగతం పలికారు. అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య ఆశీర్వాదం ఇచ్చారు.



నలుగురితో కలిసి ఉన్నప్పుడు మనలోని బలం పెరిగినట్టు అనిపిస్తుంది. అదే, ఒంటరిగా ఉన్నప్పుడు లేదా ఏదైనా సమస్యను ఎదుర్కొనే సమయంలో మానసికంగా మనం ఎంతటి శక్తివంతులమో మనకే అర్థమవుతుంది. ఈ సమయంలో భావోద్వేగాలలో మార్పులు తీవ్రంగా ఉంటే జీవన విధానంపై అవి చెడు ప్రభావం చూపుతాయి. 'ఒంటరిగా ఉన్నా, నలుగురిలో కలివిడిగా ఉన్నా భావోద్వేగాలను అదుపులో పెట్టుకుంటూ మనల్ని మనం శక్తిమంతులుగా ఎలా సిద్ధం చేసుకోవాలో తెలుసుకుంటే వచ్చే సమస్యల అలలను సులువుగా ఎదుర్కోవచ్చు' అంటున్నారు మనస్తత్వ నిపుణులు.

ప్రతీకాత్మక చిత్రం

మీలోని శక్తి ఎంత?!

'సైకలాజికల్ ఫ్లెక్సిబిలిటీ అనేది సందర్భాన్ని బట్టి, వ్యక్తిని బట్టి మారుతూ ఉంటుంది. అయితే, ఇటీవల చాలా మందిలో గమనిస్తున్న విషయమేంటంటే చిన్న విషయానికి కూడా ఓవర్‌గా రియాక్ట్ అవుతుంటారు. నేను చెప్పిందే వినాలి' అనే ధోరణి పెరగడం కూడా బంధాలను విచ్ఛిన్నం చేస్తుంది' అంటున్నారు లైఫ్‌స్కిల్ ట్రెయినర్ జ్యోతిరాజ.

ఎరుక అవసరం

కొందరు తమచుట్టూ ఎవరికీ కనపడని ఒక వలయాన్ని సృష్టించుకుంటారు. పరిమితులను నిర్దేశించుకుని వాటిని దాటి బయటకు రారు. ఏదైనా చిన్న సమస్య ఎదురైనా సృష్టించుకున్న వలయం ఎక్కడ ఛిన్నాభిన్నం అవుతుందో అని తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతారు. ఫలితంగా భావోద్వేగాల అదుపు కోల్పోయి ఇతరులను నిందించడం, తమను తామే శిక్షించుకోవడం లేదా గాసిప్స్‌ని ఆశ్రయిస్తారు. 'భావోద్వేగాల అదుపు కోల్పోతే ఏ బంధంలోనైనా బీటలు వస్తాయి. అందుకని వలయాలతో కాకుండా ఎరుకతో మెలిగితే మనలోని అంతర్గత శక్తి స్థాయిలు స్పష్టమవుతాయి' అనేది నిపుణుల మాట.

మౌనంగా ఉండటం మేలు

అతిగా మాట్లాడటం, చేతల్లో మన పనిని చూపించకపోతే ఎదుటివారి ముందు మన శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా భావోద్వేగాల్లోనూ మార్పు వస్తుంది. ఇది బంధుమిత్రుల మధ్య పెద్దగా గుర్తించకపోవచ్చు. కానీ, పని ప్రదేశాలలో ఈ 'శక్తి'ని బాగా గుర్తించవచ్చు. ఇబ్బందిని కలిగించే సంభాషణల్లో పాల్గొనడం కన్నా, తక్కువ మాట్లాడం వల్ల శక్తిని, భావోద్వేగాల సమతుల్యతను కాపాడుకోవచ్చు. ఆ శక్తిని ఇతర సృజనాత్మక పనులకు బదిలీచేయవచ్చు.

అవగాహనతో సరైన శక్తి

అంతర్గత దిక్సూచిని భావోద్వేగ మేధస్సు అని కూడా అంటారు. ఇది సున్నితం–తీవ్రం రెండింటినీ సమాన స్థాయిలో ఉంచుతుంది. అంటే, నలుగురిలో ఉన్నప్పుడు ఏ వ్యక్తి ఎలా దూకుడుగా ప్రవర్తించబోతున్నాడో ముందే పసిగట్టి, నివారించే శక్తి వీరికుంటుంది. సరైన సమయంలో ఎలా స్పందించాలో తెలిస్తే భావోద్వేగాలను అదుపులో పెట్టుకోగల అంతర్గత శక్తి పెరుగుతుంది.

పట్టు విడుపులు తెలుసుండాలి...

ఏ అంశం వదిలేయాలి, దేనిని మన ఆధీనంలో ఉంచుకోవాలనే దానిపై స్పష్టత ఉండాలి. అనవసరం అనిపించే సమస్య ఏదైనా వదిలేయడం కూడా తెలియాలి. పిల్లలైతే వారు చదువుల్లో ఆటపాటల్లో బిజీగా ఉంటారు. కాలేజీ స్థాయి యువతలో బిజీగా ఉంటారు. గృహిణుల్లో మాత్రం పిల్లలు పెద్దయ్యాక వారికి కొంత తీరిక సమయం ఉంటుంది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ముందునుంచే తమను తాము మలుచుకుంటూ ఉండాలి. తమలో ఉండే ఇష్టాయిష్టాలు, కలల కోసం ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు దాని ద్వారా కలిగే సంతృప్తి వల్ల భావోద్వేగాల అదుపు, అంతర్గత శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఈ ప్రాక్టీస్ ఇంట్లో పిల్లల చేత కూడా చేయిస్తే, వారిలోనూ కొత్త సమర్థతలు బయటకు వస్తాయి. భావోద్వేగాల అదుపుకు అంతర్గతశక్తిని మేల్కొల్పడమే సరైన ఆయుధం.



- ఆచార్య జ్యోతిరాజ,
లైఫ్ స్కిల్ ట్రెయినర్

తట్టుకునే శక్తిని పెంచుకోవాలి..

సాధారణంగా మనకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే కంగారు పడిపోతాం. భయం ఆవరించేస్తుంది. ఈ ఒత్తిడి మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని. బ్యాక్‌పెయిన్, నెక్ పెయిన్, స్ట్రెస్.. వంటివి సాధారణంగా ఉంటాయి. ఈ సమస్యలకు విరుగుడుగా ఆరోగ్యం, మానసిక స్థిరత్వానికి యోగ సాధన చేయడం ఒక భాగం చేసుకున్నాను. దీనితో పాటు ధ్యానం చేయడం వల్ల ప్రశాంతతను ఇస్తుంది. ఆందోళన లేకుండా సమస్యలను తట్టుకుని, ముందడుగు వేసే శక్తినిచ్చే ఆయుధాలుగా వీటిని మలుచుకున్నాను.



- కవిత ఎన్,
సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

బ్యూటిప్స్



గుప్పెడు వేపాకులు ఎండబెట్టి పొడి చేసుకోవాలి. అందులో చిటికెడు పసుపు, తగినన్ని రోజ్‌వాటర్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దానిని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. అప్పుడప్పుడు ఇలా చేస్తుంటే ముఖచర్మం అందంగా, ఆరోగ్యంగా తయారవుతుంది.



టీ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ ఆరెంజ్ జ్యూస్ కలిపి ముఖానికి రాయాలి. వేళ్లతో కొద్దిగా మసాజ్ చేసి, ఐదు నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల మలినాలు తొలగి, చర్మం కాంతివంతం అవుతుంది.



అదర్ సైడ్



రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో డీన



'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో డీన వాపో

లండన్ నుంచి పేదోళ్ల ఇంటి వరకు...

బ్రిటీష్–ఇండియన్ మోడల్‌గా ప్రసిద్ధురాలైన డీన వాపో లండన్–ఇండియాల మధ్య సంచరిస్తూ ఉంటుంది. 'మల్టీ టాలెంటెడ్'గా పేరు తెచ్చుకున్న డీన మన దేశ పేదల కోసం పనిచేస్తోంది. అబుదాబిలో జరిగిన 'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో స్త్రీసాధికారతకు సంబంధించి కీలక ఉపన్యాసం చేసింది...

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో జరిగిన 'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో వందదేశాల నుంచి వివిధరంగాల మహిళలు పాల్గొన్నారు. ప్రధాన వక్తల్లో డీన వాపో (మిస్ ఇండియా, యూకే విన్నర్ 2012) ఒకరు.

'భిన్నరంగాలకు చెందిన నిష్ణాతులు, మేధావులతో కలిసి ఈ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. లింగ సమానత్వం, మహిళా సాధికారత, మహిళల నాయకత్వం...మొదలైన అంశాలపై విస్తృతమైన చర్చ జరిగింది. ఎన్నో రకాల విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది' అంటుంది డీన.

భారతీయ మూలాలు ఉన్న డీన వాపో బహుముఖ ప్రజ్ఞాశాలి.

'కొత్త విద్య నేర్చుకున్నప్పుడల్లా నీకు నువ్వు కొత్తగా కనిపిస్తావు. కొత్త శక్తి నీలోకి వచ్చి చేరుతుంది' అంటున్న డీన చిన్న వయసులోనే పాటలు పాడడంలో ప్రావీణ్యం సంపాదించింది. నటన, నృత్యాలలో భేష్ అనిపించుకుంది. కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. మోడల్ రంగంలోకి అడుగు పెట్టి సక్సెస్ అయింది.

2012లో 'మిస్ ఇండియా యూకే' కిరీటంతో ప్రపంచదృష్టిని ఆకర్షించింది.

మన బాలీవుడ్‌తో సహా ఎన్నో సినిమాల్లో నటించిన డీన 'డీకెయూ వరల్డ్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది....ఇదంతా ఒక కోణం అయితే 'డీకేయూ కైండ్‌నెస్' ట్రస్ట్ అనేది మరో కోణం. సామాజిక కోణం.

అట్టడుగు వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, లైఫ్ స్కిల్స్...మొదలైన వాటికి ఉపకరించే ట్రస్ట్ ఇది. ఈ ట్రస్ట్ తరపున రెండు సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్కూల్లో చదివే బాలికలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడింది. ట్రస్ట్ తరపున ఎడ్యుకేషనల్ కిట్స్ పంచింది.

'మీకు సహాయం చేయడానికి డీకేయూ ట్రస్ట్ ఉందనే విషయం ఎప్పుడూ మరవద్దు. ఇది మా ట్రస్ట్ కాదు. మనందరి ట్రస్ట్' అని చెప్పి పిల్లలు, తల్లిదండ్రులలో ధైర్యాన్ని నింపింది డీన.

గత సంవత్సరం దీపావళి పండగను రాజస్థాన్‌లోని జహొర అనే గ్రామంలో జరుపుకుంది. స్వీట్లు, ఎడ్యుకేషనల్ టూల్స్ పంచడమే కాదు తమ ట్రస్ట్ గురించి వారికి వివరించింది.

'క్షేత్రస్థాయిలోకి వెళ్లడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. మన ప్రపంచం విస్తృతం అవుతుంది. చేయాలనుకున్న మంచి పనుల జాబితాలో మరి కొన్ని పనులు వచ్చి చేరుతాయి' అంటుంది డీన.

ఇంగ్లాండ్‌లోని బ్రాగటి నగరంలో పుట్టింది డీన. తన పన్నెండవ యేట తండ్రి క్యాన్సర్‌తో చనిపోయాడు. ఆతరువాత తల్లితో కలిసి మిడ్‌లాండ్స్(సెంట్రల్ ఇంగ్లాండ్)కు వెళ్లింది.

ఒక విషాదానికి సంబంధించిన జ్ఞాపకాలకు దూరంగా, గాలి మార్పు కోసం తల్లి తనను కొత్త ప్రదేశానికి తీసుకు వెళ్లింది. అయితే డీనకు కొత్త ప్రదేశాలే కాదు కొత్త విద్యలు నేర్చుకోవడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆ ఇష్టమే తనను పదిమందిలో ప్రత్యేకంగా కనిపించేలా చేసింది.

'ఇండియాస్ ఫర్‌గాటెన్ పీపుల్' (నెట్‌ఫిక్స్)లో నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది డీన.

అయితే విస్మరణ వర్గాల గురించి ఆమె తపన కాల్పనిక చలన చిత్రానికే పరిమితం కావడం లేదు. ట్రస్ట్ కార్యకలాపాల ద్వారా తన ఆదర్శాలు, ఆలోచనలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.

హెల్త్

ఎప్పుడూ 'యూత్‌ఫుల్'గానే ఉండాలంటే!



అప్పట్లో ఓ కోలా యాడ్‌లో ఓ ఇంగ్లిష్ జింగిల్ వస్తుండేది. "ఎనీ వేర్ ఇన్ ద వరల్డ్... ఇట్స్ గ్రేటు బి యంగ్" అని. పూర్తి శరీరాన్నంతటినీ, ఆమాటకొస్తే లోపలి అవయవాలనూ, వాటి కండరాలను కూడా కప్పి ఉంచే చర్మాన్ని యూత్‌ఫుల్‌గా ఉంచేది 'కొలాజెన్' అనే ప్రొటీన్. అదెలా పొందవచ్చో, తద్వారా చాలాకాలం పాటు మధ్యవయసు లుక్‌నూ, వృద్ధాప్య లక్షణాలనూ దూరంగా ఉంచడం ఎలాగో, వయసు పెరుగుతున్నా (ఏజింగ్ జరుగుతున్నా) యూత్‌ఫుల్‌గా నిత్యయౌవనులుగా కనిపించడం ఎలాగో తెలిపే కథనం ఇది.

వయసు పెరుగుతుంటే కొందరిలో చుబుకం కింద, కొందరిలో కళ్ల కిందున్న చర్మం కాస్త కాస్తగా జారుతుంటుంది. స్కిన్ జారిపోవడానికి కారణంగా 'కొలాజెన్' అనే ప్రొటీన్ లోపించడమే. కొలాజెన్ స్వాభావికంగానే వృద్ధి చెందడానికి ఏయే ఆహారాలు తీసుకోవాలో, అప్పటికీ ప్రయోజనం లేకపోతే ఎలాంటి ప్రక్రియలు అవలంబించవచ్చో తెలుసుకుందాం.

కొలాజెన్ అంటే...

నిజానికి ఇదో ప్రొటీన్. చర్మంలో ఎక్కువగా ఉంటుంది. కేవలం చర్మంలోనే కాకుండా దేహంలోని అనేక అవయవాల్లో... అంటే కండరాల్లో, ఎముకల్లో, టెండన్స్, కణజాలాల్లో, రక్తనాళాల్లో, జీర్ణవ్యవస్థలోని అన్ని భాగాల్లో... ఆ మాటకొస్తే మనకు ఎక్కడైనా గాయం తగిలినప్పుడు, గాయం మానే సమయాల్లో ఇలా అన్ని ప్రదేశాల్లోనూ ఉంటుంది.

ఆహారంతోనే కొలాజెన్ పొందడమెలా?

మాంసాహారాల్లో... చికెన్ ● చేపలు (అందునా ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే ట్యూనా, మాకరెల్స్‌తో పాటు షెల్‌ఫిష్ వంటివి) ● గుడ్డులోని తెల్లసొన భాగం

శాకాహారాల్లో... ● అన్ని రకాల నిమ్మజాతి పండ్లు (అంటే నిమ్మ, నారింజ, బత్తాయి, కమలాల వంటివి) ● బెర్రీ పండ్లు (అంటే... రాస్ప్‌బెర్రీ, బ్లూబెర్రీ, బ్లాక్ బెర్రీ వంటివి) ● ట్రాపికల్ ఫ్రూట్స్‌లో (అంటే... మామిడి, జామ, పైనాపిల్, ద్రాక్ష, కివీ... వీటిల్లో ఉండే జింక్ కూడా యాంటీ ఏజింగ్‌కు అదనంగా ఉపయోగపడే పోషకం)

వంటలో వాడే పదార్థాల్లో : ● వెల్లుల్లి (ఇందులో కొలాజెన్‌ను సమకూర్చే పోషకాలు చాలా ఎక్కువ) ● ముదురు ఆకుపచ్చరంగులో ఉండే పాలకూర లాంటి అన్ని ఆకుకూరల్లో ● చిక్కుళ్లు ● టొమాటో ● బెల్‌పెప్పర్‌లతో పాటు ● జీడిపప్పు, బాదంపప్పు లాంటి నట్స్‌లో. ● ఇవేగాక ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే అన్ని ఆహారాలూ కొలాజెన్ ఉత్పత్తికి బాగా తోడ్పడతాయి).

కొలాజెన్‌కు ప్రతికూలంగా పనిచేసే ఆహారాలు ఇవీ:

చక్కెర ఎక్కువగా ఉండే స్వీట్లు, బాగా రిఫైన్స్ చేసిన కార్బోహైడ్రేట్లు కొలాజెన్‌కు కొంత ప్రతికూలంగా పనిచేస్తాయి.

కొలాజెన్ ఉత్పత్తికి తోడ్పడే కొన్ని బ్యూటీ ప్రక్రియలు:

● **అలోవేరా జెల్ :** అలోవేరా జెల్‌ను చర్మంపై పూయడం, నోటి ద్వారా 'ఆలో స్టెరాల్స్' తీసుకోవడం. ఈ ప్రక్రియలు కనీసం ఎనిమిది వారాలు కొనసాగాలి.

● **జిన్‌సెంగ్ :** హెర్బల్ ఉత్పాదన అయిన జిన్‌సెంగ్‌ను తీసుకోవడం. దీన్ని టీ, టింక్చర్స్ లేదా సప్లిమెంట్స్‌గా తీసుకోవచ్చు.

● **రెటినాల్స్ అండ్ కెరొటినాయిడ్ సప్లిమెంట్స్:** బీటా కెరోటిన్ ఎక్కువగా దొరికే... మాంసాహారాల్లో కాలేయం, శాకాహారాల్లో చిలగడదుంప, గుమ్మడి, క్యారెట్స్ తీసుకోవడం.

వైద్యచికిత్సా ప్రక్రియల సహాయంతో...

● **థ్రెడ్స్ ట్రీట్‌మెంట్:** వీటిల్లో ఫ్లోటింగ్, ఫ్రీ, కాగ్ థ్రెడ్స్ అని రకరకాల చికిత్సలు ఉంటాయి. పేషెంట్ అవసరాన్ని బట్టి డాక్టర్ వీటిల్లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేస్తారు. ప్రభావం నెల తర్వాత తెలుస్తుంది. ఈ చికిత్స ప్రభావం ఏడాది వరకే ఉంటుంది. కాబట్టి మళ్లీ మళ్లీ చేస్తుండాలి.

● **పీఆర్‌పీ థెరపీ ఫర్ ఫేస్:** ఈ చికిత్సలో పేషెంట్స్ నుంచి రక్తాన్ని సేకరించి, అందులోని ప్లేట్‌లెట్ సేకరించి ముఖానికి ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. ఇందులోనే పీఆర్‌ఎఫ్ (ఫైబ్రిన్), గ్రోత్‌ఫ్యాక్టర్ కాన్సంట్రేట్ పీఆర్‌పీ అనే కొత్త కొత్త చికిత్సలూ అందుబాటులోకి వచ్చాయి. దీన్ని నెలకొకసారి చొప్పున కనీసం 4 – 5 సార్లు చేయాలి.

● **మైక్రో నీడ్లింగ్ ఆర్ఎఫ్ :** రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలను ఉపయోగించి ముఖంపై ముడుతలను తగ్గించడానికి ఉపయోగిస్తారు.

● **ఫ్రాక్షనల్ సీఓటూ లేజర్ :** లేజర్‌ను ఉపయోగించి, ముఖాన్ని తేటగా చేయడానికి ఈ ప్రక్రియను ఉపయోగిస్తారు.

● **హైఫూ :** హై ఇంటెన్సిటీ ఫోకస్ అల్ట్రాసౌండ్ అనే మాటకు హైఫూ సంక్షిప్త రూపం. దీన్ని వివిధ తీవ్రతలతో వాడుతూ, సాగిన చర్మాన్ని బిగుతుగా చేయడానికి, డబుల్‌చిన్ తొలగించడానికి ఉపయోగిస్తుంటారు.

● **హైలూరానిక్ యాసిడ్ ట్రీట్‌మెంట్ :** శరీరం పైన పూసే క్రీములు, ఆయింట్‌మెంట్ల రూపంలోనూ, ఇంజెక్షన్ల రూపంలోనూ, అలాగే స్కిన్ బూస్టర్ ఇంజెక్షన్స్ ఇస్తారు. దీని వల్ల చర్మానికి మంచి హైడ్రేషన్ సమకూరి, ఏజింగ్ ఆలస్యం అవుతుంది.

● **రెడ్ లైట్ థెరపీ :** చర్మాన్ని ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలతో కూడిన ఎరుపురంగులో ఉండే కాంతి కిరణాలకు ఎక్స్‌పోజ్ చేయడం వల్ల చర్మంలో, దేహంలో కొలాజెన్ కొంత ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుందని కొన్ని అధ్యయనాల్లో తేలింది. అయితే ఇదే ప్రధాన థెరపీలాగా కాకుండా... మిగతా చికిత్సలతో పాటు దీని ఓ అదనపు చికిత్సగానే పరిగణించాలి.

● **ఓరల్ కొలాజెన్ పౌడర్స్ ఎన్‌రిచ్‌డ్ విత్ వైటమిన్ సి అండ్ యాంటీఆక్సిడెంట్స్ :** ఇవి నోటి ద్వారా తీసుకునే పౌడర్లు. ఇవే గాక ఇలాంటి ఇంజెక్షన్లూ లభ్యమవుతాయి.

చేయకూడనివి...

లేత ఎండకు ఎక్స్‌పోజ్ కావడం పరవాలేదు. అది చర్మానికి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ తీవ్రమైన ఎర్రటి ఎండ, దేహం కమిలిపోతున్నంత ఎండ వేడిమికి ఎక్స్‌పోజ్ కాకుండా కాపాడుకోవాలి.

గమనిక : ఎప్పుడైనా, ఎక్కడైనా స్వాభావికాలే మేలు. వైద్య ప్రక్రియలను ఆచరించాలనుకుంటే స్వాభావికమైన ఆహారాలనే తీసుకుంటూ, ఈ ప్రక్రియల్నీ తీసుకుంటేనే ఉపయోగం ఉంటుంది. అంతేతప్ప పూర్తిగా వైద్యపరమైన చికిత్సలే కొలాజెన్ పెరుగుదలకు ప్రామాణికాలు కావు. ఒకవేళ కొలాజెన్ వృద్ధి కోసం వైద్యపరమైన ప్రక్రియలను తీసుకోవాల్సి వస్తే పూర్తిగా క్వాలిఫైడ్ డర్మటాలజిస్టుల నేతృత్వంలోనే తీసుకోవాలి.



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

మెడి టిప్

సీ, డీ, ఈ, ఎఫ్... అక్షరాలతో ఆస్టియోపోరోసిస్ నివారణ తేలిక!


అందరిలోనూ 20 ఏళ్లు వచ్చే వరకు ఎముకలు వేగంగా పెరుగుతుంటాయి. మనలో దాదాపు 40 ఏళ్లు వచ్చేవరకు ఎముకలు కాస్త బలంగా గట్టిగా ఉంటాయి. ఆ తర్వాత క్రమంగా పలచబడుతూ, పెళుసుగా మారుతూ ఉంటాయి. ఇలా ఎముకలు పలచబారుతూ తేలిగ్గా విరిగేలా పెళుసుబారడాన్ని 'ఆస్టియోపోరోసిస్' అంటారు. ఈ ముప్పు మహిళల్లో మరీ ఎక్కువ. మహిళలైనా, పురుషులైనా ఆస్టియోపోరోసిస్ నివారణ కోసం ఈ కింది అక్షరాల సహాయంతో అవలంబించాల్సిన జాగ్రత్తలను గుర్తుపెట్టుకోవచ్చు. అవి... ● 'సి' ఫర్ క్యాల్షియమ్– ఎక్కువగా తీసుకోవాలి. అంటే క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాలు, ఆకుకూరల వంటివి. ● 'డి' ఫర్ విటమిన్ డి – శరీరానికి తగినంత అందేలా చూసుకోవాలి. ఇందుకోసం లేత ఎండలో నడక, వ్యాయామం మేలు. ●'ఈ' ఫర్ ఎక్సర్‌సైజ్ – శరీరాన్ని తగినంత వ్యాయామాన్ని అందించాలి. ● 'ఎఫ్' ఫర్ 'ఫాల్స్' – ఫాల్ అంటే ఇంగ్లిష్‌లో పడిపోవడం. వయసు పెరిగినవారికి బాత్‌రూమ్‌ల వంటి చోట్ల, ఎక్కడానికి అంత అనువుగా లేని మెట్లు ఉండే చోట్ల పడిపోవడం సాధారణంగా జరుగుతుంటుంది. ఇలా పడిపోయే అవకాశాల్ని తగ్గించుకోవాలి. అంటే ఆయా ప్రదేశాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.



లివర్ క్యాన్సర్ - రకాలు - లక్షణాలు

హెపాటో లేదా హెపాటిక్ అని పిలిచే ఈ గ్రీకు పదానికి కాలేయం అని అర్థం. జీవక్రియల్లో కీలకపాత్ర పోషించే మన కాలేయం దాదాపు 500 రకాలకు పైగా క్రియలను నిర్వర్తిస్తుంది. కాస్త తొలగించినా... తిరిగి పెరిగేలా... పూర్తిగా పునరుత్పత్తి సామర్థ్యం కలిగిన ఏకైక అవయవం. మన శరీరం లోపలి అవయవాల్లో అతి పెద్దదైన కాలేయాన్ని అతి పెద్ద గ్రంథిగా పేర్కొనవచ్చు. నాలుగు భాగాలుగా విభజితమై ఉండే కాలేయం దాదాపు కిలోన్నర వరకు బరువుంటుంది. దానికి వచ్చే క్యాన్సర్ గురించి తెలుసుకుందాం.

విష పదార్థాలు, కలుషిత ఆహారం, నీరు, మద్యం, ధూమపానం వల్ల కాలేయం మీద ప్రభావం పడి వాపునకు గురవుతుంది. దాన్ని 'హెపటైటిస్' అంటారు. హెపటైటిస్‌కు గురిచేసే వైరస్‌లు... ఏ, బి, సి, డి, ఇ అని ఐదు రకాలుగా ఉంటాయి. వీటిల్లో బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవి. రక్తమార్పిడి, అరక్షిత శృంగారం వల్ల, అలాగే తల్లి నుంచి బిడ్డకు...ఇవి సోకే ప్రమాదం ఎక్కువ. హెపటైటిస్–బి వైరస్ సోకకుండా వ్యాక్సిన్ ఉంది. కానీ... హెపటైటిస్–సి కు వ్యాక్సిన్ లేదు. అప్పటికే హెపటైటిస్–బి ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఈ వ్యాక్సిన్ వేయించుకునే ముందర పరీక్ష చేయించుకుని నెగెటివ్ ఉంటే ఏ వయసువారైనా వేయించుకోవచ్చు. ఆకలి తగ్గడం, వికారం, కామెర్లు, జ్వరం, కీళ్లనొప్పులు వంటి సమస్యలు ఉన్నప్పుడు చెట్ల వైద్యం, నాటు వైద్యం వంటి సొంతవైద్యాలు చేసుకోకుండా... కారణం తెలుసుకుని అవసరమైన చికిత్స తీసుకోవడం ఉత్తమం. లివర్ ఇన్ఫెక్షన్స్, ఫ్యాటీ లివర్, లివర్ యాబ్సెస్, విల్సన్ డిసీజ్, గిల్‌బర్ట్ సిండ్రోమ్ వంటి కాలేయ వ్యాధులున్నప్పుడు... హెపటైటిస్ బి, సి వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకితే... వాటి ప్రభావంతో కొన్నేళ్ల తర్వాత కాలేయం గాయపడినట్లుగా లేదా గట్టిగా మారడం (సిర్రోసిస్), అటు తర్వాత కాలేయ క్యాన్సర్‌కు దారితీయడం ఎక్కువమందిలో జరుగుతుంది.



కాలేయంలోనే మొదలయ్యే హెపాటో సెల్యులార్ కార్సినోమా అనే క్యాన్సర్... దేహంలో ఇతర ప్రాంతాల్లో క్యాన్సర్ వచ్చి అది కాలేయానికి పాకే మెటాస్టాటిక్ లివర్ క్యాన్సర్ అనే రెండు రకాలు ఉంటాయి. జీర్ణవ్యవస్థలోని క్యాన్సర్స్, బ్రెస్ట్‌క్యాన్సర్, లంగ్ క్యాన్సర్... ఇలాంటి ఏ క్యాన్సర్ అయినా కాలేయానికి పాకే ప్రమాదం ఎక్కువ. ఆలస్యంగా బయటపడే లివర్ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనదిగా పేర్కొనవచ్చు.

కాలేయ క్యాన్సర్ తొలిదశలో లక్షణాలు అంత తీవ్రంగా కనిపించకపోవడం వల్ల ఇతర సమస్యలుగా పొరబడే అవకాశం ఎక్కువ. కడుపునొప్పి, బరువు తగ్గడం, కామెర్లు, పొట్టలో నీరు చేరడం, వాంతులు, వికారం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు లివర్ క్యాన్సర్ ముదిరిన దశలో తీవ్రంగా ఉంటాయి. ఈ లక్షణాలు కనిపించినా... హెపటైటిస్ బి, సి వైరస్‌లు పాజిటివ్ ఉన్నా, మద్యం వంటి అలవాట్లు ఉన్నా... రక్తంలో ఎర్రరక్తకణాల సంఖ్యను, షుగర్, క్యాల్షియం, కొలెస్ట్రాల్, ఆల్ఫా ఫీటో ప్రొటీన్ (ఏఎఫ్‌పీ)ను రక్తపరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్, డాక్టర్ సలహా మేరకు ట్రిపుల్ ఫేజ్ సీటీ, ఎమ్మారై, పీఈటీ స్కాన్‌లు చేయించాలి. లివర్ బయాప్సీ చేయించడం వల్ల క్యాన్సర్, దాని స్టేజ్ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

ఈ క్యాన్సర్ పెరిగే గుణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో నెలలోపే గడ్డ (కణితి) సైజు రెట్టింపు అయితే... మరికొందరిలో ఏడాది పైగా తీసుకోవచ్చు. కణితిని చిన్న సైజులో ఉన్నప్పుడే గుర్తించినా... లివర్ సిర్రోసిస్‌కు గురికావడం వల్ల చాలామందిలో సర్జరీ కుదరకపోవచ్చు. ఇమ్యూనోథెరపీ, కీమోథెరపీ, ట్రాన్స్ ఆర్టీరియల్ కీమో ఎంబోలైజేషన్ (టీఏసీఈ), రేడియో అబ్లేషన్, ప్రోటాన్ బీమ్ థెరపీ, క్రయో అబ్లేషన్, స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ వంటి అనేక పద్ధతుల్లో కణితిని తొలగించే లేదా తగ్గించే ప్రయత్నాలు చేస్తారు. గడ్డ చిన్నగా ఉండి, మిగతా కాలేయం బాగానే ఉండి ఫెయిల్యూర్‌కు గురికాకుండా ఉంటే సర్జరీయే సరైన మార్గం. కణితి పరిమాణం పెద్దగా ఉన్నా, అనేక కణుతులు ఉన్నా, లివర్ ఫెయిల్యూర్‌కు గురవుతూ ఉంటే... కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించడంతో పాటు, గతంలో ఎప్పుడైనా ఇతర క్యాన్సర్స్‌కు గురయి, చికిత్స తీసకున్నా ఎప్పటికప్పుడు కాలేయానికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండటం చాలా మంచిది.

చాలామందిలో హెపటైటిస్–బి పాజిటివ్ ఉన్నా, ఏళ్లతరబడి ఎలాంటి లక్షణాలూ కనిపించకుండా ఆరోగ్యకరంగానే ఉండవచ్చు. కానీ వారి నుంచి ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుంది. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే ముందే పరీక్షలు చేయించుకోవడం, ఒకవేళ ప్రెగ్నెన్సీలో ఈ వైరస్ ఉన్నట్లు గుర్తించినట్లయితే పుట్టిన బిడ్డకు వెంటనే 12 గంటలలోపు హెపటైటిస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (హెచ్‌బీఐజీ) ఇప్పించడం మంచిది. ఒకవేళ ఈ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తితో కలిసి ఉన్నట్లు అనుమానం ఉన్నా, వాళ్ల రక్తం... శరీరంలో ప్రవేశించినట్లు అనుమానం ఉన్నా ముందుజాగ్రత్త చర్యగా ఆ సంఘటన జరిగిన 14 గంటలలోపే హెచ్‌బీఐజీ ఇంజెక్షన్ తీసుకుంటే హెపటైటిస్–బి పాజిటివ్ కాకుండా కాపాడుకోవచ్చు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,



యూపీ వారియర్స్ వైస్ కెప్టెన్‌గా దీప్తి శర్మ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే యూపీ వారియర్స్ జట్టు వైస్ కెప్టెన్‌గా భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మను నియమించారు. ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ అలీసా హీలీని ఇప్పటికే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌కే చెందిన దీప్తి శర్మ ఇప్పటి వరకు భారత జట్టు తరఫున 92 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడి 941 పరుగులు చేయడంతోపాటు 102 వికెట్లు పడగొట్టింది. 25 ఏళ్ల దీప్తి ప్రస్తుతం ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో నాలుగో స్థానంలో ఉంది.



ఐటీఎఫ్ టోర్నీలో రన్నరప్‌గా రష్మిక జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. గుర్‌గ్రామ్‌లో శనివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో మూడో సీడ్ రష్మిక–వైదేహి చౌదరీ (భారత్) జోడీ 2–6, 2–6తో రెండో సీడ్ జీల్ దేశాయ్ (భారత్)–పునిన్ కొవాపిటుక్‌టెడ్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో ఓడిపోయింది. సింగిల్స్ విభాగంలో రష్మిక పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది.

చాంప్స్ ఎన్ఆర్ఐ, సర్ సీఆర్ రెడ్డి కాలేజీలు

ముగిసిన ఆంధ్రప్రదేశ్ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



ఎస్‌పీఎల్ జూనియర్ విభాగంలో చాంపియన్‌గా నిలిచిన ఎన్ఆర్ఐ కాలేజ్ జట్టు

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ కాలేజి (విజయవాడ), సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి (ఏలూరు) జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ఎస్‌పీఎల్ టోర్నీ ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జల వనరుల శాఖ అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా హాజరై విన్నర్స్, రన్నరప్ జట్లకు నగదు పురస్కారాలు, ట్రోఫీలను అందజేశారు. చాంపియన్ జట్లకు రూ. 25 వేలు... రన్నరప్ జట్లకు రూ. 15 వేలు చొప్పున నగదు పురస్కారం లభించింది.

జూనియర్ విభాగం ఫైనల్లో ఎన్ఆర్ఐ కాలేజి 35 పరుగులతో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజి (విశాఖపట్నం)పై నెగ్గింది. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఆర్ఐ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 151 పరుగులు సాధించింది. రూపేష్ (60 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రేవంత్ (45 బంతుల్లో 62; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మెరిశారు. అనంతరం సాయి గణపతి కాలేజి 16.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఎన్ఆర్ఐ జట్టు బౌలర్లలో తరుణ్ 4 వికెట్లు, రేవంత్ 2 వికెట్లు పడగొట్టారు. రేవంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది.

సీనియర్ విభాగం ఫైనల్లో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి తొమ్మిది వికెట్ల తేడాతో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) జట్టును ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. మొదట సీకామ్ కాలేజి 19.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. శివ కార్తీక్ (51 బంతుల్లో 42 పరుగులు; 3 ఫోర్లు) రాణించాడు. సీఆర్ రెడ్డి కాలేజి బౌలర్ మనోజ్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అనంతరం సర్ సీఆర్ రెడ్డి కాలేజి 15.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 117 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' గగన్ కుమార్ (47 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), సంజయ్ (27 బంతుల్లో 23; 3 ఫోర్లు) రాణించారు. జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ కాలేజి ఆటగాడు రేవంత్... సీనియర్ విభాగంలో సీఆర్ రెడ్డి కాలేజి ఆటగాడు మనోజ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కించుకున్నారు.



ఎస్‌పీఎల్ సీనియర్ విభాగంలో టైటిల్ సాధించిన సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు

సఫారీల కల నెరవేరేనా?

దక్షిణాఫ్రికా దేశం మొత్తం ఆదివారం మునివేళ్లపైకి రానుంది. పునరాగమనం తర్వాత అటు పురుషుల క్రికెట్‌లో గానీ, ఇటు మహిళల క్రికెట్‌లో గానీ ఏ ఫార్మాట్‌లోనైనా సాధ్యంకాని రీతిలో ఈసారి టీమ్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. స్వదేశంలో సత్తా చాటి తుది పోరుకు వచ్చిన టీమ్ ఈ అవకాశాన్ని పోగొట్టుకోరాదని భావిస్తోంది. అయితే అటువైపు ఉన్నది సాధారణ జట్టు కాదు. ఐదుసార్లు చాంపియన్ కావడంతో పాటు ప్రొఫెషనలిజంతో ప్రత్యర్థులకు పాఠాలు చెప్పగల ఆస్ట్రేలియా. ఇలాంటి నేపథ్యంలో తమ అభిమానుల ముందు సఫారీ మహిళల కల నెరవేరగలదా?

- నేడు మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్
- ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ'
- సాయంత్రం గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టి20 ప్రపంచకప్‌తో దక్షిణాఫ్రికా కెప్టెన్ సునె లుస్, ఆస్ట్రేలియా కెప్టెన్ మెగ్ లానింగ్

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగే ఈ పోరులో తొలిసారి ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా తలపడనుంది. టోర్నీలో ప్రదర్శన, గత రికార్డు చూస్తే ఆసీస్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... సెమీస్‌లో ఇంగ్లండ్‌పై చూపిన స్ఫూర్తిదాయక ప్రదర్శన చూస్తే సఫారీ టీమ్‌లో కూడా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయినట్లుగా ఉంది. ఈ స్థితిలో పోరు ఏకపక్షమా, హోరాహోరీగా సాగుతుందా చూడాలి. ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు తుది పోరుకు చేరడంతో ఫైనల్ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడుపోయాయి.

సమష్టితత్వంతో...
టోర్నీలో ఆసీస్ ఆటతీరు చూస్తే ఆ జట్టు ఏ ఒక్కరిపైనో ఆధారపడలేదు. ప్రతీ ఒక్కరు పరిస్థితులకు తగినట్లుగా ఆడారు. బ్యాటింగ్‌లో అలీసా హీలీ, బెత్ మూనీ చెరో రెండు అర్ధ సెంచరీలతో ముందు వరుసలో ఉండగా... తాలియా మెక్‌గ్రాత్, కెప్టెన్ మెగ్ లానింగ్ కీలక సమయాల్లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లతో జట్టును నిలబెట్టారు. బౌలింగ్‌లో మెగాన్ షుట్ (9 వికెట్లు), డార్సీ బ్రౌన్, వేర్‌హమ్ (చెరో 6 వికెట్లు) ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఇద్దరు ఆల్‌రౌండర్లు గార్డ్‌నర్, ఎలీస్ పెర్రీ ఆసీస్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషించారు.

వారిద్దరే కీలకం...
టోర్నీ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అనూహ్యంగా శ్రీలంక చేతిలో ఓటమిపాలైంది. అమ్మాయిలంతా తీవ్ర విషాదంలో మునిగిపోగా, సొంత అభిమాలు కూడా ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఆ తర్వాత జట్టు ఆట ఒక్కసారిగా మెరుగైంది. ముఖ్యంగా తజ్మీన్ బ్రిట్స్ (176 పరుగులు), లౌరా వాల్‌వార్ట్ (169) బ్యాటింగ్ భారాన్ని మోశారు. అయితే మిగతా బ్యాటర్లు విఫలం కావడం జట్టు బలహీనతను చూపిస్తోంది. దీనిని ఫైనల్లో ఎలా అధిగమిస్తారనేది చూడాలి. బౌలింగ్‌లో ఖాకా, మరిజాన్ కాప్, షబ్నిమ్ ప్రదర్శన కూడా దక్షిణాఫ్రికా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

6 ఇరు జట్ల మధ్య 6 టి20లు మ్యాచ్‌లు జరగ్గా, అన్నీ ఆస్ట్రేలియానే గెలిచింది.

19 గత 20 అంతర్జాతీయ టి20ల్లో ఆస్ట్రేలియా 19 గెలిచింది.

జావెలిన్ నుంచి క్రికెట్‌కు...





ఇంగ్లండ్‌తో సెమీస్‌లో అర్ధ సెంచరీతో పాటు నాలుగు క్యాచ్‌లు పట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన దక్షిణాఫ్రికా ఓపెనర్ తజ్మీన్ బ్రిట్స్ క్రికెట్ ప్రస్థానం అసాధారణం. అడ్డంకులను అధిగమించి ఇక్కడి వరకు రావడం స్ఫూర్తిదాయకం. 2007 వరల్డ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జావెలిన్ త్రోలో బ్రిట్స్ స్వర్ణం సాధించింది. ఆపై ఇదే ఆటలో మరింత ముందుకు వెళ్లేందుకు పట్టుదలగా సాధన చేసింది. 2012 లండన్ ఒలింపిక్స్ లక్ష్యంగా ఆమె సన్నాహాలు సాగాయి. ఈ మెగా ఈవెంట్ కోసం ఆమె అప్పటికే అర్హత సాధించింది కూడా. అయితే దురదృష్టం బ్రిట్స్‌ను పలకరించింది. 2011లో జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. మూడు నెలల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. శరీరంలో వేర్వేరు భాగాలన్నీ దెబ్బ తినగా, మళ్లీ మళ్లీ శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చింది. ఎలాంటి మార్గనిర్దేశనం లేని ఆ సమయంలో ఆత్మహత్యకు కూడా ప్రయత్నించింది. అయితే చివరకు కోలుకున్న తర్వాత క్రికెట్ వైపు మళ్లింది. నడవలేని స్థితి నుంచి మళ్లీ మైదానంలోకి దిగింది. పట్టుదలతో సాధన చేసి దేశవాళీలో మంచి ప్రదర్శనతో సీనియర్ స్థాయి వరకు ఎదిగింది. 2018 టి20 వరల్డ్‌కప్‌లోనే చాన్స్ లభిస్తుందని అనుకున్నా, త్రుటిలో చేజారింది. ఇప్పుడు ఈసారి తానే ముందుండి జట్టును ఫైనల్ వరకు నడిపించింది. సెమీస్‌లో ఒక క్యాచ్ కోసం డైవ్ చేసినప్పుడు ఒక్కసారిగా ఆమెను పాత జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. అయితే ఎలాంటి గాయాలు కాలేదని తెలుసుకొని ఊరట పొందింది. సొంత గడ్డపై వరల్డ్‌కప్ ఫైనల్ ఆడబోవడం కలగా ఉందని, మరొక్క మంచి ప్రదర్శనతో ట్రోఫీ అందుకునే క్షణం కోసం ఎదురు చూస్తున్నట్లుగా తజ్మీన్ బ్రిట్స్ భావోద్వేగంతో చెప్పింది.

నన్ను 'విఫల కెప్టెన్'గా పరిగణించారు: కోహ్లి



న్యూఢిల్లీ: కెప్టెన్‌గా భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించినా... ఐసీసీ ఈవెంట్లకు వచ్చేసరికి మాత్రం విరాట్ కోహ్లికి ఏదీ కలిసి రాలేదు. నాలుగు ఐసీసీ ఈవెంట్లలో నాకౌట్ (2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్, 2019 వన్డే వరల్డ్ కప్ సెమీస్, 2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2021 టి20 వరల్డ్ కప్ లీగ్‌దశ) మ్యాచ్‌లలో టీమిండియా ఓటమి పాలైంది. దాంతో ఒక్క ఐసీసీ టోర్నీ విజయం కూడా లేకుండానే కోహ్లి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఐసీసీ టోర్నీల్లో సెమీస్, ఫైనల్ చేరినా సరే తనపై విఫల కెప్టెన్ ముద్ర పడిందని కోహ్లి వ్యాఖ్యానించాడు. 'టోర్నమెంట్‌లు గెలవడం కోసమే మనం ఆడతాం. అయితే నాలుగు ఐసీసీ టోర్నీలలో ప్రదర్శనను బట్టి నన్ను విఫల కెప్టెన్‌గా పరిగణించారు. నేను విజయాలు మాత్రమే అనే కోణంలో ఆలోచించలేదు. కొన్నిసార్లు ఫలితాలకంటే జట్టును తీర్చిదిద్దడం ముఖ్యం. ఆటగాడిగా నేను వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టు సభ్యుడిగా ఉన్నా. ఐదుసార్లు టెస్టు గద అందుకున్న టీమ్‌లోనూ భాగంగా ఉన్నా. అసలు ఏనాడూ ప్రపంచకప్ గెలవని వారూ ఉన్నారనే విషయం మరచిపోవద్దు. నేను గెలిచిన వాటి గురించి సంతోషిస్తున్నా తప్ప ఓడినవి గుర్తు చేసుకొని బాధపడే రకం కాదు. అన్ని ట్రోఫీలు ఇంట్లో ఉండాలనే అత్యాశ లేదు' అని కోహ్లి చెప్పాడు. తాను ఫామ్ కోల్పోయి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు మాజీ కెప్టెన్ ఎమ్మెస్ ధోని మాత్రమే తనకు అండగా నిలిచాడని కోహ్లి గుర్తు చేసుకున్నాడు. 'రెండుసార్లు ధోని మెసేజ్ చేసి అలాంటి సమయంలో ఎలా దృఢంగా ఉండాలో చెప్పాడు' అని కోహ్లి అన్నాడు.

ఇంగ్లండ్‌దే ఆధిపత్యం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజూ ఇంగ్లండ్ జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 315/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 8 వికెట్లకు 435 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ (186; 24 ఫోర్లు, 5 సిక్స్‌లు) తన ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు మరో రెండు పరుగులు జోడించి అవుటవ్వగా... జో రూట్ (153 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) తన జోరు కొనసాగించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 42 ఓవర్లలో 138 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్ (3/37), జాక్ లీచ్ (3/45) రాణించారు.

సినిమా


ఎండల్లో హాయ్ హాయ్..

ఏప్రిల్‌లో సినిమాల జోరు

వేసవి వస్తోందంటే సినిమాల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు స్నేహితులతోనో, కుటుంబ సభ్యులతోనో సినిమాకి వెళుతుంటారు. మండే ఎండల్లో కూల్ కూల్‌గా ఏసీ థియేటర్లో కూర్చుని సినిమాని ఆస్వాదిస్తుంటారు. అందుకే సమ్మర్ టార్గెట్‌గా ఎక్కువ సినిమాలు సిల్వర్ స్క్రీన్‌కి వస్తుంటాయి. ఈ ఏప్రిల్‌లో తొమ్మిది సినిమాలకుపైగా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అయితే 'మే'కి మాత్రం ఇప్పటికి విడుదల తేదీ ఖరారైన సినిమా ఒకే ఒక్కటి ఉంది. నాగచైతన్య 'కస్టడీ' మే 12న విడుదల కానుంది. మరి.. ఏప్రిల్‌లో విడుదల కానున్న చిత్రాలపై ఓ లుక్కేద్దాం...



★ 'ధమాకా' చిత్రంతో వంద కోట్ల క్లబ్‌లో చేరారు హీరో రవితేజ. దీంతో ఆయన నటిస్తున్న తర్వాతి సినిమా 'రావణాసుర'పై ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు న్నాయి. సుధీర్ వర్మ దర్శకత్వంలో రవితేజ, అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో రవితేజ లాయర్ పాత్రలో కనిపిస్తారు. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ కథానాయికలుగా నటిస్తున్నారు.




★ వైవిధ్యమైన కథలు, విలక్షణమైన నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు 'అల్లరి' నరేశ్. వినోదాత్మక చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన ఆయన 'నాంది', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' వంటి చిత్రాల్లో సీరియస్ రోల్స్‌లో నటించారు. ప్రస్తుతం నరేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఉగ్రం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మిర్నా మీనన్ హీరోయిన్. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ మూవీని ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు మేకర్స్.



★ నటుడు, కొరియోగ్రాఫర్, డైరెక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా నటించిన చిత్రం 'రుద్రుడు'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. కదిరేశన్ స్వీయ దర్శకత్వంలో ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పీ పతాకంపై రూపొందిన ఈ తమిళ చిత్రం తెలుగు, కన్నడ, మలయాళంలోనూ విడుదల కానుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాని గత ఏడాది డిసెంబర్ 23న విడుదల చేస్తామని చిత్రయూనిట్ ప్రకటించినా వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడంతో రిలీజ్ కాలేదు. ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు కొత్త డేట్ ప్రకటించింది యూనిట్.

★ సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న 15వ చిత్రం 'విరూపాక్ష'. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్న ఆయన ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర–సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 21న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. 1990 నేపథ్యంలో ఫారెస్ట్ బేస్డ్ విలేజ్‌లో జరిగే కథాంశంతో ఈ మూవీ రూపొందుతోందని సమాచారం.





చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. మరి ముందుగా ప్రకటించినట్లు ఏప్రిల్ 14న 'భోళా శంకర్' రిలీజ్ అవుతుందా? మరో కొత్త డేట్‌ని అనౌన్స్ చేస్తారా? అనేది తెలియాలంటే వేచి చూడాలి.



★ అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఏజెంట్'. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాక్షీ వైద్య కథానాయికగా చేస్తున్నారు. రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ మూవీ కోసం సిక్స్‌ప్యాక్ దేహం, పొడవాటి హెయిర్ స్టైల్‌తో స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు అఖిల్. పారిస్‌లో చిత్రీకరించే ఓ ఫైట్‌తో ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుందని తెలిసింది.



★ ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన హిస్టారికల్ మూవీ 'పొన్నియిన్ సెల్వన్ (పీఎస్–1)'. కల్కి కృష్ణమూర్తి రాసిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా ఈ సినిమాను తీశారు మణిరత్నం. తొమ్మిదో శతాబ్దం నాటి చోళ సామ్రాజ్యం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యా రాయ్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ నిర్మించిన ఈ చిత్రం తొలి భాగం 'పీఎస్ 1' గత ఏడాది సెప్టెంబర్ 30న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైంది. తెలుగులో నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేశారు. మలి భాగాన్ని ఏప్రిల్ 28న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటిస్తూ చిత్రయూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది.



సమంత లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శాకుంతలం'. ప్రముఖ కవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ గుణశేఖర్. శకుంతల, దుష్యంత మహారాజు అజరామరమైన ప్రేమకథను ఈ మూవీలో చూపిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా విడుదల ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడి ఫైనల్‌గా ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



★ తెలుగు చిత్ర పరిశ్రమకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు పంజా వైష్ణవ్ తేజ్. 'కొండపొలం', రంగరంగ వైభవంగా' తర్వాత తన నాలుగో చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో చేస్తున్నారు వైష్ణవ్ తేజ్. శ్రీకాంత్ రెడ్డి దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం గత ఏడాది జూన్‌లో ప్రారంభమైంది. తన కెరీర్‌లో తొలిసారి మాస్, యాక్షన్ మూవీ చేస్తున్నారు వైష్ణవ్ తేజ్. ఈ సినిమా ఏప్రిల్ 29న బాక్సాఫీస్ బరిలో నిలుస్తోంది.



● కార్తికేయ, ఎమ్ఎమ్ కీరవాణి, ఎస్ఎస్ రాజమౌళి, సెంథిల్ కుమార్, రామ్‌చరణ్

హెచ్‌సీఏ అవార్డ్సులో సత్తా చాటిన ఆర్ఆర్ఆర్

అంతర్జాతీయ వేదికపై 'ఆర్ఆర్ఆర్' సినిమా మరోసారి సత్తా చాటింది. 'హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్'(హెచ్‌సీఏ) ఆరవ ఎడిషన్ అవార్డుల ప్రదానోత్సవం కాలిఫోర్నియాలో జరిగింది. ఇందులో 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఐదు అవార్డులు (బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ స్టంట్స్, స్పాట్ లైట్ అవార్డు విభాగాల్లో..) సొంతం చేసుకుంది. కాగా గత ఏడాది డిసెంబరులో ప్రకటించిన స్పాట్‌లైట్ అవార్డును ఈ వేదికపై అందుకున్నారు 'ఆర్ఆర్ఆర్' టీమ్. కాగా ఈ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం అత్యధికంగా ఏడు అవార్డులు సాధించడం విశేషం.

'హెచ్‌సీఏ' అవార్డుల ప్రదానోత్సవంలో రాజమౌళి మాట్లాడుతూ –''ఈ గుర్తింపు నాకు, మా చిత్రానికే కాదు.. భారతీయ చిత్రపరిశ్రమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇండియాలో ఉన్న ఫిల్మ్‌మేకర్స్ అందరూ కూడా అంతర్జాతీయ స్థాయి సినిమాలను తీయగలరనే నమ్మకాన్ని ఈ అవార్డు (బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్) కలిగిస్తోంది. 'ఆర్ఆర్ఆర్' కోసం స్టంట్ కొరియోగ్రాఫర్ సాల్మన్ ఎంతగానో కష్టపడ్డారు. స్టంట్ కొరియోగ్రాఫర్స్‌కి కూడా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసి అవార్డులు అందిస్తే బాగుంటుంది''అన్నారు. హీరో రామ్‌చరణ్ మాట్లాడుతూ– ''ఈ అవార్డుతో మా బాధ్యత పెరిగింది. మిమ్మల్ని అలరించే మరిన్ని మంచి చిత్రాలు చేస్తాం'' అన్నారు. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' అవార్డును స్వీకరించిన కీరవాణి మాట్లాడుతూ–''నాటు నాటు..' పాటకు అవార్డు అందించిన హెచ్‌సీఏకు థ్యాంక్స్'' అన్నారు.

సారీ చెప్పిన హాలీవుడ్ నటి
హెచ్‌సీఏ అవార్డుల ప్రదానోత్సవానికి నటి, రచయిత, స్టాండప్ కమెడియన్ టిగ్ నొటారో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అవార్డు ప్రెజెంటర్‌గా రామ్‌చరణ్‌ను వేదికపైకి పిలిచే సమయంలో పేరు పిలవడంలో ఇబ్బంది పడినందుకు ఆయనకు క్షమాపణలు చెప్పారు టిగ్ నొటారో.



కొత్త ఇంటికి!

హీరో మహేశ్‌బాబు కొత్త ఇంటికి వెళ్లనున్నారట. అయితే ఇది ఆయన నటిస్తున్న తాజా చిత్రం కోసమే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో షురూ కానుందని తెలిసింది. ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాష్ వేసిన ఓ ఇంటి సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారని సమాచారం.

● మహేశ్‌బాబు



● మీనా, రాజేంద్ర ప్రసాద్

మామ.. అల్లుడు వస్తున్నారు

సోహెల్, మృణాళిని జంటగా రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వం వహించారు. కె.అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమాని మార్చి 3న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఫ్యామిలీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది.

రాజకీయ నేపథ్యంలో...



● జీవీ నాయుడు, శ్యాం ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, మాధవ్

ప్రముఖ హిందీ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి 'నేనెక్కడున్నా' సినిమాతో టాలీవుడ్‌కి హీరోగా పరిచయమవుతున్నారు. మాధవ్ కోదాడ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సశా ఛెత్రి హీరోయిన్. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, పోస్టర్, టీజర్‌ని నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు విడుదల చేశారు. ''జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో వస్తున్న థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు మాధవ్ కోదాడ. ''త్వరలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి.



● రితికా సింగ్, హర్ష వర్ధన్

క్రైమ్ థ్రిల్లర్

రితికా సింగ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఇన్ కార్'. హర్ష వర్ధన్ దర్శకత్వంలో అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదల కానుంది. రితికా సింగ్ మాట్లాడుతూ–''ఈ మూవీలోని నా పాత్ర కోసం షూటింగ్ పూర్తయ్యే వరకు నేను తల స్నానం చేయలేదు'' అన్నారు. ''సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'' అన్నారు హర్ష వర్ధన్. ఈ చిత్రానికి కెమెరా: మిథున్ గంగోపాధ్యాయ.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



విశ్వబ్రాహ్మణ్/కట్నం ప్రసక్తిలేదు / B.E / C. Govt. డిప్యూటీ మేనేజర్ / SBI బ్యాంక్/ 70,000/-pm / 5'11" ఎత్తు / 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10333]

గౌడ/B.Tech/ Govt. ట్యాక్స్ Asst./ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept./ 60,000/-pm/ 5'11" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10333]

SC హిందుమాల/కట్నం ప్రసక్తిలేదు/ M.Tech/ C.Govt. లోకోపైలట్/ రైల్వేస్/ 80,000/-pm/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10333]

SC హిందుమాదిగ/M.Tech / IIT/ C.Govt. Asst. మేనేజర్/IOCL/ 1,25,000/-pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10333]

యాదవ/M.Tech/ C.Govt. Manager/ (SBI)/ 1 Lakh pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10335]

మాల క్రిస్టియన్/M.Tech/ C.Govt. Income Tax Inspector/ 1 Lakh pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10335]

మాల హిందూ/M.Tech/ C.Govt. Asst. Engineer (HPCL)/ 80,000/- pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10335]

2వ పెళ్లి/50 yr/ కుల పట్టింపులేదు/ M.Sc Ph.D/ Govt. (ప్రిన్సిపాల్) 2 లక్షలు (pm) & 2 సొంత స్కూల్స్ 5 లక్షలు (pm) పిల్లలులేని తెల్లని వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. (పిల్లలు ఉన్నా Ok). సంప్ర: 7658975851 [H-793375]

మాదిగ Software,29, దుబాయ్ లో జాబ్, 50 లక్షల దాకా జీతం సంవత్సరానికి, హిందూ మతం, మంచి కుటుంబం అబ్బాయికి తగిన వధువు కావాలి. Whatsapp: 6304826162. [HA-10332]

SC Caste/ 35 yrs/ 5'9"/ MBA/ కలర్: Fair/ Govt. జాబ్/ 80K per month. వెల్‌సెటిల్డ్ వరునికి వధువు కావలెను. Ph: 7995825318 [H-793710]

ST లంబాడి/24yr/ 5'10"/ B.Tech & 27yr/5'10"/Ph.D ఉస్మానియా యూనివర్సిటీ, Fair (గ్రూప్ 2 Govt. Job) వరులకు తగిన అందమైన వధువులు కావలెను. సంప్ర: 8688671906 [H-793710]

కాపు/41/5'11" (Un Married Govt. ఆఫీసర్ 75,000/-(PM) దృష్టిలోపం) గల వరునికి వివాహం ఆలస్యమైనా 30yr's పై బడిన హిందూ వధువు కావలెను (నో -బ్రోకర్స్) Ph: 9177904999 [H-792978]

యాదవ/ఆస్ట్రేలియాలో MS చదువుతున్న వరుడికి B.Tech/M.Tech/MBA/MCA/ హోటల్ మేనేజ్‌మెంట్/BDS వధువు కావలెను. ఫోన్: 9441039962. [H-13865]

2వ పెళ్ళి: 50Y దాటిన Govt, Pvt, పెన్షనర్స్ వెల్‌సెటిల్డ్ వరులకు తగిన వధువులు కలరు. సంప్ర: 8340059430. [H-13865]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Business/B.Tech/1997/5'11"/ 100Cr. *1995/5'9"/250Cr. *1994/5'11"/ 250 Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau -Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/Business/Hyd/B.Tech/MBA/ 1995/6'/100Cr. *1995/6'/50Cr. *1990/ 6'/1000Cr. * Cont : K.C. Reddy-Mar-Bur- Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/MBBS/MD/1995/5'10"/300Cr. *1994/DM(Card)/5'10"/75Cr. *1993/DM (Gastro)/5'10"/50Cr. *MCH/1989/5'9"/30Cr. *Cont: K.C. Reddy -Hyd. Ph: 9849321309

Reddy/MBBS/USA-Doc. *1989/5'10". *1992/5'11". *1994/5'9". *1991/5'10". *1990 / 5'10". *Cont: K.C. Reddy- Mar-Bureau- Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1995/5'7"/300K/10Cr. *1995/5'10"/260K/70Cr. *1992/ 5'11"/495K/10Cr. * Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Australia/PR/1996/6'/25Cr. *1994/5'11"/50Cr.*1991/5'10"/30Cr. * UK/ 1994/5'11"/1.5Cr/yr/10Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business/BE(BITSPILANI)/1993/ 5'7"/50Cr. *1990/5'10/100Cr. 1989/5'7"/100Cr. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Rich.* 1991/ 5'10"/300K/40Cr. *1995/ 5'10"/70Cr. *1995/6'/200Cr. *1991/ 5'11"/140K/ 200Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309

Reddy/Software Company/1988/5'11"/ B.Tech/1000Cr. *1993/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph:9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/MBA/1994/5'10" /300Cr. *B.Tech IIT/H1/USA/200K/ 1992/6'/ 20Cr. *MBBS/MD/ 1985/ 5'8"/50Cr.*Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/CATHOLIC/Beautiful/B.Tech/ MS/Business-Hyd/1993/5'3"/1000Cr- Hyd. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Business family. *1995/ 5'5"/ 70Cr. *1994/5'6"/100Cr. *1995/ 5'8"/ 100Cr. *1997/5'4"/100Cr. *1994/5'3"/200Cr. *Cont: K.K. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/BBA/MBA/1998/5'4"/25Cr. *B.Tech/1994/5'6"/10Cr. *M.Tech/1997/5'5"/ 25 Cr. * 1999/ 5'8"/15Cr. *1996/5'6"/40Cr. *Cont: K.C. Reddy- Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech(IIT)/BITS *1994/5'4"/10Cr. * 1996/5'4"/10Cr. *1996/5'7"/53L/yr. *1996/ 5'4"/ 5cr. *1990/5'8"/160K. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/Rich. *1995/ 5'5"/100 Cr. *1995/5'3"/50Cr *1996/5'6"/ 60Cr * 1993/5'7"/100Cr *1995/5'7"/20Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/MBBS/USA-Doc *1997/ 5'7"/50 Cr*1992/5'4"/50Cr*1987/5'4"/10Cr*1995/ 5'1" *1992/5'5" *1996/5'8"/ 40Cr. * Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/Rich *1997/ 5'5"/10Cr *1996/5'8"/15Cr *1997/5'8"/12Cr *1996/5'7"/50Cr *1996/5'5"/10Cr. *Cont: K.C. Reddy - Hyd- Ph:9849321309

Reddy/MS/USA/Rich/1998/5'4"/30Cr. *1996/5'5"/12Cr *1996/5'9"/100Cr *1994/ 5'4"/ 10Cr. *Cont: K.C. Reddy-Mar-Bur- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Rich Family *B.Tech/MBBS/ 1988/5'3"/200Cr *1998/5'5"/100Cr* 1997 /5'6"/400Cr*1994/5'7"/1500Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

Reddy/Divorcee/MS. *1993/5'7"/15Cr *CA/ 1989/ 5'5"/25Cr *1985/5'5"/400Cr *1993/ 5'6"/50Cr *MD/1994/5'5"/50Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309

[D-522]

CNB, రెడ్డి/36/6'/B. టెక్, MS/మైనింగ్ & బిజినెస్/స్టేట్ పొలిటికల్ లీడర్/కోట్ల స్థిరాస్తి గల వరుడికి మంచి అందము, చదువు గల వధువు కావలెను. ఫోన్:9247217621, 8885073555. [H-13865]

SC మాదిగ/B.Tech (EEE)/C.Govt. బ్యాంక్ మేనేజర్/యూనియన్ బ్యాంక్/65000/-PM/5'8" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. ఫోన్: 9703978131. [H-13865]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/M.Tech /Govt. A.E/ఇరిగేషన్ Dept/70,000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 6309258463. [H-13865]

రజక/B.Tech / C.Govt.Asst. మేనేజర్/ SBI / 82000/-PM / 5'10" ఎత్తు /28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9515942275. [H-13865]

యాదవ/B.Tech/C.Govt. Jr ఇంజనీర్ / పవర్ గ్రిడ్/ 1 లక్ష PM/5'8" ఎత్తు/ 29 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 8897389698. [HA-13822]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/B.Tech/ Govt.Sr.Asst. రెవెన్యూ Dept/ 50,000/- PM/5'7" ఎత్తు/35 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9963757612. [HA-13822]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. బ్యాంక్ మేనేజర్/ఆంధ్రా బ్యాంక్/80,000/- PM/ 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 8341650195. [HA-13822]

SC క్రిస్టియన్ మాల/B.Tech (EEE)/ Govt. Jr. ఇంజనీర్/రైల్వే/ 65000/-PM/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను కట్నం ప్రసక్తి లేదు. ఫోన్: 9676995093. [HA-13822]

డైరెక్ట్/38/5.5/M.com,B.Ed ప్రైవేట్ జాబ్ చేయుచున్న వరుడికి కుల, వయసు, ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. ఇల్లరికం అయినా OK. డైరెక్ట్ : 85199 34926 [L-794261]

SC హిందూ మాదిగ : B.Tech. / Software Engineer / 1,30,000/- PM. / 5.4 ఎత్తు /27 సం॥లు / అందమైన వరుడికి వధువు కావలెను. కుల పట్టింపు లేదు. నో బ్రోకర్స్. సెల్ : 99924 25290. [M-8954]

SC Mala/Hindu/2nd Marriage/38Y/ 5'10/PG/SWE 1 Lakh PM. Seeks good Looking bride (Urgently) Cont: 8187861989. No Brokers. [HA-796864]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 31, 5'11", SWE, H1, 180 K, 28 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 6', Developer, 150 K, H1, 4.5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'8", SWE, H1, 140 K, 6 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 25, 6', SWE, 9 L P/A, 6 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE BITS, MS, 26, 5'8", 120 K, SWE, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 23, 5'6", Hyderabad, Rich Family, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 5'4", Analyst, 150 K, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA, BE, MS, 28, 5'7", Developer, 84 K, H1, 7 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Australia, BE, MS, 29, 5'8", Analyst, 90 K, 5 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, MBA, 31, 6', SWE, 180 K, H1, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA, BE, MS, 28, 5'9", Analyst, 135 K, H1, 8 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 33, 6', SAP, 17.8 L P/A, Rich, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5'6", SWE, 12 L P/A, 2 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5'6", Doctor, 10 Crores, Hyd, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5'4", SWE, 200 K, 2 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 30, 5'4", SWE, 11 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

[LETTER]

★


38 Years Boy Divorced (Issues Less) Working as a Software Engineer 45 LPA resident of Hyderabad is looking for suitable match (Caste No Bar) (080-69072068). [HA-9801]

33 Years (Doctor) Reddy, resident of Hyderabad is looking for suitable Dr. match (Caste No Bar) (080-69072068). [HA-9802]

కాపు/30yrs/ 5'4"/ కలర్: Fair/ Govt. జాబ్/ 75K per month, ఇల్లరికం అయినా Ok, వధువుకి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. No Caste Bar. Ph: 8500427582 [H-793710]

క్రిస్టియన్ మాల/60 లక్షల ఆస్తి/ B.Tech / Govt. Asst. ఇంజనీర్/RWS/ 50,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10333]

వరుడు కావలెను



No Caste bar/1,2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph:W: 7794960803 [H-796811]

2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/ 35 yrs/MBA సెంట్రల్ Govt. ఆఫీసర్ 3 లక్షలు (pm) 15 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్న Ok) సంప్రదించండి: 7396213324 [H-793375]

యాదవ/B.Tech / C. Govt. Scientist (DRDO)/ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10335]

మాల క్రిస్టియన్/B.Tech / C. Govt. Asst. Manager (Canara Bank)/ 50,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10335]

2వ పెళ్లి/35 yrs/ కుల పట్టింపులేదు/ Govt. ఎంప్లాయ్/ 2,25,000/-(pm) బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా Ok) సంప్రదించండి: 9502046384 [H-793375]

రెడ్డి/46 yr/ కుల పట్టింపులేదు/ ఫైఇయర్/ Govt. ఎంప్లాయ్/ 1 లక్ష (pm) వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 9492081545 [H-793375]

కాపు/40 yr/ 5'9"/ కుల పట్టింపులేదు/ ఫైఇయర్/ M.Com/ Govt. ఎంప్లాయ్/ 85K (pm) వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు & ల్యాండ్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం Ok) సంప్ర: 8008474869 [H-793375]

ముదిరాజ్: CA/C.Govt.P.O/పంజాబ్ నేషనల్ బ్యాంక్/54,000/-P.M.,5'-5" ఎత్తు. 25 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9908222406. [HA-10332]

రెడ్డి: విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు, A:30, Q: డిగ్రీ, బిజినెస్సులు గల అందమైన వధువుకు వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 9100717575. [HA-10332]

ఆర్యవైశ్య/22y/ 5'4"/ 40 వేలు/ 30 లక్షలు & 27y/5'3"/ 30 వేలు/ 25 లక్షలు & రెండో పెళ్లి/34y/5'1"/ 45 వేలు/ 35 లక్షలు & 45y/5'2"/50 వేలు/ 65 లక్షలు/ జి. సుబ్రహ్మణ్యం/ "మానేపే". PH/WA: 9291503949 [H-793710]

SC మాల హిందూ/25/5'4"/B.Tech/ ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్/Hyd, 60K per month చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-793710]

FC/విడో/60y/Fair/B.Pharmacy/5'3"/Own Medical Shop/Own House/3 ఎకరాల తోటలు గల సాంప్రదాయమైన వధువుకి కులపట్టింపులేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9390246497 [H-792978]

FC/విడో/60y/Fair/V.ఫైఇయర్/5'4"/సొంత ఇల్లు & రెంట్స్/ House Wife/50 K (PM) / 2 ఎకరాల పంట పొలం గల వధువుకి కులపట్టింపు లేని మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 9059570854 [H-792978]

SCమాల/24/5'5"/Fair/B.Tech(NIT) Preventive officer in Customs 50,000/-(PM) అందమైన Well Settled వధువుకి తగిన వరుడు కావలెను. Any Software or Govt.Job. Ph: 9059470587 [H-792978]

రెడ్డి/Widow/48y/Govt.Job/VRS/on 60KOwn House /OwnBusiness/Granites Marble Business /15ఎ॥ పొలం Lands PV. 5Laks/ కోట్ల ప్రాపర్టీ ఉన్న ఒంటరి వధువుకు FC/BC వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా OK) Ph: 9177631661 [H-792978]

క్రిస్టియన్/2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/ B.Tech/Govt. Sr.Asst/R & B/45000/-PM/ 5'4" ఎత్తు/30 సం॥ల పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను.ఫోన్: 9550650024. [H-13865]

పద్మశాలి/ B.Tech/SWE/Hyd/40,000/- PM/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్: 9908209244. [H-13865]

క్రిస్టియన్ మాల /B.Tech/C.Govt. Asst. మేనేజర్ కెనరా బ్యాంక్/50,000/-PM /5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 6309258463. [H-13865]

రెడ్డి/49Y/MRO/సొంత పెట్రోల్ పంపు/18 Acres Land/15 LAC Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 8885924657. [HA-793281]

తెలగ కాపు/విడో/60Y/ తక్కువ చదువు /2 ఇళ్ళు కొద్దిగా వ్యవసాయం కల ఒంటరి వధువుకు కుల ప్రసక్తిలేని స్నేహ స్వభావం కల వరుడు కావలెను. ఫోన్: 9948402716. [HA-793281]

రెడ్డి/విడో/49Y/5'5"/V.Fair/Govt Job/ సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ ఆంధ్రాలో పొలాలు కలిగిన పిల్లలులేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. ఫోన్:7093717220. [HA-793281]

వైశ్య/53Y/Degree/VRS/ సొంతషాప్ & సొంత ఇల్లు / 5 ఎకరాల పొలం కల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9121433952. [HA-793281]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ *28/5'3"/BSC *28/ 5'4"/BBM *27/5'2"/హోటల్ మేనేజ్‌మెంట్ వధువులకు వరులు కావలెను కట్నం ప్రసక్తి లేని వారు సంప్ర:జాబ్, పురోహితం అయినా Ok ఫోన్: 7893005879. [HA-13822]

యాదవ/B.Tech(సివిల్)/C.Govt. Asst. మేనేజర్/బ్యాంక్ ఆఫ్ బరోడా/45000/- Pm/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9515755529. [HA-13822]

క్రిస్టియన్ మాదిగ/MBBS & DNB/డాక్టర్/ Govt/5'4" ఎత్తు/33 సం॥ల అందమైన వధువుకు MD/DNB/ డాక్టర్/Any ఎంప్లాయి వరుడు కావలెను. ఫోన్: 9515755529, 9912280929. [HA-13822]

వడ్డెర/B.Tech(సివిల్)/M.Tech, IIT/Govt. A.E.E/ఇరిగేషన్ Dept/65000/-Pm/5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618579861. [HA-13822]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ *28/5'2"/BSC *30/ 5'3"/ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను.జాబ్, బిజినెస్ Ok పురోహితులకు సం॥ధాలు కలవు ఫోన్: 7815999246. [HA-13822]

రజక/ఏకైక కుమార్తె/B.Tech/Govt. Asst. ఇంజనీర్/మున్సిపల్ Dept/50,000/-PM/5'3" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8897389698. [HA-13822]

కుల ప్రసక్తి లేదు/విడో/48Y/పెట్రోలియం & నేచురల్ గ్యాస్ Dept 1L PM/Own House/ 21 ఎ॥ ల్యాండ్స్/కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9701385407. [HA-796864]

రెడ్డి/విడో/48Y/Hyd/MBBS Doctor/Own Complex (Rents) పిల్లలు లేని/Well Settledవ బాధర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (సపోర్ట్ ఉండును). ఫోన్: 8519803423. [HA-796864]

బ్రాహ్మణ/2వ పెళ్ళి/ 27/5'2"/ 10th/ పిల్లలు లేరు/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. జాబ్/బిజినెస్ OK. సంప్ర: 9701743336 [HA-13823]

SC మాల క్రిస్టియన్, వయస్సు 32 సం॥ H.5'4" M.Pharmacy, ఫార్మసీ కంపెనిలో జాబ్ సం॥కి 10లక్షలు జీతం, వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ కావలెను. డైరెక్ట్ : 77949 11019 [R-1668]

★

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్: 7013362957 [HA-13817]

వేదికలు



ఒకసారి మాత్రమే పెళ్ళి ప్రకటన ఛార్జ్ చెల్లించి BridesGrooms.in ద్వారా మీరు కోరుకున్న Match ని పొందండి. ప్రతి ప్రొఫైల్ Verified. మొదటి పెళ్లి ప్రొఫైల్స్ లిస్టింగ్ ఫ్రీ. ఫోన్: 9985918686, 6304826162. [HA-10332]

క్రిస్టియన్ అందరికి సాఫ్ట్ వేర్, గవర్నమెంట్, డాక్టర్స్, జాబ్స్, ఉన్నత RC, ప్రొటెస్టెంట్, మాల, మాదిగ, అన్ని కులాల కన్వర్టెడ్ లోకల్, విదేశీ Matches కలవు. ఫోన్: 6301972030. [HA-10332]

కావ్య మ్యారేజ్‌లింక్స్:1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడోస్ విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులములవారికి త్వరగా చూపబడును. ఫోన్: 8074670989. [HA-796864]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13872]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13872]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13872]

Kamma -Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13872]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam Ph: 7093969457/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13872]

క్షత్రియ కళ్యాణవేదిక రాజులకు ప్రథమ, ద్వితీయ, లేటు, సూర్యవంశ, చంద్రవంశ, క్షత్రియ సంబంధాలు అతి త్వరగా కుదుర్చబడును ఇందుకూరి దేవి ఫోన్: 9949178816. [H-13865]

నమో వెంకటేశాయ! డాక్టర్స్, ఇంజనీర్స్, గ్రూప్ 1& 2, అబ్రాడ్, 1,2 పెళ్ళి సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-454]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM / Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd లేట్/విదేశ సంబంధాలకై సం॥ S.వాణుల గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారదాగౌడ్, Ph: 8790690309 [H-793278]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజీ దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-796864]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-793281]

★

మాదిగ వివాహ పరిచయవేదిక. ప్రతి శని, ఆదివారాలు, 12-6PM, ముందుగా మీ ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి. # సికింద్రాబాద్ స్టేషన్, బ్లూసీ బ్యాక్. 9347046175 [H-793265]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsap No.) [HA-937]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-906]

బీబీనగర్ ఎయిమ్స్‌పై కేంద్రం చిన్నచూపు!

2024 నాటికి పూర్తి కావాల్సిన నిర్మాణం

- కేటాయించిన నిధులు రూ.1,365.95 కోట్లు.. విడుదలైంది రూ.156.01 కోట్లు
- 2014 తర్వాత కేంద్రం మంజూరు చేసింది 16 ఎయిమ్స్‌లు
- స్థలాలు కేటాయించని బిహార్, హరియాణా మినహా.. అన్ని ఎయిమ్స్‌లకు భారీగా నిధులు
- ఆర్టీఐ సమాచారంలో స్పష్టం చేసిన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న రాజకీయ విభేదాలు వివిధ రంగాలపై ప్రభావం చూపిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ప్రత్యేకంగా నిధుల విడుదలకు సంబంధించి ఇది స్పష్టంగా కనిపిస్తోందని పరిశీలకులు అంటున్నారు. రాష్ట్రానికి మంజూరు అయిన బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు నిధుల విడుదలలో కేంద్రం చిన్న చూపు చూస్తోంది. సమాచార హక్కు చట్టం కింద ఇనగంటి రవికుమార్ అనే యాక్టివిస్టు సమాచారం కోరగా.. కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉప కార్యదర్శి అజయ్‌కుమార్ లిఖిత పూర్వక సమాచారం ఇచ్చారు. 2024లో బీబీనగర్ ఎయిమ్స్ పూర్తి కావాల్సి ఉన్నా.. దీనికి ఇప్పటి వరకు కేవలం 8.75 శాతం మాత్రమే నిధులు విడుదల చేశారు. కేంద్రంలో 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివిధ సంవత్సరాల్లో మొత్తం 16 అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ 16 ఎయిమ్స్‌లలో బిహార్‌లోని దర్భంగా, హరియాణాలోని మనేథిలలో ఆస్పత్రుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి వరకు కేంద్రానికి అప్పగించలేదు. అలాగే తమిళనాడులోని మదురైలో ఎయిమ్స్ నిర్మాణం పూర్తిగా జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా)నిధులతో చేపట్టాలని నిర్ణయించడం వల్ల ఆ నిధుల మంజూరులో ఆలస్యం కావడంతో విడుదల కాని పరిస్థితి నెలకొంది.

నిమ్స్ భవనాలను ఇచ్చినా..

బీబీనగర్‌లో నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విస్తరణ కోసం నిర్మాణం చేసిన భవనాలను ఎయిమ్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వం బదలాయించింది. అయితే ఇక్కడ మరిన్ని భవనాల నిర్మాణంతో పాటు, జాతీయ స్థాయిలో పేరున్న విజ్ఞాన సంస్థను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధుల విడుదలలో విపరీతమైన జాప్యం చేస్తుండడం గమనార్హం. 2018 సంవత్సరంలో నాలుగు ఎయిమ్స్‌లను ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నాలుగు ఎయిమ్స్‌లలో బీబీనగర్ (తెలంగాణ), మధురై (తమిళనాడు), బిలాస్‌పూర్ (హిమాచల్‌ప్రదేశ్), దేవఘర్ (జార్ఖండ్) ఉన్నాయి. అయితే బిలాస్‌పూర్ ఎయిమ్స్‌కు రూ.1,471 కోట్లు కేటాయించగా.. అందులో రూ.1407.93 కోట్లు విడుదల చేయడంతో నిర్మాణం దాదాపు 98 శాతం పూర్తయింది. అలాగే దేవఘర్ ఎయిమ్స్‌కు రూ.1,103 కోట్లు కేటాయించగా.. రూ.713 కోట్లు విడుదల చేసింది. అదే బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.1,365 కోట్లు కేటాయించగా రూ. 156.01 కోట్లు మాత్రమే విడుదల చేయడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మొత్తం 16 ఎయిమ్స్‌లలో ఏడు ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో నాలుగు ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతాయని కేంద్రం వెల్లడించింది. ఇందులో వైద్య కళాశాల, ఆస్పత్రి, ఉద్యోగుల నివాస సముదాయాలు, పరికరాలు అన్నీ అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. బీబీనగర్ ఎయిమ్స్ మొదట రూ.1,028 కోట్లు మంజూరు చేసి, 2022 అక్టోబర్ నాటికి పూర్తిచేయాలని భావించారు. కానీ నిధులు కేటాయింపులో జాప్యంతో దీనిని 2024 చివరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అంచనా వ్యయం కూడా రూ.1,365 కోట్లకు చేరింది. కాగా, ఇప్పటికే నిమ్స్‌కోసం నిర్మించిన భవనాలు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఔట్‌పేషంట్ సేవలు మాత్రం అక్కడ కొనసాగుతున్నాయి. కేంద్రం తెలంగాణకు ఎయిమ్స్‌ను మంజూరు చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబర్‌లో వంద ఎకరాల స్థలంతోపాటు, నిమ్స్ భవనాలను కేంద్రానికి అప్పగించింది. అయినా ఇక్కడ ఎయిమ్స్ అభివృద్ధిలో పురోగతి లేదని విమర్శలు వస్తున్నాయి.

టీఎస్ బీపాస్ ద్వారా ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్

ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటే భూ వినియోగపత్రం స్వీకరించే వెసులుబాటు

ట్విట్టర్‌లో ప్రకటించిన స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్

సాక్షి, హైదరాబాద్: నగరాలు, పట్టణాల్లో భూములను కొనుగోలు చేసిన వారికి ఉపయోగపడేలా ల్యాండ్ యూజ్ స్టేటస్‌ను తెలుసుకునే విధానాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ అందుబాటులోకి తెచ్చింది. భూ కొనుగోలుదారులు తాము కొనుగోలు చేసిన భూమి మాస్టర్ ప్లాన్‌లోని ఏ కేటగిరీ పరిధిలో ఉందో టీఎస్-బీపాస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించింది. ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ (భూమి వినియోగ పత్రం)ను టీఎస్-బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, నిర్ణీత ఫీజు చెల్లించి సర్టిఫికెట్ పొందే వీలును మున్సిపల్, పట్టణ పరిపాలన శాఖ కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ లాండ్ యూజ్ సర్టిఫికెట్ పొందే తీరును ట్విట్టర్ వేదికగా తెలిపారు. తమకు అవసరమైన సేవలు కావాల్సిన వారు https://lui.tsbpass.telangana.gov.in తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. సర్వే నంబర్ నమోదు చేసి, తగిన రుసుము చెల్లిస్తే ఆ భూమికి సంబంధించిన ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్ ఇస్తారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో ఈ సర్టిఫికెట్ పొందే సేవలు అందుబాటులో ఉన్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



VISWASANTHI
SENIOR SECONDARY RESIDENTIAL SCHOOL
CBSE SCHOOL
IIT & Medical Foundation from VI to X Classes
Madala Subrahmaneyswara Rao
Founder & Managing Director
Dr. M. SURYASEKHAR
Chief Executive Director
M. SUSHMA
Executive Director
Madala Prameela Rani
Founder
Dr. M. RAJASEKHAR
Director
Dr. M. NEELIMA
Director
Separate Sections & Hostel for...BOYS & GIRLS
A.C. CAMPUS
LKG to X & XI, XII (PCM & PCB)
ESTD : 1975
Affiliated to CBSE, Delhi.
VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.
Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666, 833 300 0899.
Web Site : www.sriviswasanthischools.in
E-mail Id : director.sriviswasanthi@gmail.com
ADMISSIONS ARE IN PROGRESS
NCC "A" & "B" Certificates
మా విశ్వశాంతి స్కూల్ విద్యార్థులే... మా విశ్వశాంతి జూనియర్ కాలేజి విద్యార్థులు... సాధించిన గొప్ప విజయాలు.
అతి తక్కువ మంది విద్యార్థులతోనే... అత్యధిక ర్యాంకులు
Congratulations to All
...2022 Batch Outstanding Achievements in...
IIT, IIST, NIT & IIIT
S. RAGHURAM REDDY IIT CHENNAI
B. Y. V. SAI CHARAN IIT GUWAHATI
K. SAI DURGA PRASAD IIT VARANASI
KANDELA ANAND IIT VARANASI
K. LOHITHA KRUTHIKA IIST THIRUVANANTHAPURAM
PLV SAI CHERITH NIT WARANGAL
P. CHARISHMA NIT ROURKELA
D. SAI SUDHEEPA NIT CALICUT
M. GOPI SUMANDHAR NIT DELHI
B.P. SAI MANIKANTA NIT ROURKELA
K. VSANTHA RAJU NIT SURATHKAL
G. LIKHIL NIT TADEPALLIGUDEM
RG VENATA AYYAPPA NIT WARANGAL
TANISHK R SARODE NIT RURKELA
VIKRAM RATHOD NIT MEGHALAYA
DVS SAI LOKESH REDDY NIT NAGAPUR
KAMBHAM YESWANTH NIT PATNA
M. V. CHARAN RAJ NIT NAGAPUR
PUTTI MOHIT NIT PUDUCHHERI
BOLLA DEEPAK NIT HARYANA
B. RAJA RAJESWARI IIIT TRICHY
POTNURU SAI GOPAL IIIT BHUVNESHWAR
KOTHA DINESH IIIT KOTTAYAM
M. HANEESH IIIT JABALPUR
A. TEJA SWAROOP IIIT KANCHIPURAM
A Golden Feather in our Cap
SECURED ALL INDIA 2ND RANK IN...IIT
ALL INDIA 2 RANK
L S BHARATH REDDY
మా వద్ద విద్యనభ్యసించి, దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న మా విద్యార్థులు...
మా వద్ద విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను డాక్టర్లుగా... ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థ.
...2022 Batch Outstanding Achievement in...
NEET
DUDEKULA NARENDRA Osmania Medical College MBBS - HYDERABAD
AKHIL M THOMAS Guntur Medical College MBBS - GUNTUR
KATTA SANDHYA Guntur Medical College MBBS - GUNTUR
I. BHUMIKA Govt. Medical College MBBS - SRIKAKULAM
SHAIK AFTAB HUSSAIN Rangaraya Government Medical College MBBS - KAKINADA
JANAVATH VARMA NAIK ACSR Medical College MBBS - NELLORE
NERSU LIKHITHA SAI Rajiv Gandhi Institute of Medical Science (RIMS) MBBS - ONGOLE
KONDETI YASASWINI Rajiv Gandhi Institute of Medical Science (RIMS) MBBS - HYDERABAD
AUTHULURI HIMASREE Padmavathi Medical College MBBS - TIRUPATHI
KOTHA YASHASWINI Maharaja Institute Of Medical Sciences (MIMS) MBBS - VIZIANAGARAM
GURIVINDAPALLI SRAVYA Rajiv Gandhi Institute of Medical Science (RIMS) MBBS - ONGOLE
B SAI KUSUMA PRIYA Gayatri Vidhya Parishadh MBBS - VISAKHAPATNAM
TRIPURANENI MADHAVI Katuri Medical College MBBS - GUNTUR
JSV ABHIGNA Katuri Medical College MBBS - GUNTUR
MATTEGUNTA GEETHIKA Siddhartha Medical College MBBS - VIJAYAWADA
D. KSHAKHINAH GOLDY Ashram Medical College MBBS - ELURU
MBBS CH. DHANUSH PRASAD Dr. Pinnamaneni Siddarth Medical College - VJA
DUDEKULA ADI LAKSHMI Fatima Medical College MBBS - KADAPA
B. DRUTHIKA Sri Rama Chandra Medical College MBBS - CHENNAI
BATHOD VENNELA Dr. Patnam Mahinder Reddy Medical College MBBS - HYDERABAD
TUNI SRAVANI Padmavathi Medical College MBBS - TIRUPATHI
B GUNA VARDHAN Rangaraya Medical College MBBS - KAKINADA
Sophisticated Laboratory Equipment For Practicals
for More Details...
https://www.facebook.com/sriviswasanthischools.in
https://www.instagram.com/sri_viswasanthi_institutions
Google Review - https://g.page/r/CQ8veksZ_hkZEBM/review
https://twitter.com/sri_viswasanthi
Google Business - https://g.page/r/CQ8veksZ_hkZEBA
Website - https://www.sriviswasanthischools.in
2022 CBSE - Xth TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 460
ALL INDIA RANK 9th MARKS 491 MUTTATH ASHISH SIMON
ALL INDIA RANK 10th MARKS 490 MADALA SUHASINI
486 KALE ROHITH
484 GANDU NAGA SAI NIHAR
479 BENDALAM SRI RAM
479 RAVI RANJAN PRAKASH
478 M MANEETH AASHISH
477 K HARSHITH KUMAR
477 KANNAN PRIYAVARSHINI
476 KODIMELA NAGA YASASWI
476 HARSH DHIRAJ DALAL
475 POSTIN SINGH AKOIJAM
475 ANKIT KUMAR
472 PUSPITA SEN
471 G SURENDRANATH REDDY
471 MANSI R YENBADWAR
470 MAJJI HEMA SRI
470 PATIBANDLA TANVI
470 MANMOHAN SINGH
469 KATURI SRUTHI
467 S HARSHA NANDA REDDY
467 HARSH PRATAP SINGH
465 K BHANU PRAKASH RAO
465 BANDRAPALLI SRAVANI
465 KALARI VAISHNAVI
465 KATTA SATYA VANI
465 NANCY SINGH
464 G SAI NIKHITHA
464 ADITYA ANAND
462 U KARTHIKA JYOSHINI
462 MAHENDRA SINGH DHONI
461 EKANSH L BARVE
460 TATICHARLA MD SAIF
460 M SMILEE HANSRAJ
460 SATYOM
Congratulations to All
2022 CBSE XII - PCB TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 450
478 INAPAKURTHI BHUMIKA
474 CH DHANUSH PRASAD
469 TRIPURANENI MADHAVI
468 D KSHAKHINAH GOLDY
461 R DHANUSH SAI
455 M BALA APARNA
454 SARASWATI
450 D DEEPIKA
2022 CBSE XII - PCM TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 450
477 D V SAI LOKESH REDDY
477 M VENKATA CHARAN RAJ
475 KATTA SAI DURGA PRASAD
473 SAKET KUMAR
471 G LIKHIL
468 T RAKESH KUMAR
467 T VIKRAM RATHOD
466 B P SAI MANIKANTA
465 VAISHNAVI BHARDWAJ
465 AKSHAYA NAIDU K
464 AMIT RAJ
462 SAKSHI B SONKUSARE
459 C NAVEEN KUMAR
458 HARSHA PHANI TEJA G
452 AMAN KUMAR
451 Y S PRABANDH ESWAR
ఇంతటి అద్భుత విజయాలు సాధించిన మా విద్యార్థినీ... విద్యార్థులకు... మా పై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు... విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉండి వారిని ర్యాంకర్లుగా తీర్చిదిద్దిన అధ్యాపక బృందానికి ప్రత్యేక అభినందనలు - విశ్వశాంతి మేనేజ్‌మెంట్.